ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM శ్రీకాకుళం : fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

19-5-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 108 పేజీలు: 16 వెల: 6.50

కేరళం పీఠంపై విడి సతీశన్

మహిళలకు ఉచిత ప్రయాణం..
ఆశా వర్కర్లకు గౌరవ భృతి పెంపు
-సీఎంగా తొలి సంతకం

5లో

సోమవారం ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష జరిపిన సిఎం చంద్రబాబు

పోలవరం నిర్వాసితుల తరలింపు

వచ్చే ఏప్రిల్‌కు పూర్తి

- ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారమే ప్రాజెక్టు పనులు
- పోలవరం ఎడమ కాల్వ, చంపావతి లింక్‌పై అధ్యయనం
- జలధార-జలహారతి పనులకు ప్రాధాన్యం
- జలవనరులశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

విజయవాడ మే 18. ప్రభాతవార్తప్రతినిధి: ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల నిర్మాణం, శంకుస్థాపనలు చేపట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యతా క్రమంలో ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో 25 ఇరిగేషన్ ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ ను సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ క్రమంలో సోమవారం రాష్ట్ర సచివాలయంలో పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. దీంట్లో భాగంగా ఇరిగేషన్ క్యాలెండర్ అంశంపై చర్చించారు. గతంలో ప్రకటించిన ప్రాజెక్టులు కాకుండా ప్రాధాన్యత కలిగిన మరో 11 ప్రాజెక్టుల పనులు కూడా చేపట్టాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. ఆ మేరకు ఆ 11 ప్రాజెక్టులను ఇరిగేషన్ క్యాలెండరులో చేర్చాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, సివిల్ వర్క్స్ వంటి వాటికి ఎలాంటి నిధుల కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ అధికారులను సూచించారు. గతంలో ప్రకటించిన 25 సమీక్షలో ప్రకటించిన 11 ప్రాజెక్టులను ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా తీసుకుని ప్రకటించిన ఇరిగేషన్ క్యాలెండర్‌కు అనుగుణంగా పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు

లక్ష్యాలకు అనుగుణంగా పోలవరం పనులు: సమీక్షా సమావేశం సందర్భంగా పోలవరం సహా వివిధ సాగు నీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పోలవరం ప్రాజెక్టులో సివిల్ వర్క్స్ 88 శాతం పూర్తి అయ్యాయని అధికారులు వెల్లడించారు. భూసేకరణ 93శాతం పూర్తైందని, నిర్వాసితుల తరలింపు 45 శాతం పూర్తి అయ్యిందని చెప్పారు. ఈ యేడాది ఏప్రిల్ 2వతేదీ నాటికి డయాఫ్రాం వాల్ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులు 2027 మార్చి 31 నాటికి పూర్తి అవుతాయని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. పోలవరం కుడి కాలువను అనుసంధానించే ట్విన్ టన్నెల్స్ పనులు 85 శాతం పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. ఎడమ కాలువ అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్ పనులను చేపడుతున్నట్టు వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు వివిధ ప్రాజెక్టుల పురోగతిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. హంద్రినీవా ఫేజ్1లో భాగంగా కాలువల వెడల్పు 92శాతం పూర్తి అయ్యిందని అధికారులు చెప్పారు. ఫేజ్ 2 కుప్పం పుంగనూరు కాలువల లైనింగ్ 85 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. మల్యాల లిఫ్ట్‌నుంచి రాయలసీమ ప్రాంతానికి తొలిసారిగా 52 టీఎంసీల నీటిని తరలించామని చెప్పారు. మొత్తంగా 432 చెరువులు పూర్తిగా నింపామని వెల్లడించారు. జూన్ 2024 నుంచి ఇప్పటి వరకూ రూ.2123 కోట్లు వ్యయం చేశామని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ఈ >>2

నార్వే రాజు హెరాల్డ్ వి నుంచి అవార్డు అందుకుంటున్న ప్రధాని మోడీ

ప్రధాని మోడీకి నార్వే అత్యున్నత పురస్కారం

'గ్రాండ్‌క్రాస్ ఆఫ్ రాయల్ నార్వేజియన్ ఆర్డర్'ను ప్రదానం చేసిన నార్వే రాజు హెరాల్డ్ వి

ఓస్లో, మే 18: ప్రధాని మోడీ తన విదేశీ పర్యటనలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవ పురస్కారం అందుకున్నారు. నార్వే పర్యటనలో ఉన్నప్రధానికి ఆదేశ అత్యున్నత పుర స్కారం లభించింది. 'గ్రాండ్‌క్రాస్ ఆఫ్ రాయల్ నార్వేజియన్ ఆర్డర్' పురస్కారం అందుకున్నారు. ఓస్లోలో నార్వే రాజు హెరాల్డ్ వి నుంచి ప్రధాని ఈ పురస్కారం అందుకున్నారు. ప్రపంచదేశాల నుంచి మోడీ 32వ ప్రధాన పురస్కా >>2

ఎపి లాసెట్‌లో 80% ఉత్తీర్ణత

పిజి లాసెట్‌లో 79.07శాతం

ఫలితాలు విడుదల చేసిన అధికారులు

తిరుపతి, మే 18ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎపి లాసెట్, పీజీ లాసెట్ 2026 ఫలితాలను అధికారులు విడుదల చేశారు. మే 4న రాష్ట్రవ్యాప్తంగా వంద పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షలు విజయవంతంగా నిర్వహించారు. మొత్తం 30,021మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, వారిలో 23,996 మంది పరీక్షలకు హాజరయ్యారనీ,వీరిలో 19,197 మంది అర్హత సాధించగా, మొత్తం ఉత్తీర్ణత 80శాతంగా నమోదైందని పద్మావతి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఉమ వెన్నం తెలిపారు.

రెండేళ్ల ఎల్ఎల్.ఎం/ఎం.ఎల్ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన పీజీ లాసెట్‌లో 1,904 మంది పరీక్షలకు హాజరై, 1,752 మంది అర్హత సాధించారు. ఈ విభాగంలో అత్యధికంగా 92.02శాతం ఉత్తీర్ణత నమోదైంది. మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు సంబంధించిన లాసెట్‌లో 17,533మంది పరీక్ష రాయగా 13,863మంది అర్హత సాధించారు. ఉత్తీర్ణతశాతం 79.07గా నమోదైంది.ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో 4,559 మంది పరీక్షలకు హాజరై, 3,582మంది అర్హత సాధించగా, ఉత్తీర్ణత శాతం 78.57గా నమోదైంది. స్త్రీ,పురుష అభ్యర్థుల డేటా పరిశీలిస్తే, పురుష అభ్యర్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. మొత్తం 15,809 మంది పురుష అభ్యర్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 13,079మంది అర్హత సాధించడంతో 82.73 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మహిళా అభ్యర్థుల్లో 8,187 మంది పరీక్షలకు హాజరుకాగా, 6,118 మంది అర్హత సాధించి 74.73 శాతం ఉత్తీర్ణత సాధించారు.

అభ్యర్థులు తమ ఫలితాలను హెచ్‌టిటిపిఎస్://సిఇటిఎస్.ఎపిఎస్‌హెచ్ఇ.ఎపి. జివోవి. ఇన్/ లాసెట్‌లో పరిశీలించవచ్చు. మరింత సమగ్రసమాచారం కోసం వాట్సాప్ నంబర్ 9552300009ను సంప్రదించవచ్చు.

జూన్ 1నుంచి కాలువల్లోకి సాగునీరు

పూడిక తొలగింపు నెలాఖరులోగా పూర్తి కావాలి

అందుబాటులో 461టిఎంసిల నీరు

అధికారులతో సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల

విజయవాడ.మే 18.ప్రభాతవార్తప్రతినిధి: జూన్ 1 నుంచి కాలువల్లోకి సాగు నీరు విడుదల చేస్తామని వ్యవసాయ, జలనీటివనరుల శాఖా మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు ప్రకటించారు. ఖరీఫ్-2026 సాగునీటి విడుదలపై మంత్రులు సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాలువల్లో పూడిక తొలగింపు పనులను మే చివరికి పూర్తి చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశాలుజారీచేశారు. గత సీజన్‌లో 2025-26 ఖరీఫ్‌లో 99.35 లక్షల ఎకరాలకు 888 టీఎంసీల నీటి సరఫరా చేశామని, రబీ సీజన్‌లో 23.67లక్షల ఎకరాలకు 153 టీఎంసీల నీరు అందించామని మంత్రులు తెలిపారు. రాష్ట్ర రిజర్వాయర్లలో 461 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని వెల్లడించారు.ఇరు శాఖల ఉన్నతాధికారులతో సుదీర్ఘ చర్చ అనంతరం ఆయా ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టుకు నీటి విడుదలపై షెడ్యూల్ విడుదల చేయడం జరిగింది. ఇందులో పెన్నా డెల్టాకి ఇప్పటికే మే4వ తేదీ నుండి సాగునీటిని విడుదల చేశామని, గోదావరి డెల్టాకు జూన్1వ తేదీ నుండి, గాలేరునగరి సుజల స్రవంతి (జిఎన్ఎస్ఎస్) కింద ఉన్న ఆయకట్టుకు జూన్10వ తేదీనుండి, టిజిపి కడప (ఎస్పీవీబీఆర్ కడప)కు జూన్15 నుండి సాగునీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఉత్తరాంధ్రలోని వంశధార ఆయకట్టుకు జూన్15వ తేదీ నుండి, తోటపల్లి ఆయకట్టుకు జూలై1 నుండి, కృష్ణా డెల్టా ఆయకట్టుకు జూలై1వ తేదీ నుండి, ఏలేరు రిజర్వాయర్ కింద >>2

డిప్యూటీ స్పీకర్‌కు సుప్రీంలో చుక్కెదురు

రామాలయ వివాదంలో యథాతథ స్థితికి ఆదేశం

విజయవాడ, మే 18,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు(ఆర్ఆర్ఆర్) సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమ గోదావరిజిల్లా ఆకివీడు మండలం పెదపేటలోని రామలయం నిర్మాణంపై జోక్యం చేసుకున్న సుప్రీంకోర్టు అక్కడ యథాతథ స్థితినిపాటించాలని ఆదేశించింది. ఇటీవల ఏపీ హైకోర్టు ఈ నిర్మాణం మరియు కూల్చివేతలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ,సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో అక్కడ పనులకు బ్రేక్‌పడింది ఆకివీడు మండలం పెదపేటలోని చారిత్రాత్మక రామ మందిరం వద్ద నిర్మాణాలు, కూల్చివేతలకు సంబంధించిన అంశంపై హైకోర్టు గతంలో స్టేటస్ కో విధించింది.అయితే, ఈ వివాదంపై ఇటీవల ఏపీ హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేసి నిర్మాణాలకు అనుమతి ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు, ఈ వివాదంపై స్పందించి రామాలయం నిర్మాణం, పునరుద్ధరణ పనులపై తక్షణమే స్టేటస్ కో (యథాతథ స్థితి) కొనసాగించాలని స్పష్టం చేసింది.

'పంచాయతీ' మరింత పారదర్శకం

సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డి.సిఎం పవన్ కల్యాణ్

గ్రీన్ షాప్ విధానం ప్రజల్లోకి తీసుకెళ్లండి

రోడ్ల పురోగతి తెలిసేలా ప్రత్యేక డాష్ బోర్డు

సమీక్షలో డి.సిఎం పవన్ కల్యాణ్

విజయవాడ, మే 18,ప్రభాతవార్తప్రతినిధి: స్థానిక సంస్థలు చేసే అభివృద్ధి పనులు మరింత పారదర్శకంగా ప్రజలకు తెలియాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ఇందు కోసం ప్రత్యేకంగా ఒక పబ్లిక్ డాష్ బోర్డును తయారు చేయండి. దీనిలో రాష్ట్రంలో జరుగుతున్న రోడ్ల నిర్మాణం, సంబంధిత అభివృద్ధి పనులు, అలాగే రోడ్ల పరిస్థితి ఎప్పటికప్పుడు తెలుసుకునే వెసులుబాటు ప్రతి ఒక్కరికి కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ 2025- 26 ఆర్థిక సంవత్సరానికి స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఆన్ లైన్ విధానంతో పారదర్శకంగా పన్నులు వసూళ్ల చేసిందని చెప్పారు. పంచాయతీలు ఆదాయ వనరులు మరింత పెంచుకొని ముందుకు సాగాలని, ఇదే రీతిలో సమష్టి కృషిని కొనసాగించి వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఆ స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. పంచాయతీరాజ్‌శాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల ఉన్నతాధికారులతో సోమవారం క్యాంపు కార్యాలయంలో పవన్ కళ్యాణ్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పవన్ కళ్యాణ్ ఇటీవల పంచాయ తీరాజ్ శాఖ ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ"శాలిడ్ వేస్ట్ మేనేజ్మెంటులో భాగంగా తీసుకొచ్చిన స్వచ్ఛరథాల విధానం మంచి ఫలితాలను ఇస్తోంది. స్వచ్ఛందంగా ప్రజలు రథాల వద్దకు వచ్చి పొడి వ్యర్థాలను ఇచ్చి, నిత్యావసరాలను తీసుకెళ్లడం బాగుంది. దీన్ని ప్రతి నియోజకవర్గంలోనూ అమలు చేస్తున్నాం. ఈ విధానాన్ని మరింత విస్తరించేలా ఆలోచన చేయండి. దీంతోపాటు గ్రీన్ షాప్ పేరుతో తిరుపతి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొచ్చిన విధానాన్ని మరింత విస్తరించి, రాష్ట్రమంతటా అమలు చేయాలి. స్వచ్ఛరథాల ద్వారా ఏప్రిల్ నెలలో 18.86 లక్షల కేజీల చెత్తను సేకరించాం. ఆ వ్యర్థాల విలువ రూ. 3 కోట్ల వరకు ఉంటుంది. గ్రీన్ షాపులను ఇదే స్ఫూర్తితో ప్రజలకు దగ్గర చేయాలి. >>2

3 రోజులు వర్ష సూచన

తర్వాత ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం

విజయవాడ మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ వాసులకు రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ మరోసారి కీలక హెచ్చరికలు జారీ చేసింది. నైరుతి రుతుపవనాల రాక, ఉపరితల ఆవర్తనద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ వర్షాల సమయంలో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని ఏర్కొంది. ఆ తర్వాత రోజుల్లు ఉష్ణోగ్రతలు కూడా 3 నుంచి4 డిగ్రీలు పెరుగుతాయని తెలిపింది. నైరుతి రుతుపవనాలు ఈ సోమవరం మే 18న ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలకు కొమరిన్ ప్రాంతంలోని కొన్ని భాగాలకు, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాంతోలని మరికొన్ని ప్రాంతాలకు, ఆండమాన్ సముద్రంలోని చాలా ప్రాంతాలకు మొత్తం అండమాన్ అండ్ >>2

నమ్మించి.. భయపెట్టి 9వ తరగతి బాలికపై అత్యాచారం

ఉమ్మడి ప.గో జిల్లాలో అరాచకం

నలుగురిపై పోక్సో కేసు

పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో, మే 18: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఒకరు. నలుగురిలో అల్లరి చేస్తామని బెదిరించి మరో ఇద్దరు తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం విస్సా కోడేరు గ్రామంలో జరిగిన ఈ సంఘటన సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసింది. ఒక పక్క ఎన్ని కఠినమైన చట్టాలను తీసుకొచ్చినా, ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముక్కుపచ్చలారని చిన్నారుల నుంచి మైనర్ బాలికల వరకూ ఎంతోమంది బాలికలు మృగాల చేతుల్లో బలైపోతున్నారు. చట్టం తీసుకువచ్చి అరెస్టు చేసి జైలుకు తరలిం చడం తప్ప కామాందులు భయపడేలా శిక్షలు >>2

'నీట్' నిందితుడు రఘునాథ్ అరెస్టు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మే18: దేశవ్యాప్త ప్రకంపనల నీట్ యుజి లీక్ వ్యవహారంలో సిబిఐ మరొకరిని ఆరెస్ట్ చేసింది. మహారాష్ట్రలోని లాతూర్‌లో రేణుకై కెమిస్ట్రీ క్లాసెస్(ఆర్‌సిసి) కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు శివరాజ్ రఘునాథ్‌ను అరెస్టు చేసింది. ఆయనను తొమ్మిది రోజుల సిబిఐ కస్టడీకి ప్రత్యేక న్యాయస్తానం అనుమతించింది. ఇప్పుడు జరుగుతున్న విచారణల క్రమంలో ఈ కోచింగ్ సెంటర్ పాత్ర కీలకం అని తేలింది. దీనితో నిర్వాహకుడిని ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు సిబిఐ వర్గాలు సోమవారం తెలిపాయి. మహారాష్ట్రలోని లాతూర్‌లోని ఆయన నివాసంలో జరిపిన సోదాలలో స్వాధీన పర్చుకున్న >>2

'న్యూక్లియర్ ఆర్థికం'లో ఎపి ముందంజ

సోమవారం న్యూఢిల్లీలో జరిగిన 'యుఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా' సదస్సులో పాల్గొన్న మంత్రి లోకేష్

ప్రపంచంలో నమ్మకమైన భాగస్వామిగా నిలుపుతాం

'యుఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా' సదస్సులో మంత్రి లోకేష్

విజయవాడ, మే 18,ప్రభాతవార్తప్రతినిధి: భవిష్యత్ అణు ఇంధన (న్యూక్లియర్ ఎనర్జీ) ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌ను నమ్మకమైన ప్రపంచ భాగస్వామిగా నిలబెట్టడమే తమ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఇది అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.న్యూఢిల్లీలో న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్ (ఎన్ఈఐ), యూఎస్ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్‌ఫోరం (యూఎస్ఐఎస్ పీఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన 'యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా' సదస్సులో లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్‌లో సహజసిద్ధ ప్రయోజనాలు: ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలైన స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరి తరం రియాక్టర్ సిస్టమ్స్‌కు విస్తృత అవకాశాలున్నాయి. భారత్‌లో ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీ రంగంలో నైపుణ్యం, తక్కువ ఖర్చుతో కూడిన ఉత్పత్తి వంటివి కలిసొచ్చే అంశాలు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక మౌలిక వసతులు, పోర్టులు, లాజిస్టిక్స్, వేగవంతమైన అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇది భారతదేశానికి, ఏపీకి ఒక చరిత్రాత్మక అవకాశం" అని వివరించారు. రాష్ట్రానికి ఉన్న సువిశాల తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్టాత్మక పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ వంటివి అదనపుప్రయోజనాలని తెలిపారు.పారిశ్రామికీ కరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యమని, ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖపాత్ర పోషిస్తుందన్నారు.

ఎనర్జీ సెక్యూరిటీ మాకు అత్యంత కీలకం: ప్రపంచ దేశాలు ఆర్థికవృద్ధి, పారిశ్రామిక వ్యాప్తి, డిజిటల్ >>2

ఘోర ప్రమాదం

పెళ్లి బృందం వ్యాన్‌ను ఢీకొన్న కంటైనర్

12 మంది దుర్మరణం

ముంబై, మే 18: మహారాష్ట్రలోని పాల్‌ఘర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముంబై-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో 12 మంది మృతి చెందగా, మరో 25 మందికిపైగా గాయపడ్డారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు >>2

19-5pg2exHMNWJQEGO.qxd:19-5pg2exHMNWJQEGO.qxd 1/1/02 6:41 AM Page 1

పోలవరం నిర్వాసితుల తరలింపు వచ్చే ఏప్రిల్‌కు పూర్తి

>> సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రతీ నెలా పోలవరం పనుల పురోగతిపై సమీక్షి స్తాను. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్1,2 పనులు చెప్పిన సమయానికి పూర్తి చేయాల్సిందే. ఈ ఏడాది జూలై నెల నుంచి పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఎడమ కాలువ నుంచి నీరు అందివ్వాలి. ఎడమకాలువ నీరు మేఘాద్రిగడ్డకు పోలవరం జలాలు తీసుకువెళ్లాక అక్కడి నుంచి వంశధారనాగావళిచంపావతి వరకూ నీరు వెళ్లేలా చూడాలి. మేఘాద్రి గడ్డనుంచి చంపావతి లింక్‌కు ఎంత వ్యయం అవుతుందో అధ్యయనం చేయాలి. పోలవరం ఆర్అండ్ఆర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందించే విషయంలో చట్టప్రకారం ముందుకు వెళ్లాలి. 2027 ఏప్రిల్ నాటికి నిర్వాసితుల తరలింపును పూర్తి చేయాలి. ఎలాంటి వివాదాలు లేకుండా ఆర్ అండ్ ఆర్ వేగంగా పూర్తి కావాలి. పోలవరం స్పిల్ వే దిగువన ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. బెస్ట్ టూరిజం ప్రాంతంగా పోలవరం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం కావాలి అని సీఎం సూచించారు.

వెలిగొండకు హై ప్రయార్టీ: వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ జూలై నాటికి పూర్తి కావాలి. హెడ్ వర్క్స్, కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూసేకరణ లాంటి పనుల కోసం ఇంకా రూ. 2019 కోట్లు అవసరం. టీబీఎంను తొలగించి అడ్డంకులు లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్ బ్యాలెన్సు పనులు వేగంగా పూర్తి కావాలి. అడవిపల్లి, శ్రీనివాసపురం నుంచి నీవా కాలువ ద్వారా చిత్తూరుకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. హంద్రీ నుంచి నీవా వరకూ నీళ్లు తీసుకెళ్లేలా ప్రాధాన్యతగా తీసుకుని పనులు పూర్తి కావాలి. నీళ్లు చూస్తే ప్రజల్లో ఓ నమ్మకం వస్తుంది. మైదుకూరు, మడకశిర లాంటి చివరి ప్రాంతాలకు నీళ్లు వెళ్లాలి. నీవాకు ఈ ఏడాది నీరు ఇచ్చేలా లక్ష్యం పెట్టుకోవాలి. కళ్యాణి డ్యామ్ నీవా బ్రాంచ్ కెనాల్ ద్వారా మూలపల్లి చెరువుకు నీరు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు కాలువ పనులు వచ్చే ఏడాది జూలై నాటికి పూర్తి కావాలి. వరికెపుడిశెలను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించిన ఇంపాక్ట్ స్టడీ చేయాలి. అంతరాష్ట్ర సమస్యలు లేకుండా ప్రాజెక్టులు పూర్తి చేసుకుందాం. నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయమై కేంద్రంతో మాట్లాడదాం. గోదావరికావేరి అనుసంధానం పైనా కేంద్రంతో సంప్రదింపులు జరుపుదాం."అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

ఖరీఫ్‌కు నీరిచ్చే అంశంపై జలవనరులశాఖకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం: ఎల్ నినో లాంటి పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు అంచనాలను సిద్ధం చేసుకుంటూ పంటలు వేసేలా రైతులను సమాయత్తం చేయాలి. నెల్లూరు సాగు తీరును మార్చేలా చర్యలు తీసుకోవాలి. ఈసారి రెయిన్ ఫాల్ మైనస్ 3 శాతంగా ఉంది. భూగర్భ నీటి నిల్వలు 9.49 మీటర్లుగా ఉన్నాయి..గతేడాదితో పోలిస్తే 0.5 మీటర్లు ఎక్కువ ఉంది. ప్రస్తుత నీటి వనరుల్ని నింపేలా స్ట్రక్చర్ల నిర్మాణం జరగాలి. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. సాగునీటి సంఘాలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉండాలని పేర్కొన్నారు. నీటి భద్రత అత్యంత కీలకమనే అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. కృష్ణా డెల్టాలో గతంలో ఆలస్యంగా సాగు సీజన్ ఉండేది. తుపాన్ల ప్రభావం వల్ల పంటనష్టానికి పరిహారం ఇవ్వాల్సి వచ్చేది. పట్టిసీమ ద్వారా గతంలో నీరిచ్చామన్నారు.

ఈసారి సీజన్‌ను ముందుకు తీసుకు వచ్చేలా నిర్ణయాలు తీసుకున్నామన్నారు. వాటర్ మేనేజ్‌మెంట్‌లో ఇది కీలకమైన అంశమన్నారు. మైక్రో ఇరిగేషన్ రంగంలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. నీటి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. జలధారజలహారతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి. ప్రస్తుతం వ్యవసాయం కోసం సుమారు రూ.17వేల కోట్ల మేర విద్యుత్ ఖర్చులను భరిస్తున్నామని పేర్కొన్నారు. భూగర్భజలాలు పెరిగితే విద్యుత్ వినియోగం తగ్గుతుందని, అప్పుడు ప్రభుత్వంపై విద్యుత్ భారం కూడా తగ్గుతుందన్నారు. అందుకే నీటి భద్రతకు ప్రాధాన్యమిస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

సోమవారం న్యూఢిల్లీలో రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్‌తో భేటీ అయిన మంత్రి లోకేష్

రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్‌తో లోకేష్ భేటీ

విజయవాడ,మే 18,ప్రభాతవార్తప్రతినిధి: మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా ఢిల్లీలో భారత దేశంలో రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. క్లీన్ ఎనర్జీ, మ్యానుఫ్యాక్చరింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీ రంగాలపై చర్చించారు. ఆయా రంగాల్లో రష్యాతో ఆంధ్రప్రదేశ్ భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నట్లు చెప్పారు. అలాంటి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారత్, రష్యా మధ్య దశాబ్దాలుగా నమ్మకమైన భాగస్వామ్యం ఉందని లోకేశ్ గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని అర్థవంతమైన సహకార అవకాశాలను అన్వేషించడానికి ఎదురుచూస్తున్నానని మంత్రి లోకేశ్ తెలిపారు.

‘న్యూక్లియర్ ఆర్థికం’లో ఏపి ముందంజ

>> ట్రాన్స్‌ఫర్మేషన్, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటివి ఏకకాలంలో ఎలా సాధించాలని ఆలోచిస్తున్నాయని లోకేష్ అన్నారు. వాతావరణ మార్పులపై ఇచ్చిన హామీలను పాటిస్తూ, ఏఐ యుగానికి అవసరమైన విద్యుత్‌ను తక్కువ ఖర్చుతో, సురక్షితంగా ఎలా అందించాలన్నది పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. “ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆకాంక్షలు విస్తృతంగా ఉన్న నేపథ్యంలో ఇంధన భద్రత (ఎనర్జీ సెక్యూరిటీ) మాకు అత్యంత ప్రాధాన్య అంశం. నేడు ఏపీ దేశంలోనే కీలకమైన పారిశ్రామిక, డిజిటల్ కేంద్రంగా మారుతోంది,“ అని లోకేష్ స్పష్టం చేశారు.

ఇంధన పరివర్తనపై ఆంధ్రప్రదేశ్ దృష్టి: రాష్ట్రంలో కొత్త పారిశ్రామిక కారిడార్లను నిర్మిస్తున్నామని, ఎలక్ట్రానిక్స్ తయారీ సామర్థ్యాన్ని పెంచుతున్నామని లోకేష్ తెలిపారు. విశాఖపట్నాన్ని ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని, అక్కడ 6 గిగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు రాబోతున్నాయని వెల్లడించారు. భవిష్యత్ పరిశ్రమలకు భారీ పరిమాణంలో, 24/7 నిరంతరాయంగా, కాలుష్యరహిత, తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్ అవసరమని, అందుకే ఇంధన ప్రణాళిక ఆర్థిక ప్రణాళికలో కీలకంగా మారిందని వివరించారు. “మా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రెన్యూవబుల్స్, స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్‌మిషన్, గ్రిడ్ ఆధునీకరణ వంటి రంగాల్లో సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నాం,“ అని ఆయన ప్రకటించారు.

భవిష్యత్తులో భారీగా విద్యుత్ అవసరం: భవిష్యత్ పారిశ్రామిక వృద్ధికి కేవలం పునరుత్పాదక శక్తి సరిపోదని తాము వాస్తవికంగా ఆలోచిస్తున్నామని లోకేష్ అన్నారు. ఏఐ కంప్యూటింగ్ విస్తరిస్తున్న కొద్దీ విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోందని, ఒక హైపర్‌స్కేల్ ఏఐనేటివ్ డేటా సెంటర్ ఒక మధ్యస్థ పట్టణానికి సమానమైన విద్యుత్‌ను వినియోగిస్తుందని ఉదహరించారు. గ్లోబల్ కంపెనీలు విశాఖలో గిగావాట్ సామర్థ్యంగల ఏఐనేటివ్ డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయని, వీటికి భారీ విద్యుత్ అవసరమవుతుందని తెలిపారు.

డేటాసెంటర్ల చుట్టూ తయారీ ఎకోసిస్టమ్: తమ దృష్టిలో డేటా సెంటర్ అంటే కేవలం సర్వర్లతో కూడిన భవనాలకు ఆతిథ్యమివ్వడం కాదని, దాని చుట్టూ ఒక పూర్తిస్థాయి తయారీ ఎకోసిస్టమ్‌ను నిర్మించడమే తమ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. కూలింగ్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, బ్యాటరీ స్టోరేజ్ వంటి వాటిని స్థానికంగా తయారు చేయడాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు. ఏఐ టెక్నీషియన్లు, ఎనర్జీ ఇంజనీర్ల కోసం ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి సంస్థలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

న్యూక్లియర్ ఎనర్జీ సప్లయ్ చైన్‌లో భాగస్వామ్యం: న్యూక్లియర్ ఎనర్జీని కూడా ఒక పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థగా చూడాలని లోకేష్ అభిప్రాయపడ్డారు. కేవలం విద్యుత్ ఉత్పత్తికే పరిమితం కాకుండా, పూర్తి న్యూక్లియర్ వాల్యూ చైన్‌లో భాగస్వామ్యం కావడమే ఏపీకి దీర్ఘకాలిక అవకాశమని అన్నారు. కీలక విడిభాగాలు తయారు చేయడం, అత్యాధునిక ఇంజనీరింగ్ సామర్థ్యాలు నిర్మించడం, ప్రపంచస్థాయి భద్రతా ప్రమాణాలు నెలకొల్పడం, భవిష్యత్ వర్క్‌ఫోర్స్‌కు శిక్షణ ఇవ్వడం వంటి వాటిపై దృష్టి సారిస్తామని వెల్లడించారు.

ఎకో సిస్టమ్ నిర్మాణానికి సరైన సమయం: న్యూక్లియర్ ప్రాజెక్టులకు బదులుగా న్యూక్లియర్ పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లను నిర్మించడానికి ఇదే సరైన సమయమని లోకేష్ పేర్కొన్నారు. అణుశక్తి విశ్వసనీయ బేస్‌లోడ్ విద్యుత్‌ను అందిస్తుందని, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని, దీర్ఘకాలంలో పోటీ ధరలకు విద్యుత్‌ను అందిస్తుందని వివరించారు. ఆధునిక న్యూక్లియర్ టెక్నాలజీల వల్ల భద్రతా ప్రమాణాలు కూడా గణనీయంగా మెరుగుపడ్డాయని గుర్తుచేశారు. ఇంధన భవిష్యత్ పైనే ఏఐ భవిష్యత్ ఏఐ విప్లవంవల్ల ఇంధనానికి డిమాండ్ పెరిగిందని, దీనివల్ల న్యూక్లియర్ ఎనర్జీ ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయని లోకేష్ అన్నారు. “ఏఐ భవిష్యత్తు ఇంధన భవిష్యత్తుపై ఆధారపడి ఉంటుంది. భవిష్యత్తులో నమ్మకమైన, స్వచ్ఛమైన బేస్‌లోడ్ విద్యుత్ తప్పనిసరి. ఇది ప్రభుత్వాలు, టెక్నాలజీ ప్రొవైడర్లు, పెట్టుబడిదారుల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలకు అపారమైన అవకాశాలు సృష్టిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఆ భవిష్యత్తులో భాగస్వామ్యం కావాలని కోరుకుంటోంది,“ అని ఆయన తెలిపారు.

యూఎస్ఇండియా న్యూక్లియర్ అధ్యయం: భారత్అమెరికా సహకారం ఇప్పటికే టెక్నాలజీ, రక్షణ, సెమీకండక్టర్లు వంటి రంగాల్లో మార్పులు తెచ్చిందని, ఈ వ్యూహాత్మక భాగస్వామ్యంలో తదుపరి ప్రధాన అధ్యాయం అణుశక్తి రంగమే కాగలదని లోకేష్ బలమైన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఇంధన భాగస్వామ్యంగా కాకుండా, పారిశ్రామిక, తయారీ, ఆవిష్కరణల భాగస్వామ్యంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం పటిష్ఠమైన ఇంధన, పారిశ్రామిక పునాదులు నిర్మిస్తున్నామని, దీర్ఘకాలిక దార్శనికత కలిగిన గ్లోబల్ భాగస్వాములతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేష్ తన ప్రసంగాన్ని ముగించారు.

సోమవారం రాత్రి తిరుమలలో కురిసిన భారీ వర్షం

పలకరించిన నైరుతి: తిరుమలలో జోరువాన

తిరుమల,మే 18పభాతవార్తప్రతినిధి: నైరుతిరుతుపవనాల ప్రవేశంప్రభావంతో సోమవారం రాత్రి తిరుమలలో ఈదురుగాలులతో భారీ వర్షంకురిసింది. వాతావరణంలో మార్పుతో సాయంత్రం చల్లటిగాలులు వీచి జోరువాన అతలాకుతలం చేసింది. రాత్రి కూడా చిరుజల్లులతో పడుతూనే ఉంది. కురిసిన వరద నీటికి ఆలయం పరిసరాలు,ఘాట్‌రోడ్లు జలమయంగా మారాయి. బలమైన చలిగాలులు వీస్తున్నాయి. కొండను పూర్తిగా పొగమంచు కప్పేసింది. ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు వానలో తడుస్తూనే గదులకు చేరుకోవాల్సి వచ్చింది.

వేటకు విరామం..నేడు ‘మత్స్యకార చేయూత’ ఆరంభం

గంగపుత్రులకు అండగా ప్రభుత్వం

కావలిలో నిధులు విడుదల చేయనున్న సిఎం చంద్రబాబు

విజయవాడ మే 18. ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లోని మత్స్యకారుల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. వేట నిషేధ కాలంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా మత్స్యకారులను ఆదుకునేందుకు అమలు చేస్తోన్న ‘మత్స్యకారుల సేవలో’ పథకం కింద వరుసగా రెండో ఏడాది ఆర్థిక సాయం అందించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయనుంది. నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంట గ్రామంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు విడుదల చేయనున్నారు. ప్రతీ ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు... 61 రోజుల పాటు సముద్రంలో చేపలు పిల్లలు పెట్టే సమయంలో వేటకు విరామం ఉంటుంది. ఈ సమయంలో మత్స్యకారుల జీవనానికి ఇబ్బంది లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రతీ కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది.

రెండేళ్లలోనే రూ.505 కోట్ల సాయం: వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేలు ఆర్థికసాయం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. హామీ ఇచ్చినట్టుగానే గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్లు సాయం అందించగా... ఈ ఏడాది 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. ఈ ఏడాది లబ్ధిదారు కుటుంబాల సంఖ్య కూడా పెరిగింది. రెండేళ్లలోనే మత్స్యకారుల కుటుంబాలకు వేట నిషేధ సమయంలో రూ.505 కోట్లను సాయంగా అందించింది. గత ప్రభుత్వం మత్స్యకారులకు కేవలం రూ.10 వేల సాయాన్ని మాత్రమే అందించింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ బలహీన వర్గాల సంక్షేమానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ సాయాన్ని రూ.20,000 పెంచుతూ ప్రజా ప్రభుత్వం బాసటగా నిలిచింది. వరుసగా రెండో ఏడాది ఇవ్వడంతో పాటు లబ్ధిదారుల సంఖ్యను పెంచి నిధులు విడుదల చేయడం ద్వారా మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టమవుతోంది.

ముఖ్యమంత్రి పర్యటన వివరాలు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 09.30 గంటలకు అమరావతి క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 10.30 గంటలకు కావలి మండలం తుమ్మలపెంటకు చేరుకుంటారు. 10.45 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. నిధులు విడుదల చేస్తారు. మధ్యాహ్నం 01.15 గంటలకు గ్రామంలోని మత్స్యకార కుటుంబాలతో భేటీ అవుతారు. 2 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 04.45 గంటలకు తిరిగి అమరావతికి చేరుకుంటారు.

ప్రధాని మోడీకి నార్వే అత్యున్నత పురస్కారం

>> రాన్ని అందుకున్నారు. ఇది 140 కోట్ల మంది భారతీయులకు గర్వకారణమని మోడీ పేర్కొన్నారు. ప్రధాని మోడీ ఐదు దేశాల పర్యటనల భాగంగా సోమవారం మోడీ నార్వేకు చేరుకున్నారు. ఓస్లోలో ఘనస్వాగతం లభించింది. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ జరిగింది. అనంతరం నార్వేకు చెందిన అత్యున్నత పురస్కారమైన గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది రాయల్ నార్వేజియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్‌ను మోడీకి ప్రదానం చేశారు. విదేశాల నుంచి ప్రధాని మోడీ అందుకున్న 32వ ప్రధాన అంతర్జాతీయ పురస్కారం ఇది. గ్రాండ్ క్రాస్ అనేది రాయల్ ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో అత్యున్నత శ్రేణి పురస్కారమని, అసాధారణమైన సేవలు అందించిన వ్యక్తులకు మాత్రమే దీనిని ప్రదానం చేస్తారని నార్వే ప్రభుత్వం పేర్కొంది. గౌరవాన్ని అందుకున్న అనంతరం మోడీ సోషల్ మీడియాలో తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. రాయల్ నార్వేజియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ గ్రాండ్ క్రాస్‌ను అందుకోవడం నాకు గౌరవంగా ఉంది. ఈ గౌరవాన్ని భారతదేశ ప్రజలకు, బలమైన భారత్‌నార్వే స్నేహానికి అంకితం చేస్తున్నాను. ఇది ప్రపంచ పురోగతికి మన ఉమ్మడి నిబద్ధతను ప్రదర్శిస్తుందని పేర్కొన్నారు.

‘పంచాయతీ’ మరింత పారదర్శకం

>> పొడి వ్యర్థాలను గ్రీన్ షాపుల్లో ఇస్తే, ప్రజలు నిత్యావసరాలను తీసుకెళ్లొచ్చని విస్తృత ప్రచారం కల్పించండి. తద్వారా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన పెంచండి

రోడ్లు పూర్తి చేయడానికి నిర్దిష్ట సమయం: పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనులు నిర్దుష్ట సమయంలో నాణ్యతతో పూర్తయ్యేలా చూడండి. రోడ్ల నిర్మాణం, పనుల పురోగతి ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ప్రత్యేకమైన డ్యాష్ బోర్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకురండి. రోడ్ల నిర్మాణ పనులను అధికారులు బాధ్యతగా తీసుకోవాలి. ప్రతి పని మొదలుపెట్టే ముందు కచ్చితంగా ఎప్పటిలోగా పూర్తి చేస్తామనేది సమయం పెట్టుకోండి. ప్రజల వినతుల ద్వారా వచ్చే ప్రతి రోడ్డు పని చక్కగా జరగాలి. ప్రజలకు శాఖ తరఫు నుంచి పూర్తి జవాబుదారీ తనం కనిపించాలి. రోడ్ల విషయంలో నాణ్యతకు పెద్దపీట వేయాలి. నిరంతరం క్షేత్రస్థాయి పరిశీలనలు ఉంటేనే రోడ్ల పరిస్థితి అర్థం అవుతుంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి” అని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈఎన్సీ బాలునాయక్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

విజయవాడ,మే 18,ప్రభాతవార్తప్రతినిధి: మచిలీ పట్నంలోని కలెక్టరేట్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా వెంటనే అప్రమత్తమైన పోలీసులు పురుగులమందు డబ్బాను లాక్కున్నారు. బాధితురాలు భట్టిప్రోలు మం డలం పెద్దపుల్లేరుకు చెందిన సంధ్యారాణిగా గుర్తించారు. గతేడాది తన సోదరి సుధారాణి అనుమానాస్పదంగా మరణించిందని సంధ్యా రాణి తెలిపారు. తన సోదరిమృతి కేసును పోలీ సులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.పీజీఆర్ఎస్‌లో పలుసార్లు ఫిర్యాదు చేసి నా పట్టించుకోలేదని సంధ్యారాణి వివరించారు.

‘నీట్’ నిందితుడు రఘునాథ్ అరెస్టు

>> సెల్‌ఫోన్‌లో నీట్ ప్రశ్నాపత్రం ప్రతి కూడా కనుగొన్నారు. నీట్ పేపర్స్ విక్రయాల గొలుసుకట్టు వ్యవస్థీకృత గ్యాంగ్‌లో రఘునాథ్ చురుకైన వ్యక్తిగా ఉన్నట్లు నిర్ధారించారు. పరీక్షకు పది రోజులముందు ఈ వ్యక్తి ఇతర కుట్రదారుల నుంచి ప్రశ్నాపత్రాలను సంపాదించాడు. జవాబులు కూడా సేకరించుకుని అక్రమానికి పాల్పడ్డట్లు ప్రాథమికంగా గుర్తించారు.దీనితో ఆయనను అరెస్టు చేసినట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి. బేరాలు కుదుర్చుకున్న వారికి ప్రశ్నాపత్రాలను రాతప్రతుల రూపంలో సమకూర్చారని వెల్లడైంది. పరీక్షలు రాయగానే ఈ కాగితాలను సంబధితులు నలిచి చెత్తబుట్టల్లో వేశారని గుర్తించారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకూ పలువురిని అరెస్టు చేసిన సిబిఐ లెక్చరర్లు పివి కులకర్ణి, మనీషా అరెస్టుతో కేసు విచారణను వేగవంతం చేసింది. వీరికి వాంఘ్మరే అనే వ్యక్తి ప్రధానంగా సహకరించాడని వెల్లడైంది. ఇప్పుడు సిబిఐ కస్టడీకి వెళ్లే రఘునాథ్‌ను సిబిఐ విచారిస్తుంది. ఈ వ్యక్తి ఆర్‌సిసి కోచింగ్ సెంటర్‌ను చాలాకాలంగా నిర్వహిస్తున్నారు. ఇప్పుడు అరెస్టు అవుతున్న పలువురితో రఘునాథ్ ఫోన్‌లో మాట్లాడుతున్నప్పటి వీడియోలు కూడా సిబిఐ సేకరించింది. ఇప్పుడు సిబిఐ అరెస్టు చేసిన వారిలో కీలకమైన ముగ్గురు నలుగురు కూడా మహారాష్ట్రకు చెందిన వారే కావడంతో అక్కడి పోలీసు వర్గాలు , నిఘా సంస్థలు ముంబై , పుణే ఇతర చోట్ల కోచింగ్ సెంటర్లపై దృష్టి పెట్టాయి.

వారం - వర్జ్యం

19-05-2026, అధికజ్యేష్ఠ మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
తదియ మ.2.22
మృగశిర ఉ.8.43
వర్జ్యం : సా.4.14-5.40
దు.ఉ.8.10-ఉ.9.02, 2)రా.11.43-రా.12.35
శుభసమయం: ఉ.9.30-10.30
రాహుకాలం – మ.3.00-4.30

వార్తాఫలం

మేషం : అదృష్టాన్ని కన్నా, కృషిని నమ్ముకుంటారు. అధికంగా కృషిస్తారు. ఫలితాలను కూడా తగిన విధంగా పొందుతారు.

వృషభం: అంతర్లీనమైన వేదాంత ధోరణిని కనబరుస్తారు. వివాదస్పద అంశాలకు అయినంత దూరంగా ఉండండి.

మిథునం: ఉద్యోగంలో అధికశ్రమ. అబద్ధాలు చెప్పి పని తప్పించుకునే వారి వలన ఇబ్బందులు సంభవిస్తాయి.

కర్కాటకం: మీ నైపుణ్యాన్ని అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొనడానికి శారీరకంగా మానసికంగా శ్రమిస్తారు.

సింహం: ప్రయాణాలు ఎప్పుడు చేయాలో నిర్ణయించుకుంటారు. ఈ ప్రయాణాలు ముఖ్యమైనవి ప్రభుత్వపరమైన ఉత్తర్వులు అనుకూలంగా వస్తాయి.

కన్య : వెన్ను నొప్పి, కీళ్ళ నొప్పి ఇబ్బంది కలిగించవచ్చు. గడియారంతో పాటు పరిగెడుతారు. ఆరోగ్యం జాగ్రత్త.

తుల : మంచి అవకాశాలు వచ్చినా సంతృప్తి పడని వాళ్ళతో మీకు ఇబ్బందులు వస్తాయి. శుభకార్యాలు చర్చలు ఫలిస్తాయి.

వృశ్చికం: స్వంత వాళ్ళుగా భావించిన వ్యక్తులు రహస్యాలు మీ దగ్గర దాచడం మీ కోపానికి, అసంతృప్తికి కారణం అవుతుంది.

ధనుస్సు: భూమి సంబంధమైన విషయాలు కొనుగోలు అమ్మకాలకు సంబంధించిన వ్యవహారాలు లాభిస్తాయి. వస్త్రలాభం.

మకరం: గతంలో ఆగిపోయిన అమ్మకం వల్ల లాభం పొందుతారు. ఆశించిన వాటిపై అంతగా లాభాలురావు. బంధువుల కలయిక.

కుంభం: యాదృచ్ఛికంగా చేసిన కార్యక్రమాల వల్ల ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి. కపటం లేని మనుషులు సాయంగా ఉంటారు.

మీనం : నూతన బాధ్యతలు సంతోషంగా కలిగిస్తాయి. బాధ్యతల వెనుక ఉన్న సమస్యలు ఒక్కొక్కటిగా మీ ముందుకు వస్తాయి.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

3 రోజులు వర్ష సూచన

>> నికోబర్ దివులకు, తూర్పు మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు దగ్గరగా చేరుకున్నాయని స్పష్టం చేసింది. రాబోయే 3 4 రోజుల్లో ఈ నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియ3ఆ సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు కొమొరిన్ ప్రాంతం , నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రంఒలని మిగిలిని భాగాలు తూర్పు మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలలోకి మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని దీంతో మే 24 నాటికి అంటే 4రోజుల ముందుగానే ఈసారి రుతుపవనాలు కేరళా తీరాన్నితాకే అవకాశం ఉందని తెలిపింది. అలాగే ప్రస్తుతం ఉపరితల ఆవర్తనం దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ దాని పరిసర ప్రాంతాలపై సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 5.8 కిలోమీటర్ల మధ్య ఎత్తులో విస్తరించి ఉందని ద్రోణి అంతరాయం, దక్షిణ లక్షద్వీప్ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఆగ్నేయ ఆరేబియా సముద్రం నుండి కేరళ దక్షిణ అంతర్గత కర్ణాటక, రాయలసీమ మీదుగా దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌పై ఉన్న ఉపరితల ఆవర్తనం వరకు సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ యానాంలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే ఈ వర్షాల సమయంలో గంటలకు 30-40 కిలోమీటర్ల వేగముతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణశాఖ స్పష్టం చేసింది. ఇక దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోనూ రాబోయే 3 రోజులు ఇదే తరహా వాతావరణ పరిస్థితులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. అలాగే కొస్తో ఆంధ్రప్రదేశ్ యానాంలో మంగళవారం వేడి తేమ, అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే అవకాశముందని తెలిపారు. ఆ తరువాత 5 రోజుల్లో వడగాలులు ఒకట లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది. రాయలసీమలో రాగల 5రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40-43 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదు కావచ్చని తెలిపారు.

జూన్ 1 నుంచి కాలువల్లోకి సాగునీరు

>> ఉన్న ఆయకట్టుకు జూలై10 నుండి, కేసి కెనాల్, తెలుగుగంగ, ఎస్ఆర్‌బిసి, టిబిపిఎల్ ఎల్‌సి,తాడిపూడి, పుష్కర ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టుకు జూలై15 నుండి, టిబిపిహెచ్ఎల్‌సి కింద ఉన్న ఆయకట్టుకు జూలై20 నుండి, హంద్రీనీవా సుజలస్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ఆయకట్టుకు జూలై31 నుండి, నాగార్జున సాగర్ ఆయకట్టు కింద జోన్1 (పల్నాడు, గుంటూరు, బాపట్ల)కు జూలై 31న, జోన్2 (ప్రకాశం, మార్కాపురం) ఆయకట్టుకు ఆగష్టు చివరి వారంలో సాగునీటి విడుదల చేయనున్నట్లు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ప్రత్యేక ప్రధానకార్యదర్శి శశిభూషణ్, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ సమూన్, జలవనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఈఎన్సీ నరసింహమూర్తి,మరియు ఇరు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డెల్టా ప్రాంతాలకు నీటి విడుదల షెడ్యూల్: గోదావరి డెల్టాకు జూన్ 1 నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్లు మంత్రులు ప్రకటించారు. కృష్ణా డెల్టాకు జూలై 1 నుంచి, నాగార్జున సాగర్ ఆయకట్టుకు జూలై చివరికి, కె.సి. కెనాల్‌కు జూలై 15 నుంచి, వంశధార ఆయకట్టుకు జూన్ 15నుంచి సాగునీరు విడుదల చేస్తామని తెలిపారు.

అధికారులకు హెచ్చరికలు: రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు వర్చువల్ మీటింగ్ నిర్వహించారు. ఖరీఫ్2026 ప్రణాళికలు, ఎల్‌నినో ప్రభావంపై సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఎరువులు పక్కదారి పడితే అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. యూరియా సరఫరా కోసం రైతులకు ప్రత్యేక కార్డులు అందజేస్తామని, అవసరం మేరకు ఆ కార్డు ద్వారా యూరియా తీసుకోవచ్చని తెలిపారు. ముందస్తు నిల్వలు వద్దని, రెండుమూడు దశల్లో నానో యూరియా వినియోగించాలని సూచించారు. యుద్ధం కారణంగా యూరియా దిగుమతులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశంతతతఉందని, అందువల్ల యూరియాను అవసరం మేరకు మాత్రమే వాడాలని రైతులకు అచ్చెన్నాయుడు సూచించారు.

భగీరథ్ కేసు మల్కాజిగిరి పోక్సో కోర్టుకు బదలీ

హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త: బండి భగీరథ్‌పై నమోదైన ఫోక్సో కేసు మేడ్చల్ కోర్టు నుంచి మల్కాజిగిరి ప్రిన్సిపల్ ఫోక్సో కోర్టుకు బది అయ్యింది. పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో భగీరథ్‌పై కేసు నమోదు కాగా తొమ్మిది రోజుల తరువాత అతన్ని పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. ప్రస్తుతం అతను చర్లపల్లి జైల్లో రిమాండు ఖైదీగా వున్నాడు. ఈ కేసుకు సంబంధించిన విచారణ ఇప్పటి వరకు మేడ్చల్ పరిధిలో వుండగా కేసు తీవ్రతను దృష్టిలో వుంచుకుని దీనిని మల్కాజిగిరి ప్రిన్సిపల్ ఫోస్కో కోర్టుకు బదిలీ చేశారు. మరోవైపు భగీరథ్ అరెస్టు, తదనం తరం జరిగిన పరిణామాలు, ఈ కేసులో అతని పాత్రకు సంబంధించి సిట్ అధికారులు కోర్టుకురిమాండు రిపోర్టు ఇచ్చినట్లుతెలిసింది.దీనికి సంబంధించిన వివరాలను పోలీసులువెల్లడించేందుకు నిరాకరిస్తున్నారు. దీనిపైమంగళవారం నిర్ణయంతీసుకునే వీలుంది.

బాలికపై అత్యాచారం

>> పడకపోవడంతో ఈ ఘాతుకాలకు అంతమన్నది లేకుండా పోతోంది. వివరాల్లో కెళితే విస్సా కోడేరు గ్రామానికి చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని ఒక యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి, భయపెట్టి మరో ఇద్దరు అత్యాచారం చేసి గర్భవతిని చేశారు. ఈ ముగ్గురితోపాటు మరొకరి పైన పోక్సో కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం పాలకోడేరు మండలానికి చెందిన ఒక బాలిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన వెంకట గణేష్ ఆ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి 2024 నుంచి పలుమార్లు శారీరకంగా కలిశాడు. ఇదే అదునుగా గణేష్ స్నేహితుడు దుర్గ మహేష్ (బాబి) బాలికను బలవంతంగా లోబరుచుకున్నాడు. ఇదే గ్రామానికి చెందిన భోగేశ్వరరావు కూడా ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న బాలికను భయపెట్టి అత్యాచారం చేయడంతో పాటు ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. గొరగనుమూడి గ్రామానికి చెందిన లక్ష్మణుడు ఈనెల 9న రైల్వే గేటు సమీపంలో సపో టా తోటలోకి బాలికను బలవంతంగా లాక్కొని వెళ్లి బలాత్కారం చేయడానికి ప్రయత్నంచగా ఆమె పారిపోయి ఇంటికి చేరింది. బాలిక ఆరోగ్య పరిస్థితుల్లో మార్పులు రావడంతో ఈ నెల 15న భీమవరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా ఐదు నెలల గర్భవతిగా వైద్యులు తేల్చారు.దీంతో బాలికను నిలదీయ డంతో ఈ దారుణం బయటపడింది. ఆమె తల్లి దండ్రుల ఫిర్యాదు ఆధారంగా విచారణ నిర్వ హించి నలుగురిపై పోక్సో చట్టంతో పాటు, పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్ఐ రవి వర్మ తెలిపారు.

12 మంది దుర్మరణం

>> చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రక్కును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. కంటైనర్ ఢీకొన్న తీవ్రతకు వాహనం పూర్తిగా దెబ్బతిన్నది. ఘటనాస్థలిలోనే పదిమందికిపైగా మృతి చెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని సమీపఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ముంబై-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై ఈ ఘటన జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

పోలీసులు సహాయక చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషాద ఘటనతో పెళ్లి ఇంట్లో తీవ్రవిషాదం నెలకొంది.

19-5Pg3exHMNWJQETCAKL.qxd:19-5Pg3exHMNWJQETCAKL.qxd 1/1/02 6:19 AM Page 1

తిరుమల సమాచారం

తెలుగు ప్రజలు సంతోషంగా ఉండాలి

తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగు ప్రజలందరూ సంతోషంగా ఉండాలని శ్రీవారిని వేడుకున్నట్లు హైకోర్టు న్యాయమూర్తులు తెలిపారు. సోమవారం ఉదయం తిరుమల ఆలయంలోనికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎవి రవీంద్రబాబు, హైకోర్టు రిజిస్ట్రార్ (ప్రొటోకాల్) జస్టిస్ ఎవి రాఘవస్వామి కుటుంబంతో కలసి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

వరుస సెలవులతో తిరుమల భక్తజనసంద్రం

తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: వేసవిసెలువులు కావడంతో వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు తిరుమలకు పోటెత్తారు. భారీగా భక్తులు తమిళనాడు, కర్ణాటక, తెలుగురాష్ట్రాలు, మహారాష్ట్ర నుండి తరలి రావడంతో సోమవారం ఉదయానికి తిరుమలలోని వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయాయి. సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులకు 10గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఎనిమిది గంటలు సమయం కేటాయిస్తున్నారు. గత వారంరోజుల నుండి తిరుమలలో విపరీతంగా భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, టీ పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

శ్రీవారి భక్తులకు పటిష్ఠ భద్రత

రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి పనులు: హోంమంత్రి అనిత

తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ వైకుంఠం తిరుమలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేశామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. పోలీస్‌శాఖ అన్ని విధాలా భద్రతను పర్యవేక్షిస్తూ భక్తుల భద్రతే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, రాష్ట్ర అభివృద్ధికి శ్రీవారి ఆశీస్సులు కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్‌కల్యాణ్‌కు మరింత శక్తిని ప్రసాదించాలని వేడుకున్నానన్నారు. సోమవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి తిరుమలకు వచ్చిన హోంమంత్రి అనిత ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్ స్వాగతం పలికారు. ఉదయంవేళ కుటుంబంతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవదేవుని దర్శనంతో మనసు ఉల్లాసంగా ఉందన్నారు.

గోవిందరాజస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో సోమవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 23 నుండి 31వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు సంప్రదాయబద్ధంగా ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. గోవిందరాజస్వామి సన్నిధితో పాటు పార్థసారథి స్వామిసన్నిధి, ఆండాళ్ అమ్మ ఆలయం, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, పుండరీకవల్లి అమ్మ ఆలయ ప్రాంగణాలను పవిత్ర జలాలతో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేయడంతో ఆలయ ప్రాంగణం భక్తి పరిమళాలతో నిండిపోయింది. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ వి.ఆర్. శాంతి, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు, ఆలయ ఏఇఒ ఏబీ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రంజిత్, అర్చక బృందం పాల్గొన్నారు.

బుల్లెట్ వేగంతో రాయల్ ఎన్ ఫీల్డ్ మోటార్ సైకిల్ ప్రాజెక్టు

● సిఎంతో రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ ప్రతినిధుల భేటీ ● బుల్లెట్ వాహన మోడళ్లను పరిశీలించిన చంద్రబాబు

విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: బుల్లెట్ వేగంతో రాష్ట్రంలో రాయల్ ఎన్ ఫీల్డ్ ఏర్పాటు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి సమీపంలో ఏర్పాటు చేయనున్న రాయల్ ఎన్ ఫీల్డ్ ప్రాజెక్టును 18 నెలల్లో నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని దీనికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహకారాన్ని అందిస్తుందని సిఎం వెల్లడించారు. రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ సిఇఒ గోవింద రాజన్ సోమవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ యూనిట్ కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రోత్సాహకాలను కల్పించటంపై ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాళ్లకుప్పం, వానల్లూరు గ్రామాల వద్ద రూ.2500 కోట్ల పెట్టుబడితో బుల్లెట్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అత్యాధునిక తయారీ యూనిట్‌తో పాటు టెస్టింగ్ ట్రాక్, పరిశోధనా కేంద్రం, వెండార్ పార్క్ ఎకోసిస్టమ్ కూడా నిర్మిస్తామని అన్నారు. ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 9 లక్షల మోటార్ సైకిళ్లు ఉత్పత్తి చేయనున్నట్టు రాయల్ ఎన్ ఫీల్డ్ సిఇఒ గోవిందరాజన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. త్వరలో ఫ్లైయింగ్ ఫ్లీ సీ6 పేరిట ఎలక్ట్రిక్ వేరియంట్ మోడల్‌ను కూడా తీసుకురానున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పాదనకు సంబంధించి చేపట్టిన వివిధ ప్రాజెక్టులపై రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రతినిధులకు వివరించారు. సౌర, పవన విద్యుత్‌తో పాటు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ ప్రాజెక్టుల గురించి వారికి తెలియచేశారు. అనంతరం రాయల్ ఎన్ ఫీల్డ్ ప్రతినిధులు సిఎంకు బుల్లెట్ 350 మినియేచర్ మోడల్‌ను ముఖ్యమంత్రికి అందించారు. ఈ సందర్భంగా బుల్లెట్ 350 మోటార్ సైకిళ్లకు సంబంధించిన మోడళ్లను సిఎం పరిశీలించారు. హెల్మెట్ ధరించి చంద్రబాబు బుల్లెట్ ఎక్కారు.

భాకరాపేట ఘాట్‌లో ఏనుగుల గుంపు

గంటపాటుగా స్తంభించిన రాకపోకలు

చంద్రగిరి, మే 18 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం భాకరాపేట కనుమ రహదారిలో ఆదివారం అర్ధరాత్రి ఏనుగుల గుంపు సంచారంతో సుమారు గంటపాటు రాకపోకలు స్తంభించాయి. అటవీశాఖ అధికారులు ఏనుగులను అటవీ ప్రాంతంలోకే తరిమేందుకు బాణాసంచా పేల్చినప్పటికీ ససేమిరా అంటూ మొరాయించాయి. చివరకు రోడ్డు దాటుకుని ఏనుగుల గుంపు వెళ్ళడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అందులో రెండు అంబులెన్సులు ఉండడంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేర్చాలని ఎమ్మెల్యే పులివర్తి నాని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశంతో అటవీ, పోలీసు శాఖ అధికారులు ఏనుగులను రహదారిపై నుండి దట్టమైన అటవీ ప్రాంతంలోకి తరిమేసి రాకపోకలను క్రమబద్ధీకరించారు. అటవీ శాఖ ఉన్నతాధికారులను అప్రమత్తం చేసి రాత్రిపూట ప్రయాణికులకు, వాహన చోదకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కొద్దిరోజుల పాటు గస్తీ నిర్వహించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. రాత్రివేళలో భాకరాపేట ఘాట్‌లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వుండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

ఖైదీల్లో పరివర్తన తీసుకువస్తాం

● తప్పుచేసి మళ్ళీ అదే తప్పుచేయకుండా నిఘా

● జైళ్ల శాఖలో ప్రక్షాళన ● తిరుపతిలో హోం మంత్రి అనిత

తిరుపతి, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావడం కోసమే జైళ్లు ఉన్నాయని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. రాష్ట్రంలో అనేక రకాల సంచలనమైన కేసులను త్వరితగతిన విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నాయన్నారు. తిరుపతి సబ్‌జైల్‌ను జిల్లా జైలుగా రూపుదిద్దడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావడం కోసమే జైళ్లు అని చెప్పుకొచ్చారు. తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్ విస్తీర్ణం తక్కువగా ఉందని.. ఖైదీల సంఖ్య 120 మంది ఉండాల్సిం ఉన్నా సామర్థ్యానికి మించి 140 మంది ఉన్నట్లుగా తెలిపారు. సబ్ జైల్ ప్రస్తుత విస్తీర్ణం 70 సెంట్లుగా ఉన్నట్లు జైలు అధికారులు చెప్పారన్నారు. దీన్ని విస్తరించాలా లేక మరోచోట నిర్మాణం చేయాలా అనేది పరిశీలిస్తామని ఆమె తెలిపారు. సోమవారం తిరుపతి న్యాయస్థానాల సముదాయం ప్రాంగణంలోని స్పెషల్ సబ్ జైల్‌ను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం సబ్ జైల్‌కు వెళ్లిన మంత్రి జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులను గురించి జైల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల భద్రత తమ బాధ్యత అని, ఖైదీల్లో కూడా పరివర్తన రావాలని హోంమంత్రి అన్నారు. రాష్ట్రంలో సంచలనమైన కేసులను త్వరితగతిన విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నాయన్నారు. అవసరమైతే మరిన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. జైల్ సిబ్బంది, పోలీసులు వేరన్నారు. ఖైదీల్లో పరివర్తన కోసం జైల్ సిబ్బంది వారికి దగ్గరగా ఉంటూ, మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. జైల్ నుంచి పెరోల్‌పై వచ్చే వారిపై కూడా నిఘా ఉంచుతున్నామన్నారు. జైళ్ల శాఖలో ప్రక్షాళన చేపడతామని చెప్పారు. జాబ్ క్యాలెండర్ ద్వారా పోలీసు, ఫైర్, జైల్ శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తున్నామని హోంమంత్రి అనిత తెలిపారు. సోమవారం మధ్యాహ్నం తిరుపతిలోని సబ్ జైల్‌కు వెళ్లి తనిఖీ చేశారు. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులను గురించి జైల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సబ్ జైలు ప్రస్తుత విస్తీర్ణం 70 సెంట్లుగా ఉందని, దీన్ని విస్తరించడమా లేక మరింత విశాలంగా నూతన భవనాలు నిర్మించడమనేది ఆలోచన చేస్తామన్నారు. అంతకుముందు ఆమె ఖైదీలతో ముచ్చటించి సౌకర్యాలు అడిగి తెలుసకున్నారు. హోంమంత్రి అనిత వెంట తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం, జైల్ సూపరింటెండెంట్ గురుశేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

అలిపిరి వద్ద రూ.500 కోట్లతో భారీ టౌన్‌షిప్!

ఇక అక్కడ నుండే సకల సేవలు



తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలంకొండల్లో తిరుమలక్షేత్రాన్ని పర్యావరణం పరిరక్షణతోబాటు కాలుష్య నియంత్రణలో భాగంగా పెట్రోల్,డీజిల్‌తో నడిచే వాహనాలకు బ్రేకప్ ఇవ్వాలనే ఆలోచనతో టిటిడి అడుగులేస్తోంది. ఇందుకు రవాణాశాఖ, పోలీస్ శాఖ సహకారం తీసుకుని పూర్తిగా విద్యుత్‌తో నడిచే వాహనాలను తిరుమలకు అనుమతించాలనే చర్చ మొదలైంది. దీనివల్ల తిరుమల ఘాట్‌రోడ్లపై కాలుష్య శాతాన్ని భారీగా తగ్గించవచ్చునేది ఆలోచన. ఇందుకు అలిపిరి వద్ద సుమారు రూ.500 కోట్ల వ్యయంతో అన్ని సౌకర్యాలతో భారీ టౌన్‌షిప్ నిర్మాణం చేసే దిశగా కసరత్తు మొదలుపెట్టింది. తిరుమలను నో హారన్ జోన్‌గా తీర్చిదిద్దడంతో బాటు శబ్ద కాలుష్యాన్ని 80శాతం తగ్గించేందుకు ప్రణాళికలు రూపొందించారు. తిరుమలలో రూ.100 కోట్లతో అన్నదానం వంటశాల ఆధునికీకరణ, ఏఐ ఆధారిత రద్దీనియంత్రణ అమలుచేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు దాదాపు 8వేల వరకు వాహనాలు తిరుమలకు వస్తుండటంతో పర్యావరణ, శబ్ద కాలుష్యం పెరుగుతోందనేది పర్యావరణశాస్త్రవేత్తల ఆందోళన, విద్యుత్‌తో నడిచే వాహనాలకు టోల్ ఫీజు కూడా మినహాయింపు ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నారు. సుమారు 150 ఎకరాల్లో నిర్మించే ఈ టౌన్‌షిప్‌లో అలిపిరి వద్దే వసతి, పార్కింగ్, భోజన సౌకర్యాలు, పూజా సామగ్రి వంటి అన్ని సదుపాయాలు కల్పించనున్నారు. భక్తులకు దర్శనాలను మరింత ప్రశాంతంగా, ఆధ్యాత్మికంగా మార్చేందుకు చూస్తున్నారు. అలిపిరి వద్ద టౌన్‌షిప్ ఏర్పాటైతే అక్కడే భక్తులకు వసతి సౌకర్యంతో బాటు దర్శన టిక్కెట్లు, టోకెన్లు జారీచేసే కౌంటర్ల ఏర్పాటుకు నిర్ణయించారు. దేశంలోని అనేక ప్రాంతాలనుండి దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి ప్రతి రోజూ లక్షమందివరకు భక్తులు వస్తున్నారు. కొండపై 50వేలమంది భక్తులు రద్దీ పెరిగితే వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్ క్యూలైన్లు నిండిపోయి వెలుపలకు క్యూలైన్లు విస్తరిస్తున్నాయి. విపరీతమైన రద్దీతో శ్రీవారి దర్శనానికి 18గంటల సమయం పడుతోంది. దీంతో రద్దీకి అనుగుణంగా టిటిడి కొన్ని ప్రత్యామ్నాయ చర్యలు, నిర్ణయాలు తీసుకుంటోంది. తిరుపతి అలిపిరిలో బేస్‌క్యాంపు ఏర్పాటు చేయడం వల్ల వసతి, దర్శన కౌంటర్లు అందుబాటులోకి తీసుకువస్తే సుమారు 30వేలమంది వరకు భక్తులు ఈ క్యాంప్‌లోనే ఉండేందుకు వీలుంటుంది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కూడా అవసరమైన మౌళిక వసతులకు టిటిడికి అనుమతులు ఇచ్చింది. కొండపై రద్దీని నియంత్రించేందుకు వీలుగా అలిపిరిలో టౌన్‌షిప్ ఏర్పాటుపై దృష్టిసారిస్తున్నారు. సాదారణ రోజుల్లోనే తిరుమలకు 80వేల మంది నుండి 90వేల మంది వరకు భక్తులు చేరుకుంటు న్నారు. ఇక వారాంతం, ప్రత్యేక పర్వదినాల్లో, విశేషమైన ఉత్సవాల రోజుల్లో 1.20లక్షల మంది వరకు కూడా భక్తులు తిరుమలకు వస్తున్నారు. అలిపిరి పాత చెక్‌పోస్టు ప్రాంతంలో సమీప స్థలాలను కలుపుకుని శిల్పకళాశాల ప్రాంతంలో ఈ బేస్ క్యాంపు ఏర్పాటుకు స్థలాల పరిశీలన జరిగింది. భక్తులకు సంతోషకరమైన దర్శనంతోబాటు సంతృప్తికర వసతి కల్పించే దుకు బేస్‌క్యాంపు ప్రధానంగా నిలవనుంది. దేశంలోని పల ప్రాంతాల నుండి తిరుపతికి చేరు కునే ప్రైవేటు వాహనాలు, యాత్రికుల వాహనా లను అలిపిరి బేస్‌క్యాంపుకు అనుసంధానం చేసి, ఇక్కడ వసతి కల్పించడం వల్ల శేషాచలం అడవిలో కొలువైన తిరుమలకు వాహనాలు కాలుష్యం, పర్యావరణ పరిరక్షణకు మార్గం సులభమవుతుందని భావిస్తున్నారు. అలిపిరి నుండి భక్తులను ఆర్టీసి విద్యుత్ బస్సుల ద్వారా తిరుమలకు చేరవేయచ్చునేది ప్రధాన ఉద్దేశ్యం కూడా.

జూన్ 5న అంకురార్పణతో కార్వేటినగరం వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడికి అనుబంధంగా ఉన్న చిత్తూరుజిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 6 నుండి 14వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. జూన్ 5వ తేదీ సాయంత్రం అంకురార్పణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. జూన్ 02న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడుతారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 7:30 గంటల నుండి 9:30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు స్వామివారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. జూన్ 6వతేదీ ధ్వజారోహణం (ఉదయం 8:10 నుండి 8:45 వరకు కర్కాటక లగ్నం), రాత్రి పెద్దశేష వాహనం, జూన్ 7న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, జూన్ 8న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనం, జూన్ 9న ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి సర్వ భూపాల వాహనం, జూన్ 10వతేదీ ఉదయం మోహినీ అవతారం, రాత్రి మహాగరుడ వాహనం, జూన్ 11న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం, జూన్ 12న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, జూన్ 13న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, జూన్ 14న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన జూన్ 9న స్వామివారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 300 రూపాయలు చెల్లించి గృహస్తులు (ఇద్దరు) ఈ సేవలో పాల్గొనవచ్చు. పాల్గొనే గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక అప్పం ప్రసాదంగా అందజేయనున్నారు. కాగా జూన్ 15వ తేదీ మధ్యాహ్నం 1:30 నుండి 4 గంటల వరకు పుష్పయాగం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించనున్నారు.

ఎపి ఫార్మసీ కౌన్సిల్ సభ్యుల నియామకం

విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపి ఫార్మసీ కౌన్సిల్ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. హైకోర్టు ఆదేశాలతో మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం అమలు చేసింది. ఎపి ఫార్మసీ కౌన్సిల్ సభ్యులుగా ఎన్‌ఆర్‌పి రెడ్డి, విజయభాస్కర్, నరేంద్ర, రాంబాబు, సుబ్బరామ గుప్తా, కళ్యాణ చక్రవర్తి, ప్రసాదరెడ్డి కుసుమకుమారి, దగ్గుపాటి శ్రీహరిరావులు నియమితులయ్యారు.

ప్రకృతిని పవిత్రంగా భావించడం భారతీయ సంప్రదాయం: సిఎం

విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలలో 89.4 శాతం అటవీ విస్తీర్ణం సాధించిన తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. శేషాచలం అడవుల్లో స్థానిక జాతుల పునరుద్ధరణకు టీటీడీ కృషి చేస్తోందని అన్నారు. అటవీ సంపద పరిరక్షణకు చేపట్టిన చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రకృతిని పవిత్రంగా భావించడం భారతీయ సంప్రదాయమని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ దైవసేవతో సమానమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. భవిష్యత్తు తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన తిరుమల అందించాలనే లక్ష్యంతో టీటీడీ చర్యలు చేపట్టిందని తెలిపారు. తిరుమల పర్యావరణ పరిరక్షణలో టీటీడీ చేస్తున్న కృషి అమోఘమని ప్రశంసించారు. శేషాచలం అటవీ సంపద కాపాడటంలో టీటీడీ నిరంతర చర్యలు కొనసాగాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

ప్రధాని మోడీకి స్వీడన్ పురస్కారం సిఎం చంద్రబాబు అభినందన

విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రధానమంత్రి నరేంద్రమోదీకి స్వీడన్ ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ కమాండర్ గ్రాండ్ క్రాస్ ప్రదానం చేసింది. ఈ పురస్కారంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ప్రధాని మోదీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ప్రధాని మోదీకి లభించిన ఈ గౌరవం భారతదేశానికి గర్వకారణమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారత ప్రతిష్ఠను మరింత పెంచడంలో మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రభావాన్ని బలోపేతం చేయడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని వ్యాఖ్యానించారు. స్వీడన్ ప్రభుత్వం అందించిన 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ కమాండర్ గ్రాండ్ క్రాస్' పురస్కారం ప్రధాని మోదీకి లభించిన 31వ అంతర్జాతీయ గౌరవమని ప్రస్తావించారు. ఇది వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా భారతదేశానికి లభించిన అంతర్జాతీయ గుర్తింపుగా సీఎం అభివర్ణించారు.ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. ముఖ్యంగా వ్యూహాత్మక భాగస్వామ్యాలు, వాణిజ్య సహకారం, సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడంలో మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. భారత్‌ను గ్లోబల్ శక్తిగా నిలబెట్టే దిశగా ప్రధాని తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడంలో, ప్రపంచ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించడంలో ప్రధాని మోదీ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు.

కేరళం సిఎంకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు

విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: కేరళం కొత్త ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. కేరళం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వీడీ సతీశన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అలాగే మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారందరికీ శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు.కేరళం నూతన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. పారదర్శకమైన, ప్రగతిశీలమైన పాలనను అందిస్తూ కేరళం రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని పేర్కొన్నారు. దేవుని సొంత దేశంగా పేరుగాంచిన కేరళం మరింత వృద్ధి, అభివృద్ధి, సుసంపన్నత సాధించాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

సనాతనధర్మాన్ని నిర్వీర్యం చేయలేరు

విహెచ్‌పి రాష్ట్రకార్యదర్శి తనికెళ్ళ సత్యరవికుమార్

తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: సృష్టి ఉన్నంతవరకు సనాతన ధర్మాన్ని ఎవరూ నిర్వీర్యం చేయలేరని, ఇదీ ధర్మాన్ని తెలియజేస్తుందని విహెచ్‌పి రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ళ సత్యరవి కుమార్ తెలిపారు. భగవంతుడు ధర్మం, సత్యం అమలుచేస్తున్నాడని, దేవదేవుని దర్శనం చేసుకున్న వారికి సనాతన హిందూ ధర్మం గురించి అవగాహన ఉంటుందన్నారు. దేవుడంటే నమ్మలేని వాళ్ళు, సనాతన ధర్మం పట్ల విశ్వాసంలేని వాళ్ళు చేస్తున్న అవాకులుచెవాకులను జనం జాగ్రత్తతో గమనించాలన్నారు. హైందవ ధర్మాన్ని ఆ భగవంతుడే కాపాడుతాడని తనికెళ్ళ సత్యరవికుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డితో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ఆయన స్వామివారి దర్శనానంతరం అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

జ్ఞానమ్మకు వెండి ఉరువులు

జ్ఞాన ప్రసూనాంబ దేవికి వెండి ఉరువులు అందిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, మే 18 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి సోమవారం శ్రీకాళహస్తికి చెందిన భక్తులు రూ.5.28 లక్షల విలువ చేసే వెండి ఉరువులను అందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇచ్చే విరాళాలకు 80జి ప్రకారం ఆదాయపు పన్ను మినహాయింపు ఉండటంతో భక్తులు ముందుకు వచ్చి విరాళాలను అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం శ్రీకాళహస్తికి చెందిన వాసు పుష్పాల అమ్మవారికి రూ.5,28,569ల విలువ కల్గిన వెండి ఉరువులను అందించారు. వాటిని ఆలయ ఇఓ బికె వెంకటేశులుకు అందించారు. ఈ కార్యక్రమాల్లో డిఇఇ శ్రీనివాసులు రెడ్డి, కిషోర్, ఎఇఓ మోహన్, దాతల తరఫున బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

టిటిడి వేదపరిరక్షణ ట్రస్ట్‌కు రూ.50 లక్షలు విరాళం

తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు విరాళాలు అందిస్తున్నారు. సోమవారం సాయంత్రం బెంగళూరుకు చెందిన స్వాతి ఎన్.వి, సి.ఏ. శ్రీనివాస శాస్త్రి వేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్టుకు రూ.50,00,101 లక్షలు విరాళమిచ్చారు. దాతలు తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం చెక్కును అందజేశారు.

19-5Pg7exHMNWJQE.qxd:19-5Pg7exHMNWJQE.qxd 1/1/02 6:26 AM Page 1

ప్రగతి పథంలో రథచక్రాలు

- స్త్రీ శక్తితో సహా ఎపిఎస్ఆర్టిసిలో వినూత్న పథకాలు
- కార్మికులకు, ప్రయాణికులకు ఉత్తమ సంక్షేమ కార్యక్రమాలు

విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: ఆర్టిసి అనేది ప్రజా రవాణ వ్యవస్థగానే కాదు, మహిళలకు, దివ్యాంగులకు ఆర్థికంగా అండగా నిలిచే వ్యవస్థగా కూటమి ప్రభుత్వం తీర్చిదిద్దిందని ఎపి రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు గత రెండేళ్ళ కూటమి ప్రభుత్వంలో ఆర్టిసి ప్రగతిని వివరిస్తూ ఓ ప్రకటన విడుదల చేసారు. ఈ తొలి నుంచి ఆర్టిసి అనేది ఓ ప్రజా రవాణ వ్యవస్థగానే ప్రభుత్వాలు భావించాయి. కానీ ఈ ప్రజా రవాణ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించే నిర్ణయాలు తీసుకోవచ్చు.. పేద, మధ్య తరగతి ప్రజలకు భరోసా కల్పించవచ్చు అని కూటమి ప్రభుత్వమే నిరూపించింది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2025 ఆగస్టు 15 స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించింది. అప్పటి వరకు బస్ ఛార్జీలు పెంచిన ప్రభుత్వాలనే చూసిన ప్రజలకు... స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణాన్ని పరిచయం చేసింది కూటమి ప్రభుత్వం. ఆ వర్గం.. ఈ వర్గం అని లేకుండా.. ఎలాంటి షరతులు.. నిబంధనలు లేకుండా అమలవుతున్న ఏకైక పథకంగా స్త్రీ శక్తి పథకమే. ఈ పథకం అమలు ద్వారా ఆర్టిసికి సంక్షేమ చరిత్రలో ప్రత్యేక స్థానం కల్పించింది సిఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ప్రారంభించిన మిగిలిన పథకాలన్ని ఒక ఎత్తు... స్త్రీ శక్తి పథకం మరో ఎత్తు అనే అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమవుతోంది.

స్త్రీ శక్తి పథకంలో ఉన్న గొప్పదనమిదే: స్త్రీ శక్తి పథకంతో పేద, మధ్యతరగతి ప్రజల ఆదాయం ఆదా అవుతోంది. ఇది మహిళల్లో ఆర్థిక సాధికారత పెంచింది. ఓ మహిళా ఉద్యోగి ఆఫీసుకు వెళ్లాలన్నా.. ఓ యువతి కాలేజీకి వెళ్లాలన్నా.. మహిళా రైతు ఉత్పత్తులను మార్కెట్టుకు తీసుకెళ్లి అమ్ముకోవాలన్నా ఆర్టిసి బస్సెక్కి ఉచితంగా తమ గమ్య స్థానాలకు చేరుతున్నారు. అంతే కాకుండా పుట్టింటికి వెళ్లాలన్నా.. బంధువుల ఇంటికి వెళ్లాలన్నా ఉచితంగా ప్రయాణిస్తున్నారు. అలాగే పండుగ దినాల్లో పుణ్యక్షేత్రాలకు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నారు. దీని వల్ల ప్రతి కుటుంబానికి సుమారుగా రూ.2 వేల నుంచి 2,500 ఆదా అవుతున్నట్టు అంచనా. అంటే ఏడాదికి సుమారుగా రూ.25 వేలు ఆదా అవుతోందని లబ్దిదారులే స్వయంగా చెబుతున్నారు. ఇక స్త్రీ శక్తి పథకం వల్ల దేవాలయాలకు ఆదాయం పెరుగుతోంది. పర్యాటక ప్రాంతాల్లో రద్దీ పెరుగుతోంది. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఉపాధి మెరుగవుతోంది. అందుకే ఈ పథకం సూపర్ హిట్ అయింది. స్త్రీ శక్తి పథకం ప్రారంభించిన 9 నెలల్లో 67 కోట్ల ఉచిత ప్రయాణాలు జరిగితే.. సుమారు రూ.2350 కోట్ల మేర సబ్సిడిని ప్రభుత్వం భరించింది. దీనికి రూ.720 కోట్లను ప్రభుత్వం ఆర్టిసికి రీయింబర్స్ చేసింది. ఈ విధంగా ఎప్పటికప్పుడు రీయింబర్స్ చేస్తూ ఆర్టిసిపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తోంది ప్రభుత్వం. ఈ పథకం ద్వారా ఆర్టిసికి స్త్రీ శక్తి బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో సుమారుగా 92శాతానికి పెరిగింది. గతంలో సుమారుగా 60 శాతంగా ఉండే ఆక్యుపెన్సీ రేషియో స్త్రీ శక్తి పుణ్యమా అని 92 శాతానికి చేరింది. ఇందులో పురుష ప్రయాణికుల సంఖ్య 40 శాతంగా ఉంది. ఈ పథకం ఓ విధంగా ఆర్టిసికి అండగా నిలుస్తోంది. స్త్రీ శక్తి కింద వచ్చే సబ్సిడీని ప్రభుత్వం నుంచి అందుకుంటోంది.. అలాగే పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో ద్వారా ఆర్టిసి తన ఆదాయాన్ని పెంచుకుంటోంది. ఇక దివ్యాంగ శక్తి కింద దివ్యాంగులు సుమారు 25 లక్షల ఉచిత ప్రయాణాలు జరిగాయి.

ప్రాణాలు కాపాడుతున్న స్త్రీ శక్తి: బస్సు ప్రయాణం సురక్షితం అనేది ఎపిఎస్ఆర్టిసికి ఉన్న బ్రాండ్. ఈ బ్రాండ్ నిలబెట్టేలా స్త్రీ శక్తి పథకం ఆర్టిసికి ఉపకరిస్తోంది. స్త్రీ శక్తి పథకం అమలు తర్వాత ఆర్టిసిలో ఆక్యుపెన్సీ రేషియో పెరిగింది. చాలా మంది మహిళలు ఆటోల్లో, ఇతర వాహనాల్లో ప్రయాణాలు తగ్గించుకుని ఆర్టిసి బస్సుల్లో ప్రయాణాలు చేస్తున్నారు. దీంతో ప్రమాదాల బారిన పడి చనిపోయే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రకాశం జిల్లా ఎస్పీ నిర్వహించిన సర్వే ప్రకారం స్త్రీ శక్తి పథకం ప్రవేశపెట్టిన తర్వాత ప్రమాదాల్లో మహిళా మరణాల సంఖ్య దాదాపు 39శాతం మేర తగ్గినట్టు వెల్లడైంది. అలాగే ప్రమాదాల్లో పురుషుల మరణాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గినట్టు గుర్తించారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబుకు ప్రకాశం జిల్లా ఎస్పీ వివరించారు. దీనిపై రాష్ట్ర స్థాయి అధ్యయనం చేయించాల్సిందిగా ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఆర్టిసిని, ఉద్యోగులను ఆదుకునేలా ప్రభుత్వం చొరవ: ఎన్నికలకు ముందు సిబ్బంది సమస్యలు, పెండింగ్ బకాయిలు, బస్సుల కొరత వంటి అనేక సవాళ్లను ఆర్టిసి ఎదుర్కొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టిసి పునర్వ్యవస్థీకరణకు ప్రాధాన్యత ఇచ్చింది. ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సేవల మెరుగుదల, ఆధునీకరణ, ఆర్థిక బలోపేతం లక్ష్యంగా అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. డ్రైవర్లు, కండక్టర్లు ఎక్కువసేపు విధులు నిర్వహిస్తూ కుటుంబాలకు దూరంగా పనిచేయాల్సి వస్తుంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో సేవలు అందించే సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ అంశాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రతి నైట్ డ్యూటీకి రూ.150 చొప్పున నైట్ అవుట్ అలవెన్స్ మంజూరు చేసింది. ఈ నిర్ణయంతో ఉద్యోగులకు నెలకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు అదనపు ఆదాయం లభిస్తోంది. ఇది వారి కుటుంబ ఆర్థిక పరిస్థితికి ఊరటనిస్తోంది. ప్రమోషన్ల విషయంలో ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉపశమనం కల్పించింది. 2020కు ముందు నియమితులై ప్రభుత్వ సేవల్లో విలీనమైన ఉద్యోగులకు పాత ఆర్టిసి మార్గదర్శకాలను పునరుద్ధరించడంతో సుమారు 7 వేల మందికి పదోన్నతులు లభించాయి. ఈ నిర్ణయం ఉద్యోగుల కెరీర్ పురోగతికి దోహదపడుతోంది. అనేక మంది ఉద్యోగులు పదోన్నతుల ద్వారా అధిక వేతనాలు, బాధ్యతలు పొందే అవకాశం కలిగింది.

ఎస్‌బిఐ పత్యేక బీమా పథకం ఉద్యోగులకు భద్రతా కవచం: ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే పిటిడి ఉద్యోగులకు కూడా ఎస్‌బిఐఎస్‌జిపి పథకం వర్తింపజేయడం ద్వారా ప్రభుత్వం ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించింది. రూ.1 కోటి ప్రమాద భీమా, సహజ మరణానికి రూ.10 లక్షల బీమా వంటి ప్రయోజనాలు ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక రక్షణగా నిలుస్తున్నాయి. జీరో బ్యాలెన్స్ ఖాతాలు, తక్కువ వడ్డీ రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు ఉద్యోగుల ఆర్థిక అవసరాలను సులభతరం చేస్తున్నాయి. ఇక విరమణ అనంతరం వైద్య ఖర్చులు భారం అవుతాయని భావించే ఉద్యోగులకు ప్రభుత్వం జీవితాంతం ఇహెచ్ఎస్ వైద్య సేవలు అందేలా నిర్ణయం తీసుకుంది. రిటైర్డ్ ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములకు ఈ సదుపాయం పెద్ద ఊరటనిచ్చింది. ఈ చర్య ప్రభుత్వం ఉద్యోగులను కేవలం సేవా కాలంలో మాత్రమే కాకుండా, జీవితాంతం ఆదుకుంటుందనే నమ్మకాన్ని కల్పించింది. విధి నిర్వాహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించడం ద్వారా ప్రభుత్వం మానవత్వాన్ని చాటుకుంది. ముఖ్యంగా అర్హతల విషయంలో సడలింపులు ఇవ్వడం వల్ల అనేక కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభించాయి.

కొత్త బస్సులతో ఆధునిక ప్రయాణం: 1,489 కొత్త బస్సులను ప్రవేశపెట్టడం ద్వారా ప్రభుత్వం ప్రజా రవాణా సేవలను ఆధునికీకరించింది. సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, స్టార్ లైనర్, వెన్నెల వంటి బస్సులు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నాయి. ఈ కొత్త బస్సులు గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాల వరకు ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కల్పిస్తున్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వ సహకారంతో సుమారు 1450 ఈవీ బస్సులు త్వరలో రాబోతున్నాయి. ఇదే కాకుండా బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 338 బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 30 కోట్లు కేటాయించి ప్రజా రవాణా మౌలిక వసతులపై దృష్టి పెట్టింది. ఆధునిక టాయిలెట్ బ్లాకులు, కూర్చునే సదుపాయాలు, ఫ్యాన్లు, శుభ్రత చర్యలు ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని కల్పిస్తున్నాయి. ప్రత్యేకంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

డిజిటల్ ఫీడ్‌బ్యాక్ వ్యవస్థప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యం: 129 బస్ స్టేషన్లలో డిజిటల్ స్కానర్ల ద్వారా ప్రయాణికుల అభిప్రాయాలను సేకరించే వ్యవస్థను ఆర్టిసి ఏర్పాటు చేసింది. ఆర్టిసి అందించే సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలను నేరుగా తెలిపే అవకాశం కల్పిస్తోంది. ఈ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సేవల నాణ్యతను మెరుగుపరచడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ప్రతి వారం ఆర్టిసి సేవలపై స్వయంగా సీఎం పర్యవేక్షిస్తున్నారు. మెరుగైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఆర్టిసి పునర్వైభవానికి బలమైన పునాది వేశాయి. ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సేవల మెరుగుదల, ఆధునికీకరణ, పర్యావరణహిత రవాణా వంటి అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన దూరదృష్టితో ఆర్టిసి రెండేళ్ల ప్రయాణం సాగింది. రెండేళ్లల్లో కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రగతి రథ చక్రం పరుగులు పెడుతోంది.

ఖరీఫ్‌కు వ్యవసాయ శాఖ పూర్తి సన్నద్ధత

విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: ఖరీఫ్-2026 సీజన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొ నేందుకు రాష్ట్ర వ్యవ సాయ శాఖ పూర్తి స్థాయి లో సిద్ధంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర ముందస్తు ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం అమరావతిలోని సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, జేడీలు, జిల్లా వ్యవసాయ అధికారులు తో నిర్వహించిన వర్చువల్ సమీక్షలో మంత్రి ఖరీఫ్ సన్నద్ధతపై విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువులు, పంటల వ్యూహంపై కీలక సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. యూరియా సరఫరా విషయంలో ఎలాంటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాల వారీగా నిల్వలపై పకడ్బందీగా పర్యవేక్షణ ఉండాలని, అధికారుల వద్ద ఉన్న లెక్కలకు వాస్తవ నిల్వలకు పొంతన ఉండేలా చూడాలని ఆయన హెచ్చరించారు. ఎరువుల దుర్వినియోగం, అక్రమ రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత డీలర్లపై తక్షణ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రైతులకు యూరియా సరఫరాను మరింత పారదర్శకంగా చేసేందుకు ప్రత్యేక కార్డుల విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్డు ద్వారా అవసరానికి అనుగుణంగా యూరియా పొందే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. రైతులను సంప్రదాయ వ్యవసాయం నుంచి సుస్థిర, సహజ వ్యవసాయం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. నానో యూరియా, మిశ్రమ పంటలు, అంతర పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎరువులు, విత్తనాల సరఫరా, నిల్వలు, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఖరీఫ్ 2026ను విజయవంతంగా పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ సమూన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పిస్తే రూ.25 వేలు

విజయవాడ, మే 18 ప్రభాతవార్త: రోడ్డుప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ప్రజలు తమ సామాజిక బాద్యతగా భావించి వైద్యశాలకు తరలించాలని ఇలా సాయం చేసిన వారికి పియం.రాహత్ పథకం ద్వారా రూ.25 వేల నగదు పురస్కారం లభిస్తుందని విజయవాడ ఒన్ ట్రాఫిక్ ఏసిపి రామచంద్రరావు తెలిపారు. ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వరరావుతో కలిసి సోమవారం వన్‌టౌన్ మోడల్ గెస్ట్‌హౌస్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించి వాహన దారులకు పలు అంశాల్లో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏసిపి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన గంటలోపు (గోల్డెన్ అవర్) క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తే 99.9శాతం మందిని ప్రాణాపాయం నుండి కాపాడవచ్చున్నారు. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించి ప్రాణదాతలుగా మారాలని పిలుపునిచ్చారు.

రైతుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్పా?: పేర్ని నాని

విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి కోసం భూములిచ్చిన రైతుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్పా అని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు. సోమవరం తాడేపల్లిలో మీడియా సమావేశం లో మాట్లాడారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మంత్రి నారాయణ సమాధానం చెప్పాలి కదా? ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మాపై ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేస్తారా? మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి కోసం ఏం చేశారు. అమరావతిలో అద్దాల కోసం రూ.2500 కోట్లు కేటాయించారు. భూములు ఇచ్చిన రైతులకు మీరేం చేశారు. కేంద్ర మంత్రి పెమ్మసానికి రైతుల కష్టం తెలుసా? రైతులకు ఇచ్చిన ప్లాట్లలో పనులు జరుగుతున్నాయా? రైతుల కోసం నేను మాట్లాడితే యూట్యూబ్ నుంచి తొలగిస్తారా? చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా చమటలు పట్టిస్తోంది. అమరావతిలో మట్టి వ్యాపారం తప్ప మరేమీ జరగటం లేదు. నిత్యం వెయ్యి టిప్పర్లలో మట్టి తరలిపోతోంది. మట్టి మీదనే టీడీపీ ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారని నాని ఆరోపించారు.

శాసనవ్యవస్థ అధికారులు, సిబ్బందికి నేటి నుంచి శిక్షణ

విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: శాసనవ్యవస్థ అధికారులు, సిబ్బంది కోసం ఈనెల 19, 20, 21 తేదీల్లో మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని శాసన వ్యవస్థ సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు శాసనవ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర తెలిపారు. ఫ్రైడ్ లోక్‌సభ సచివాల యానికి అనుబంధంగా ఉన్న పార్లమెంటరీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీస్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణా తరగతుల్లో చట్టాల రూపకల్పన ప్రైవేట్ సభ్యుల బిల్లులు, తీర్మానాలు, ప్రజా ప్రాముఖ్యత గల విషయాలను ప్రస్తావించే సాధనాలు, సభ్యుల కోసం పరిశోధన సమాచారం, ప్రశ్నోత్తరాలు, శాసనవ్యవస్థలో బడ్జెట్ ప్రక్రియ, ఫైల్ నోటింగులు ముసాయిదాలు తయారీ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుంది.

అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ పోలీసు స్టేషన్లు

మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్

శ్రీకాళహస్తి, మే 18 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబు దూర దృష్టితో రాష్ట్రంలో ఐదు స్మార్ట్ పోలీసుస్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శ్రీకాళహస్తిలో రూ.2.75 కోట్లతో నిర్మించిన టూ టౌన్ పోలీసు స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుదీర్ రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ పరిపాలనలో పారదర్శకత, అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు జవాబుదారిగా ఉండటానికి పోలీసుస్టేషన్లను నిర్మించినట్లు వివరించారు. ఇందులో శ్రీకాళహస్తి ఒకటని మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పుణ్యక్షేత్రంలోనూ, రాష్ట్రంలో ప్రజలుఈజ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్‌లో భాగంగా అత్యాధునికి సాంకేతిక పరిజ్ఞానంలో ఈ పోలీసు స్టేషన్‌ను నిర్మించినట్లు వివరించారు. ప్రజా ఫిర్యాదులను తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేసి వాటి పరిష్కారానికి ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించే విధానాన్ని అమలు చేస్తున్నామని అనిత అన్నారు. ఒక బైక్ చోరీ జరిగినా ఇతర నేరం నమోదైనా వాటి పురోగతిని జిల్లా ఎస్పి, హోంశాఖ ఒకే డిజిటల్ డ్యాస్‌బోర్డులో పరిశీలించే విధంగా సాంకేతికతను వినియోగిస్తున్నట్లు మంత్రి వివరించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించుటకు ఈ సరికొత్త వ్యవస్థ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. బాధితుల ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి కేసుల పురోగతిని నిరంతర పర్యవేక్షించే విధానం అమలులో ఉందని చెప్పారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా డిజిటల్ డెస్క్ సీస్టిమ్ ద్వారా కేసులు పరిష్కారం మరింత వేగవంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు, ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజు నాయుడు, పేరం ధనంజయులు నాయుడు, పనబాక లక్ష్మీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్‌సుబ్బరాయుడు ఇతర అధికారులు హాజరయ్యారు.

వారసత్వ సంపదను అందించటంలో మ్యూజియంల పాత్ర కీలకం

విజయవాడ, మే 18 ప్రభాతవార్త: భావితరాలకు మన సంస్కృతి, చరిత్ర, వారసత్వ సంపదను అందించటంలో మ్యూజియంల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డాక్టర్ ఛైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడలోని బాపు మ్యూజియంలో ప్రత్యేక కార్యక్రమాలను రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశాలతో కలిసి డాక్టర్ బాలాజీ ప్రారంభించారు. అనంతరం బాలాజీ మాట్లాడుతూ మ్యూజియంలు పురాతన వస్తువుల కేంద్రాలు మాత్రమే కాదని నాగరికత వికాసాన్ని ప్రతిబింబించే జ్ఞాననిలయాలుగా పేరొ కన్నారు. చిన్నారులు కేవలం మార్కుల వేటలో పడిపోకుండా మన చారిత్రక వారసత్వ వైభవాన్ని తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు.

పాలనలో వేగం పై జాతీయ స్థాయిలో చర్చ
పనితీరు బాగున్న వారికి గుర్తింపు, గౌరవం

- అధికారులు, కలెక్టర్లు, ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సిఎం టెలికాన్ఫరెన్స్
- ఆర్టీజీఎస్ నుంచి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది 40 వేల మందితో నేరుగా మాట్లాడిన చంద్రబాబు
- కాకినాడ జిల్లా ఉద్యోగికి సిఎం కితాబు

విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: సుపరిపాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బ్రాండ్ తెచ్చేలా ఉన్నతస్థాయి అధికారి మొదలుకుని... క్షేత్ర స్థాయి అధికారి వరకు పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. తిలీదితి ప్రాజక్టు శంకుస్థాపన కార్యక్రమం జరిగిన తర్వాత ఏపీ అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ గవర్నెన్స్ పై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోందని సీఎం చంద్రబాబు తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి ముఖ్యమంత్రి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలికాన్ఫరెన్సులో జిల్లాల కలెక్టర్లు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, క్షేత్ర స్థాయి సిబ్బందితో పాల్గొన్నారు. సుమారు 40 వేల మందితో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు సంతృప్తికర సేవలు అందించడంలో టాప్3లో నెల్లూరు, తూర్పుగోదావరి, పల్నాడు జిల్లాల కలెక్టర్లు నిలిచారు. ఈ టెలి కాన్ఫరెన్సు ద్వారా ప్రభుత్వ ప్రాధాన్యతలను ముఖ్యమంత్రి వివరించారు. ప్రభుత్వ సేవల అమలు... అర్జీల పరిష్కారంపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అందించే సేవల గురించి మరింత మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్ర స్థాయి సిబ్బంది సలహాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. గృహ నిర్మాణానికి సంబంధించి ఆ శాఖకు చెందిన కాకినాడ జిల్లాకు చెందిన ఉద్యోగి నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడి.. కొన్ని సూచనలు చేశారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ మంచి సూచనలు చేశారని.. దీన్ని అమలు చేస్తామంటూ సీఎం చెప్పారు. కిందిస్థాయి ఉద్యోగులకు నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడే అవకాశం కల్పించినందుకు పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.



అర్జీల పరిష్కారంపై స్పెషల్ ఫోకస్: "అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఆర్థిక ఆర్థికేత సమస్యలుగా విభజించుకుని పని చేయాలి. ఆర్థికేత సమస్యలను 100 శాతం పరిష్కరించాల్సిందే. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అన్ని చోట్లా రావాలి. అన్ని స్థాయిల్లో ఉండాలి. ఎంఎంసిఎ ప్రాజెక్టుకు 36 రోజుల్లో అనుమతులిచ్చి శంకుస్థాపన కార్యక్రమం చేపట్టాం. ఎంఎంసిఎ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం స్పందించిన తీరుపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. అవినీతి అనేది కన్పించకూడదు.. పారదర్శకతతో ప్రతి ఒక్కరూ వ్యవహరించాలి. నెల్లూరు కలెక్టర్ చేసిన ప్రయోగాన్ని చూసి ప్రతి నియోజకవర్గంలో నాలుగు సార్లు పర్యటనలు చేసేలా ప్రణాళికలు రూపొందించాం. వినతి పత్రాలు స్వీకరిస్తాం. సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం. చిన్న చిన్న పనులైనా వెంటనే స్పందించాలి... సమస్యలను పరిష్కరించాలి. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలగాలి. మన పాలనకు బ్రాండుగా మారాలి. తక్కువ ఖర్చుతో ఇంపాక్ట్ చూపించేలా పనితీరు మెరుగుపర్చుకోవాలి. వేసవిలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలి." అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

డేటా, టెక్నాలజీ ఆధారంగా క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై అలెర్టులు: "ఆరోగ్యం, వ్యవసాయం వంటి అంశాల్లో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవాలి. అడ్వాన్స్ డిసిజ్ సర్వైలెన్స్ సిస్టం ద్వారా వివిధ ప్రాంతాల్లో నమోదవుతున్న వ్యాధులను గుర్తించి అలెర్టులు పంపే విధానం బాగుంది. దీన్ని సంజీవనికి అనుసంధానం చేయాలి. ఏయే ప్రాంతాల్లో ఏయే రకాల పంటలు వేస్తే బాగుంటుందోననే అంశంపై అన్ని అంశాలు పరిశీలించి రైతులకు సూచనలు పంపాలి. ఇసుక లారీలు, వివిధ గనుల తరలించే లారీలను ట్రాక్ చేసేలా చూడాలి. ఏ వాహనామైనా నిబంధనలు ఉల్లంఘించినట్టు కన్పిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మెరుగుపడుతున్న పిహెచ్‌సిల పనితీరు

- ఆరు నెలల్లో 306 కేంద్రాల పనితీరు మరింత మెరుగు
- వైద్య ఆరోగ్య శాఖ స్వీయ సమీక్షతో సత్ఫలితాలు
- మంత్రి సత్యకుమార్‌కు నివేదించిన డిహెచ్ పద్మావతి

విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: గత మార్చి నెలలో 1,144కు 312 పిహెచ్‌సి ఆసుపత్రులు ఎ శ్రేణిలో వచ్చాయి. గతేడాది అక్టోబరు నెలలో 107 పిహెచ్‌సిలు మాత్రమే ఎ శ్రేణిలో ఉన్నాయి. కేవలం ఆరు నెలల్లో మూడు రెట్లు ఎక్కువగా పిహెచ్‌సిలు, ఎ శ్రేణికి చేరుకోవడం గమనార్హం. ఇదే కాల వ్యవధిలో బి శ్రేణి ఆసుపత్రులు 354 నుంచి 455 కు చేరుకున్నాయి. సి, డి, ఇ గ్రేడుల ఆసుపత్రులు తగ్గుతూ వచ్చాయి. హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో నమోదుచేసే వివరాల ప్రకారం పిహెచ్‌సిల పనితీరును శ్రేణుల వారీగా గుర్తించి, సదరు నివేదికను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ పద్మావతి రాష్ట్ర, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అందజేశారు. గతేడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకు నెలల వారీగా 1144 పిహెచ్‌సిల పనితీరు మదింపు వివరాలను డిహెచ్ తన నివేదికలో పొందుపరిచారు. బి గ్రేడ్ కేంద్రాలు తన నివేదికలో పొందుపరిచారు. బి గ్రేడ్ కేంద్రాలు కిందటేడాది అక్టోబరులో 354 ఉండగా మార్చి నాటికి 455 చేరుకున్నాయి. సి గ్రేడులో 298 డి గ్రేడులో 72, ఇగ్రేడులో 7చొప్పున ఆసుపత్రులు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1144 పిహెచ్‌సిలు ఉన్నాయి. ఓపికి 1, ఐపీ-1 ల్యాబ్‌టెస్టు-1, ప్రసవాలు-1 ఇతర ఒకటి చొప్పున కలిపి ఐదు మార్కులు ఇస్తున్నారు. పిహెచ్‌సిల ద్వారా రోగులకు అందచేసే సేవల వివరాల హెచ్‌ఎంఐఎస్ ఎప్పటికప్పుడు నమోదవుతున్నాయి. నెలకు 1500 ఓపి, 100 ఐపీ ల్యాబ్ టెస్టులు,-3000, పది చొప్పున జరగాలి. ఇంకొన్ని ఫలితాలను శాస్త్రీయ కోణంలో విశ్లేషించి పనితీరు ప్రతిపాదికన పిహెచ్‌సిలకు

వైద్య ఆరోగ్య శాఖ శ్రేణులు ఇస్తోంది. సమీక్షా సమావేశాల్లో తక్కువ పనితీరు కనబరిచే ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సత్యకుమార్ సమీక్ష సమావేశాల ద్వారా ఉన్నతాధికారులను ఆదేశిస్తున్నారు. వీటికి అనుగుణంగా జిల్లాలకు వెళ్లే ఆదేశానుసారం అక్కడి అదికారులు పిహెచ్‌సిల వైద్యులతో సమీక్షలు జరుపుతూ వైద్య సేవలు మెరుగపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీనివల్ల పిహెచ్‌సిల పనితీరు క్రమంగా మెరుగుపడుతోంది. దీనివల్ల సి, డి, ఇ గ్రేడ్లలో ఉన్న పిహెచ్‌సిలు తగ్గుతున్నాయి. అన్నమయ్య జిల్లాలో కురబలకోట, పిహెచ్‌సి అక్టోబరు నుంచి మార్చి వరకు ప్రతినెలా ఎ శ్రేణిలో వచ్చింది. ఈస్టుగోదావరి జిల్లాలో బ్రహ్మణగూడెం, చాగల్లు, నల్లజర్ల పిహెచ్‌సిలు వరుసగా ఆరుసార్లు ప్రథమ శ్రేణిలో వచ్చాయి. కాకినాడ జిలాలో తేటగుంట పిహెచ్‌సి ఆరుసార్లు ఇలా ప్రతి జిల్లాలో కొన్ని పిహెచ్‌సిలుఐ దు నుంచి మూడుసార్లు చొప్పున ఎ శ్రేణిలో వచ్చాయి. ఈ ఏడాది మార్చి నెల శ్రేణుల పరిశీలిస్తే వెస్టు గోదావరిలో 34కు, 33, కృష్ణా జిల్లాలో 49కు 42, వైఎస్సార్ కడప-57 కు 42, విజయనగరం జిల్లాలో 48కు 32 పిహెచ్‌సిలు ప్రథమ శ్రేణిలో వచ్చాయి. పోలవరం జిల్లాలో 28 పిహెచ్‌సిలకు 2, మార్కాపురం జిల్లాలో 38కు 1, శ్రీకాకుళం జిల్లాలో 66కు ఒకటి, నెల్లూరు జిల్లాలో 52కు ఒకటి, చిత్తూరు జిల్లాలో 42కు పిహెచ్‌సి ఈ గ్రేడులో ఉన్నాయి. గత మార్చి నెలకు సంబంధించి డి గ్రేడ్ పిహెచ్‌సిలు రాష్ట్రవ్యాప్తంగా 72 ఉన్నాయి. ఇందులో అత్యధికంగా 10 చిత్తూరు జిల్లాలోనే ఉన్నాయి. అలాగే అల్లూరి సీతారామారాజు జిల్లాలో తొమ్మిది, పోలవరం జిల్లాలో 8, మన్యం, శ్రీకాకుళం జిల్లాలో ఏడు చొప్పున, ఏలూరు జిల్లాలో ఆరు చొప్పున డి గ్రేడ్ ఆసుపత్రులు ఉన్నాయి. గత మార్చి నెలలో ఇ గ్రేడు ఆసుపత్రులు ఏడు ఉంటే రెండు పోలవరం జిల్లాలో ఉన్నాయి. నెల్లూరు చిత్తూరు, మార్కాపురం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలో ఒక్కొక్క పిహెచ్‌సి ఉంది.

19-5Pg5.qxd:19-5Pg5.qxd 1/1/02 6:15 AM Page 1

బస్తర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం!

- శాశ్వత శాంతి నెలకొల్పడానికి చర్యలు చేపట్టాం

- జగదల్‌పూర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

జగదల్‌పూర్, మే 18: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో శాశ్వత శాంతిని నెలకొల్పడానికి, అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తికి కూడా చేరేలా చూడటానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం బస్తర్ జిల్లా కేంద్రమైన జగదల్‌పూర్‌లోని 'అమర్ వాటిక' వద్ద మావోయిజంపై పోరాటంలో ప్రాణాలు అర్పించిన 1,000 మందికి పైగా భద్రతా సిబ్బందికి అమిత్ షా నివాళి అర్పించారు. అమర్ వాటిక వద్ద జరిగిన కార్యక్రమంలో, బీజాపూర్ జిల్లాలో జరిగిన మావోయిస్టు దాడిలో అమరులైన భద్రతా సిబ్బంది కలేంద్ర ప్రసాద్ నాయక్, పవన్ కుమార్ మండవి కుటుంబ సభ్యులను షా కలిశారు. వారికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. కేంద్ర హోం మంత్రి భద్రతా సిబ్బందితో కూడా ముచ్చటించి, వారి ధైర్యాన్ని, అంకితభావాన్ని, నిబద్ధతను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ, "బస్తర్ ప్రాంతంలో శాంతి, భద్రత, అభివృద్ధిని నెలకొల్పడంలో మన జవాన్లు చేసిన త్యాగాలు ఎప్పటికీ మరువలేనివి. దేశ భద్రత కోసం తమ ప్రాణాలను అర్పించిన ఆ ధైర్యవంతులైన సిబ్బంది త్యాగం ఎప్పటికీ వృధా కాదు" అని పేర్కొన్నారు. "శాశ్వత శాంతిని నెలకొల్పడానికి, అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తికి కూడా చేరేలా చూడటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి నిబద్ధతతో కృషి చేస్తున్నాయి" అని కేంద్ర హోంమంత్రి వివరించారు. దశాబ్దాల తీవ్రవాద హింస అనంతరం ఇటీవల నక్సల్ రహిత రాష్ట్రంగా ప్రకటించబడిన ఛత్తీస్‌గఢ్‌లో, అభివృద్ధికి సంబంధించిన ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతూ... కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారంనాడు బస్తర్ జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో, భద్రతా శిబిరం నుండి ప్రజా సేవా కేంద్రంగా రూపాంతరం చెందిన మొట్టమొదటి కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని గతంలో వామపక్ష తీవ్రవాద (ఎల్‌డబ్ల్యూఇ) ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న మొత్తం 196 భద్రతా దళాల శిబిరాలలో 70 శిబిరాలను, రాబోయే ఏడాదిన్నర కాలంలో 'సేవా శిబిరాలు' (ప్రజా సేవా కేంద్రాలు)గా మారుస్తామని మంత్రి తెలిపారు. 'బస్తర్ 2.0' కార్యాచరణ ప్రణాళిక ప్రారంభానికి ఈ కార్యక్రమం నాంది పలుకుతుందని అధికారులు తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా భద్రతా శిబిరాలను ప్రజా సంక్షేమ వినియోగ పనుల కోసం "పునరుద్దేశిస్తారు". అభివృద్ధి లోపం కారణంగా ఈ ప్రాంతాలకు మావోయిజం మళ్లీ తిరిగి రాకుండా చూసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన అత్యంత కీలకమైన కార్యాచరణ ప్రణాళిక ఇది అని అధికార వర్గాలు తెలిపాయి. మార్చి 31న రాష్ట్రం సాయుధ మావోయిస్టుల ముప్పు నుండి విముక్తమైందని ప్రకటించిన తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో అమిత్ షా జరిపిన తొలి పర్యటన.

కేరళం పీఠంపై సతీశన్

ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేయించిన గవర్నర్ అర్లేకర్

20 మంది మంత్రులలో రమేశ్ చెన్నితల, కె.మురళీధరన్

హాజరైన మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్, ప్రియాంకగాంధీ, పినరైవిజయన్ ప్రభృతులు

తిరువనంతపురం, మే 18: కేరళంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ప్రభుత్వం కొలువుదీరింది. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో కేరళ 13వ సీఎంగా వీడీ సతీశన్ సోమవారం ప్రమాణం స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ ఆర్లేకర్ ప్రమాణం చేయించారు. సతీశన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు హాజరయ్యారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ హాజరయ్యారు. 20 మంది మంత్రులు ప్రమాణం సతీశన్‌తో పాటు 20 మంది ఎమ్మెల్యేలను గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. వారిలో 14 మంది తొలిసారిగా మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. యూడీఎఫ్ కూటమి పార్టీలతో చర్చల అనంతరం 20 మందికి మంత్రి పదవులను ఖరారు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితల, కే మురళీధరన్, ఎపీ అనిల్ కుమార్, సన్నీ జోసెఫ్‌తో పాటు ఐయూఎంఎల్‌కు చెందిన పీకే కున్హాల్ కుట్టి, ఎన్ శంషుద్దీన్, కెఎం షాజీ, పీకే బషీర్, వీఇ అబ్దుల్ గఫూర్ ఉన్నారు. టీ రాధాకృష్ణన్ స్పీకర్‌గా, షనిమోల్ ఉస్మాన్ (మహిళ) డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించ నున్నారు. సీఎం ఎంపికకోసమే రెండువారాలు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కేరళ ముఖ్యమంత్రి ఎవరనే దానిపై ఉత్కంఠ నడిచింది. కేసీ వేణుగోపాల్, సతీశన్ మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. దాదాపు 10 రోజులకుపైబడి చర్చలు జరిగాయి. ఈనెల14న కాంగ్రెస్ అధిష్ఠానం కేరళ ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ పేరును ప్రకటించింది. మే 7న తిరువనంతపురంలో జరిగిన కాంగ్రెస్ శాసనసభ పక్ష సమావేశంలో రాష్ట్రంలో సీఎల్పీకి కొత్త నాయకుడిని నియమించేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు పూర్తి అధికారం ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. దీనికి అనుగుణంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సహా అనేక ఇతర నాయకులతో సమావేశమైన ఏఐసీసీ పరిశీలకులతో కాంగ్రెస్ అధ్యక్షుడు, సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విస్తృత చర్చలు జరిపారు. ఈ చర్చలన్నింటి ఆధారంగా వీడీ సతీశన్‌ను సీఎల్పీ నాయకుడిగా నియమించాలని నిర్ణయించారు. కొచ్చి సమీప నెట్టూర్‌లో 1964లో జన్మించిన వీడీ సతీశన్ వృత్తిరీత్యా న్యాయవాది. పదేళ్ల కేరళ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగం కేఎస్‌యూతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. 2001 నుంచి పరావూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత ఐదేళ్లుగా కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. ప్రతిపక్ష నేతగా పినరయి విజయన్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేశారు. కేరళ ముఖ్యమంత్రి పదవికి ముగ్గురు సీనియర్ నేతలు తీవ్రంగా పోటీ పడినప్పటికీ చివరకు సతీశన్ వైపే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గుచూపింది. పదేళ్లుగా కేరళలో అధికారానికి దూరమైన పార్టీని విస్తృత ప్రజాబాహుళ్యం మద్దతుతో గెలిపించడంలో సతీశన్ కీలక పాత్ర పోషించారు. విపక్షనేతగా సమర్థంగా పనిచేయడంతో పాటు వామపక్షాల ఆధిపత్యానికి గండికొట్టారు.

సతీశన్ ప్రమాణ స్వీకారంలో లోక్‌భవన్ నిబంధనలు తూచ్!

తిరువనంతపురం, మే 18: కేరళ ముఖ్యమంత్రి సతీశన్ ప్రమాణ స్వీకారంలో లోక్ భవన్ విధించిన నిబంధనల్ని పాటించలేదనే ఆరోపణలు వస్తున్నాయి. వేదికపై కేవలం గవర్నర్, కొత్త సీఎం వీడీ సతీశన్, ప్రమాణ స్వీకారం చేసే మంత్రులు మాత్రమే కూర్చోవాలని లోక్ భవన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని సమాచారం. మిగిలిన నేతలంతా కింద ప్రేక్షకుల్లోనే కూర్చోవాలని పేర్కొన్నట్లు లోక్‌భవన్ వర్గాలు తెలిపాయి. కానీ ఈ ప్రొటోకాల్‌ను ఎవరూ పాటించలేదు. సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ వేడుకలో కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నేరుగా వేదికపైకి వచ్చి కూర్చున్నారు. వీరితో పాటు ప్రతిపక్ష నేత పినరయి విజయన్, సీపీఐ బినోయ్ విశ్వం, బీజేపీ నేత రాజీవ్ చంద్రశేఖర్‌కు కూడా స్టేజ్‌పైనే సీట్లు కేటాయించారు.

దీంతో లోక్ భవన్ ఆదేశాలు పూర్తిగా పక్కనబెట్టినట్లయింది. ఈ కఠినమైన ప్రొటోకాల్స్ వెనుక రాజకీయ కుట్ర ఉందని కాంగ్రెస్ నాయకత్వం ఆరోపించింది. రాహుల్ గాంధీ, ఖర్గేలను స్టేజ్‌పైకి రానివ్వకుండా చేయడానికే ఈ నిబంధనలు పెట్టారని మండిపడింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రధాని, హోంమంత్రులు ఇలాగే వేదికలను పంచుకుంటారని కాంగ్రెస్ గుర్తుచేసింది. లోక్ భవన్ వైఖరి ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉందని విమర్శించింది.

మహిళలకు ఉచిత ప్రయాణం.. ఆశావర్కర్లకు గౌరవభృతి పెంపు

- సిఎంగా సతీశన్ తొలిసంతకం

తిరువనంతపురం,మే 18: ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారంచేసిన వెనువెంటనే ఎన్నికల్లో హామీ ఇచ్చి నట్లుగా మహిళలకు ఉచిత ప్రయాణం, ఆశా వర్కర్ల గౌరవభృతి పెంపు ఫైళ్లపై తొలిసంతకం చేసారు. కెఎస్‌ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలుచేయాలన్న ఆదేశాలు అమలుకు వచ్చాయి. అలాగే ఆశా వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనం పెంచేందుకు కూడా ముఖ్యమంత్రి ఉత్తర్వులు ఆరీచేసారు. మహిళలకు ఉచిత ప్రయాణం జూన్ 15వ తేదీనుంచి అమలులోకి రానున్నట్లు సీఎం స్వయంగా ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలోను, తన మేనిఫెస్టోలో కూడా మహిళలకు ఉచితప్రయాణం ఇసానతమని హామీ ఇచ్చింది. అలాగే ఆశావర్కర్లకు నెలవారీ భత్యం మరో 3వేల రూపాయలు పెంచుతున్నట్లుకూడాప్రకటించింది. ప్రస్తుతం రూ.9వేలు పొందుతున్న ఈ భత్యం ఇకపై 12 వేలకు పెరుగుతుందని సతీశన్‌వెల్లడించారు. తదుపరి భవిష్యత్తులో అవసరమైతే మరోసారి సవరణలు మార్పులు ఉంటాయని కూడా వెల్లడించారు. ఎన్నికల్లో యుడిఎఫ్ ఇచ్చిన హామీలు అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, హామీలు నెరవేర్చడమే తమ ప్రథమ కర్తవ్యమని సతీశన్ చెప్పుకొచ్చారు. 20 మందితోకూడిన కేబినెట్ ప్రమాణంచేసిన సంగతి తెలిసిందే.

బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు గరిష్ట వయోపరిమితి పెంపు - మే 11 నుంచే అమల్లోకి

కోల్‌కతా, మే 18: పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, 'పశ్చిమ బెంగాల్ సర్వీసెస్ (వయోపరిమితి పెంపు) నిబంధనలు, 1981'కు కొత్త సవరణలు జారీ చేయడం ద్వారా వివిధ రాష్ట్ర సర్వీసులలో ప్రవేశానికి గరిష్ట వయోపరిమితిని సవరించింది. పశ్చిమ ఈ మేరకు బెంగాల్ ఆర్థిక శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉత్తర్వు ప్రకారం, గ్రూప్ ఎ నియామకాలకు గరిష్ట వయోపరిమితిని ఇప్పుడు 41 సంవత్సరాలకు పెంచారు. ఇప్పటికే అధిక వయోపరిమితి ఉన్న ఏ పోస్టు అయినా ప్రస్తుత నిబంధన ప్రకారమే కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రూప్ బి పోస్టులకు గరిష్ట వయోపరిమితిని 44 సంవత్సరాలకు సవరించారు. గ్రూప్ సి, గ్రూప్ డి పోస్టులకు గరిష్ట వయోపరిమితిని 45 సంవత్సరాలకు పెంచారు. రాష్ట్ర చట్టబద్ధ సంస్థలు, ప్రభుత్వ కంపెనీలు, స్థానిక సంస్థలలో నియామకాల పశ్చిమ బెంగాల్ నియంత్రణ చట్టం, 1999 పరిధిలోకి వచ్చే నియామ కాలలో, పబ్లిక్ సర్వీస్ కమిషన్ యంత్రాంగం వెలుపల ఎంపిక జరిగే చోట, అనుమతించబడిన గరిష్ట వయోపరిమితి.

ఢిల్లీ లిక్కర్ కేసు విచారణ మరొక జడ్జికి బదలాయింపు!

న్యూఢిల్లీ, మే 18: ఢిల్లీ లిక్కర్ కేసు విచారణకు సంబంధించిన తీవ్రస్థాయిలో జరిగిన వివాదానికి తెరపడింది. జస్టిస్ స్వర్ణకాంతశర్మ బెంచ్‌నుంచి కేసును తప్పించాలని కోరిన ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ కృషి సఫలం అయింది. ఇకపై ఈ కేసును జస్టిస్ మనోజ్ జైన్ విచారించనున్నారు. అనేక నాటకీయ పరిణామాల మధ్య ఈ కేసు విచారణ నుంచి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తప్పుకొన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఢిల్లీ హైకోర్టులో ఈ కేసు విచారణ సాగుతోంది. ఈ కేసులో ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలైన మనీష్ సిసోడియా వంటి నేతలు కీలక నిందితులుగా ఉన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా పలువురు నిందితులపై సీబీఐ మోపిన అభియోగాల్ని ఇటీవల ట్రయల్ కోర్టు కొట్టేసిన సంగతి తెలిసిందే. దీంతో కేజ్రీవాల్ సహా నిందితులంతా బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే, ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. తాజాగా ఈ కేసు విచారణ మంగళవారం జరగనుంది. దీన్ని జస్టిస్ మనోజ్ జైన్ ఆధ్వర్యంలోని బెంచ్ విచారించనుంది. ఇంతకుముందు ఈ కేసును జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఆధ్వర్యంలోని బెంచ్ విచారించింది. ఆమె ఈ కేసు వాదించడాన్ని కేజ్రీవాల్ సహా నిందితులు వ్యతిరేకించారు. జస్టిస్ స్వర్ణకాంత శర్మపై పలు ఆరోపణలు చేశారు. ఆమెకు ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలతో సంబంధాలున్నాయని, కేసు విచారణ నిష్పక్షపాతంగా జరగదని తెలిపారు. అందుకే, ఆమె ఉంటే కేసు విచారణకు హాజరయ్యేది లేదన్నారు. ఇదే సమయంలో గతంలో జరిగిన కేసు విచారణకు సంబంధించిన వీడియోని కేజ్రీవాల్ సహా నిందితులు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఫొటోలు, వీడియోల్ని కూడా షేర్ చేశారు. దీంతో ఈ అంశం వివాదాస్పదమైంది. కోర్టులు, న్యాయవ్యవస్థ గౌరవాన్ని తగ్గించేలా ఆమ్‌ఆద్మీ నేతలు వ్యవహరించారని జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఆరోపించారు. ఈ మేరకు కేజ్రీవాల్ సహా నిందితులపై దీనిపై కేసు నమోదైంది. ఇదే సమయంలో ఈ కేసు విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు జస్టిస్ స్వర్ణకాంత శర్మ ప్రకటించారు. ఆమె తప్పుకోవడంపై ఆమ్ ఆద్మీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం నెలనెలా రూ.3వేలు ఆర్థికసాయం

బెంగాల్‌లో సువేందు ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు..

కోల్‌కత్తా, మే 18: పశ్చిమ బెంగాల్‌లో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతోంది. ఎన్నికల్లో హామీ మేరకు కొన్ని పథకాల అమలుపై నిర్ణయం తీసుకున్నారు. బెంగాల్ రాజధాని కోల్‌కతాలో సోమవారం సీఎం సువేందు అధికారి ఆధ్వర్యంలో రెండోసారి క్యాబినెట్ భేటీ జరిగింది. ఈ భేటీలో జూన్ 1 నుంచి పలు పథకాల అమలు చేయాలని నిర్ణయించారు. క్యాబినెట్ భేటీలో ప్రధానంగా ఐదు కీలక అంశాలపై చర్చ జరిపి, ఆమోదం తెలిపారు. వచ్చే జూన్ 1 నుంచి అన్నపూర్ణ పథకం అమలు చేస్తారు. అర్హులైన మహిళలకు ఈ పథకం కింద నెలకు రూ.3,000 ఆర్థిక సాయం అందిస్తారు. ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు జూన్ 1 నుంచి ఉచిత ప్రవేశం కల్పిస్తారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సీఏఏ చట్టం కింద భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలకు కూడా సంక్షేమ పథకాలు అందిస్తామని బెంగాల్ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అగ్నిమిత్ర పాల్ తెలిపారు. ఇప్పటికే అమలవుతున్న లక్ష్మీ భండార్ పథకం లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తు చేయకుండానే అన్నపూర్ణ పథకానికి అర్హత పొందుతారని మంత్రి చెప్పారు. ఈ పథకం పొందలేని వారు దరఖాస్తు చేసుకునేందుకు త్వరలోనే కొత్త పోర్టల్ ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ శాఖల సిబ్బంది కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. మరోవైపు మతపరమైన సంక్షేమ పథకాల్ని, ప్రోత్సహకాల్ని జూన్ 1 నుంచి రద్దు చేయబోతున్నట్లు తెలిపారు. దీని ప్రకారం మదర్సాలకు అందించే సాయం ఆగిపోయే అవకాశం ఉంది. ఓబీసీలకు అందించే పథకాల అమలుకు కొత్త కమిషన్ ఏర్పాటు చేయబోతున్నారు. త్వరలో ప్రభుత్వం కొత్త ఎలక్ట్రిక్ బస్సుల్ని కొనుగోలు చేయనుంది. కేంద్రంతో కలిసి ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయబోతున్నట్లు ఇటీవలే సువేందు అధికారి ప్రభుత్వం ప్రకటించింది.

అమెరికాపై డ్రోన్ల దాడులకు క్యూబా వ్యూహాలు!

కలవరపడుతున్న అగ్రరాజ్యం

హవానా, మే 18: క్యూబాను అమెరికా ఇప్పుడు ఓ భద్రతాపరమైన ముప్పుగా పరిగణిస్తోంది. సుమారు 300కు పైగా సైనిక డ్రోన్లను హవానా సమీకరించుకుందని, అమెరికా లక్ష్యాలపై దాడులకు సంబంధించిన ప్రణాళికలు చర్చిస్తోందని వర్గీకృత నిఘా వర్గాలు గుర్తించినట్లు యాక్సియోస్ కథనం వెల్లడించింది. దీంతో ట్రంప్ యంత్రాంగంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఉద్రిక్తతలు పెరిగితే గ్వాంటనామో బేలోని అమెరికా నావికా స్థావరం, సైనిక నౌకలు, ఫ్లోరిడాలోని కీ వెస్ట్‌పై దాడులకు క్యూబా అధికారులు ప్రణాళికలు రచించినట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు. క్యూబాకు రష్యా, ఇరాన్‌లతో పెరుగుతున్న రక్షణ సంబంధాలు, హవానాలో ఇరాన్ సైనిక సలహాదారుల ఉనికిపై అమెరికా ఆందోళన చెందుతోంది. ఇంత సమీపంలో ఇలాంటి టెక్నాలజీలు ఉండటం ఆందోళన కలిగించే అంశం, ఇదొక పెరుగుతున్న ముప్పు అని ఒక సీనియర్ అమెరికా అధికారి వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల నేపథ్యంలో సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ గురువారం క్యూబాలో పర్యటించి, ఎలాంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. 1996లో రెండు విమానాలను కూల్చివేసిన ఘటనలో క్యూబా మాజీ నేత రౌల్ క్యాస్ట్రోపై అభియోగాలు నమోదు చేసేందుకు అమెరికా న్యాయశాఖ సిద్ధమవుతోంది. ఈ ఆరోపణలను క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ ఖండించారు. ఆంక్షలు, సైనిక జోక్యాన్ని సమర్థించుకునేందుకే అమెరికా తప్పుడు కేసు బనాయిస్తోందని ఆరోపించారు. ఐక్యరాజ్యసమితి చార్టర్ ప్రకారం ఆత్మరక్షణ హక్కు తమకుందని స్పష్టం చేశారు. అయితే, డ్రోన్లు ఉన్నాయా లేదా అనే విషయాన్ని క్యూబా నేరుగా ఖండించలేదు.

సంక్షిప్తంగా..

ఇరాక్‌లో ఒకటికాదు.. రెండు ఇజ్రాయెల్ రహస్య స్థావరాలు

బాగ్దాద్, మే 18: ఇరాన్‌పై దాడులు చేసేందుకు ఇజ్రాయెల్.. ఇరాక్ ఎడారిలోని కర్బలా నగరానికి సమీపంలో ఉన్న ఎండిపోయిన సరస్సులో రహస్యంగా సైనిక స్థావరాన్ని నిర్మించినట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే ఇరాక్‌లో ఉన్నది ఒక రహస్య స్థావరం కాదని.. రెండు ఉన్నాయని అక్కడి అధికారిక వర్గాలు వెల్లడించాయి. పశ్చిమ ఎడారి ప్రాంతంలో రెండో స్థావరం కూడా ఉన్నట్లు ఆ దేశ సైన్యం గుర్తించింది. ఇరాన్‌పై 2025లో ఇజ్రాయెల్ నిర్వహించిన 12 రోజుల దాడులు ఈ స్థావరం నుంచే చేసినట్లు వెల్లడించింది. ఈ రహస్య స్థావరాన్ని రక్షించే క్రమంలో ఇటీవల ఇరాక్ సైనికుడు, ఓ పౌరుడు కూడా ప్రాణాలు కోల్పోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

2024లో ఇజ్రాయెల్ రెండో స్థావరాన్ని నిర్మించిందని.. దాని గురించి అమెరికాకు కూడా తెలుసని ఇరాక్ అధికారులు వెల్లడించారు. అయితే ప్రస్తుతం ఆ స్థావరంలో సైనికులు ఉన్నారా, లేదా అనే విషయంపై స్పష్టత లేదన్నారు.

మదురై వద్ద ఘోర ప్రమాదం : ఐదుగురు మృతి

మదురై, మే 18: తమిళనాడులోని మధురై సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకోవడంతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురైలోని అన్నా నగర్‌కు చెందిన ప్రకాశ్, అతని బంధువు రమేశ్‌తో పాటు మరో ముగ్గురు మహిళలు కారులో తిరుచిరాపల్లిలోని ప్రముఖ సమయపురం మరియమ్మన్ ఆలయానికి వెళ్లారు. దైవ దర్శనం ముగించుకుని తిరిగి మధురైకి బయలుదేరారు. మేలూరు సమీపంలోని అయ్యపట్టి వద్ద హైవేపై వీరి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బ్యారియర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జయి, అందులో ప్రయాణిస్తున్న ఐదుగురూ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు.

ఇమ్రాన్ పదవీచ్యుతికి అమెరికా కుట్ర, రహస్యపత్రాలు లీక్..

కరాచి, మే 18: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను పదవి నుంచి దించేయడం వెనుక అమెరికా హస్తం ఉందంటూ ఆరోపిస్తున్న ఓ రహస్య దౌత్య పత్రంవెలుగులోకి వచ్చింది. అమెరికాకు చెందిన డ్రాప్ సైట్ అనే పరిశోధక వార్తా సంస్థ ఈ పత్రాల పూర్తి సారాంశాన్ని బయటపెట్టింది. ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో కూలిపోవడానికి సరిగ్గా నెల ముందు అంటే 2022 మార్చిలో అమెరికా అధికారి డోనాల్డ్ లూ, అప్పటి అమెరికాలోని పాక్ రాయబారి అసద్ మజీద్ ఖాన్ మధ్య జరిగిన సంభాషణలు ఈ పత్రంలో ఉన్నాయి. ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో పాకిస్థాన్ తటస్థంగా ఉండటాన్ని అమెరికా తీవ్రంగా తప్పుబట్టినట్లు ఈ పత్రాల ద్వారా తెలుస్తోంది.

ఇమ్రాన్ ఖాన్ రష్యా పర్యటనను ఆయన సొంత నిర్ణయంగానే అమెరికా చూసిందని డోనాల్డ్ లూ పేర్కొన్నారు. ఒకవేళ ప్రధానిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గితే వాషింగ్టన్ అంతా మర్చిపోతుంది. లేదంటే పాకిస్థాన్‌కు ముందు ముందు రోజులు చాలా కష్టంగా ఉంటాయి అని అమెరికా అధికారి హెచ్చరించినట్లు ఆ పత్రాల్లో ఉంది.

గ్యాస్ సిలిండర్ లీక్‌తో భారీ పేలుడు..

ఫతేపూర్,యుపి మే 18: ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్ జిల్లాలో గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో ఓ ఇంట్లో భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో 9 మందికి తీవ్ర గాయాలయి వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. బాధితులను మెరుగైన చికిత్స కోసం కాన్పూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. కల్యాణ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిల్ఖిని గ్రామంలో ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సంతోష్ లోధి భార్య కళావతి ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ పైపు నుంచి లీకైంది. క్షణాల్లో ఇల్లంతా గ్యాస్ వ్యాపించి, ఒక్కసారిగా మంటలు అంటుకుని భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి ఇంట్లో ఉన్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

సోషల్‌మీడియాతో ట్రంప్ ఇరాన్‌పై మైండ్‌గేమ్!

వాషింగ్టన్, మే 18: అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధ ప్రతిష్టంభన కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దూకుడును సోషల్ మీడియా వేదికగా ప్రదర్శించారు. తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ఇరాన్‌ను హెచ్చరిస్తూ, రెచ్చగొట్టేలా ఉన్న ఏఐ చిత్రాలను వరసగా పోస్ట్ చేశారు. కొన్ని గంటల వ్యవధిలోనే ట్రంప్ 20కి పైగా చిత్రాలను పంచుకున్నారు. వీటిలో చాలా వరకు ఇరాన్పై అమెరికా సైనిక చర్యను తీవ్రతరం చేస్తున్నట్లుగా ఉన్నాయి. ఇరాన్ పటాన్ని అమెరికా జెండాతో కప్పి, చుట్టూ బాణాలు గురిపెట్టినట్లు ఉన్న ఒక చిత్రం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇరాన్ ఫాస్ట్ బోట్లపై అమెరికా డ్రోన్ దాడి చేస్తున్న చిత్రం కింద బై బై, ఫాస్ట్ బోట్స్ అని రాశారు. అంతేగాక తాను ఒక కంప్యూటర్ ముందు కూర్చుని టేబుల్పై చేతితో నొక్కుతూ, "బా బా బా బా ఫైర్, బూమ్ అంటూ క్షిపణి దాడికి" ఆదేశాలిస్తున్నట్లు నటించిన ఒక వీడియోను కూడా పంచుకున్నారు.

గోమతి ఎక్స్‌ప్రెస్ బోగీలోని ట్రంకుపెట్టెలో ముక్కలుగా మహిళ మృతదేహం

లక్నో, మే 18: రైలు స్లీపర్ కోచ్‌లో అనుమానాస్పద ఇనుప పెట్టెను పారిశుధ్య సిబ్బంది గుర్తించి తాళం పగులగొట్టి దానిని తెరిచి చూడగా మహిళ మృతదేహం భాగాలను పోలీసులు గుర్తించారు. మహిళను హత్య చేసి మృతదేహాన్ని ముక్కలుగా నరికి పెట్టె, బ్యాగులో ఉంచి రైలులో వదిలేసినట్లు రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఈ సంఘటన జరిగింది. బీహార్‌లోని చాప్రా నుంచి బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ రైలు, లక్నోలోని గోమతి నగర్ స్టేషన్‌లో ప్రయాణాన్ని ముగించింది. సోమవారం ఉదయం ఆ రైలు కోచ్‌లను పారిశుధ్య సిబ్బంది క్లీనింగ్ చేస్తుండగా ఒక స్లీపర్ కోచ్ సిటు కింద వదిలేసిన ఇనుప పెట్టె, ఒక బ్యాగ్‌ను వారు గుర్తించారు. రక్తం మరకలు ఉండటంతో అనుమానించి రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ ఇనుప పెట్టె తాళం పగులగొట్టి చూడగా మహిళ మృతదేహం భాగాలు ఉన్నాయి. మొండెం, వేరు చేసిన తల భాగాలు పెట్టెలో, కాళ్లు, చేతుల భాగాలను పాలిథిన్ సంచుల్లో ప్యాక్ చేసి బట్టల మధ్య దాచి బ్యాగ్‌లో ఉంచడాన్ని రైల్వే పోలీసులు పరిశీలించారు. మరోవైపు మృతురాలి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని రైల్వే పోలీస్ అధికారి తెలిపారు. ఆమె గొంతు కోసి హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలుగా నరికిన హంతకులు ఇనుప పెట్టె, బ్యాగులో వాటిని ఉంచి రైలులో వదిలేసినట్లు అనుమానించారు. ఆ రైలు ప్రయాణించిన అన్ని రైల్వే స్టేషన్లలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

22న ఢిల్లీకి విజయ్ - ముఖ్యమంత్రిగా తొలి హస్తిన పర్యటన

- ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులతో భేటీ - మూడ్రోజులు ఢిల్లీలోనే విజయ్ మకాం



చెన్నై, మే 18: తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన తొలి అధికారిక పర్యటన నిమిత్తం మే 22న న్యూఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సీనియర్ కేంద్ర మంత్రులతో సమావేశం కానున్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో, తమిళనాడులోని అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందించాలన్న డిమాండ్లు, శ్రీలంక అధికారులు తమిళనాడు మత్స్యకారులను పదేపదే నిర్బంధించడం, వారిపై దాడులు చేస్తున్నారనే ఆరోపణలపై ఆందోళనలతో సహా కీలకమైన రాష్ట్రకేంద్ర సమస్యలపై దృష్టి సారించే అవకాశం ఉంది. విజయ్ విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌ను కలిసి, భారత్– శ్రీలంకల మధ్య దీర్ఘకాలంగా దౌత్య, రాజకీయ సమస్యగా ఉన్న మత్స్యకారుల సమస్యను ప్రస్తావించే అవకాశం ఉంది. తమిళనాడుకు చెందిన మత్స్యకారులు, ముఖ్యంగా రామనాథపురం, నాగపట్టణం వంటి తీరప్రాంత జిల్లాల వారు, తరచుగా పాల్క్ జలసంధి సమీపంలోని జలాల్లోకి వెళ్తుంటారు. అక్కడ సముద్ర సరిహద్దుల వివాదాల కారణంగా, గత కొన్నేళ్లుగా శ్రీలంక అధికారులు మత్స్యకారులను అరెస్టు చేయడం, నిర్బంధించడం, పడవలను స్వాధీనం చేసుకోవడం వంటివి చేస్తున్నారు. ఈ సమస్య తమిళనాడులో పదేపదే నిరసనలకు దారితీసింది. నిర్బంధంలో ఉన్న మత్స్యకారులను విడుదల చేయించాలని, శాశ్వత దౌత్య పరిష్కారం కనుగొనాలని వరుస రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాన్ని కోరాయి. ఇటీవలి సంవత్సరాలలో, ఉద్రిక్తతలను తగ్గించే లక్ష్యంతో భారత్, శ్రీలంక చర్చలు జరిపినప్పటికీ, ఎప్పటికప్పుడు సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యమంత్రి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లను కూడా కలవనున్నారు. ఈ సమావేశాల్లో, రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, సంక్షేమం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం మరింత కేంద్ర సహాయం కోరుతూ విజయ్ ప్రతిపాదనలు సమర్పించే అవకాశం ఉంది. పట్టణ మౌలిక సదుపాయాలు, విపత్తు సహాయం, పారిశ్రామిక వృద్ధి, సామాజిక సంక్షేమ కార్యక్రమాల కోసం కేంద్రం నుంచి కేటాయింపులు పెంచాలని తమిళనాడు తరచుగా కోరుతూ వస్తోంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేంద్ర ప్రభుత్వంతో విజయ్ పాల్గొంటున్న తొలి అధికారిక కార్యక్రమం ఈ పర్యటన. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై, ఆయన పరిపాలనలో తమిళనాడు విధాన ప్రాధాన్యతలపై ప్రభావం ఉంటుందోనని పరిశీలకులు అంటున్నారు.

19-5Pg6exHMNWJQE.qxd:19-5Pg6exHMNWJQE.qxd 1/1/02 6:22 AM Page 1

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

• ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

తిరుపతి, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి కార్యక్రమానికి 52 వినతులు అందాయి. ఈ కార్యక్రమం ద్వారానే గాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 1912, 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు: 91333 31912కు వాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్క రించుకోవచ్చని సిఎండి శివశంకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్‌డి) కే. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, జె.రమణాదేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్.శోభా వాలెంటీనా, ఎం.ఉమాపతి, కే.సంపత్ కుమార్, సిహెచ్ రామచంద్రరావు, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు చక్రపాణి, జగదీష్, భాస్కర్ రెడ్డి, పిఆర్‌ఒ తోట మధుసూదన పాల్గొన్నారు.

పార్వతీపురం జిల్లా కలెక్టర్ సైకిల్‌పై ఆఫీస్‌కు

పార్వతీపురం మన్యం, మే 18 ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ సరికొత్త ఆదర్శాన్ని చాటారు. సోమవారం ఇంధన పొదుపు కార్యక్రమంలో భాగంగా ఆయన తన నివాసం నుండి కలెక్టరేట్ వరకు సైకిల్‌పై ప్రయాణించారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజల ఫిర్యాదుల పరిష్కార వేదిక పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కలెక్టర్ ఈ విధంగా సైకిల్‌పై రావడం అందరినీ ఆకట్టుకుంది.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.35 కోట్లు

ఇంద్రకీలాద్రి, మే 18, ప్రభాతవార్త: దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రు.3కోట్ల 35 లక్షల 87వేల 555ల నగదు, 232 గ్రాముల బంగారం, 4కెజిల 200 గ్రాముల వెండి, విదేశీ నగదు యుఎస్ఎ డాలర్స్ 1174, కతార్ రియాల్స్53, 117 మలేషియా రింగెట్స్, 30 నేపాల్ రుపాయలు, 175 యుఎఇ దిర్హామ్స్, 15 సింగపూర్ డాలర్స్, 55 కెనడా క్యాడ్లు, 31 సౌదీ రియాల్స్, 30 హాంకాంగ్ డాలర్స్, యురోలు 15, 30 ఇంగ్లాండ్ పౌండ్స్, 5 ఒమన్ రియాల్స్, 300 ఒమన్ బైంసాలు, 15 టర్కీ లైరాసీలు, 1000 బ్యాంక్ ఆఫ్ ఉగాండా షిల్లింగ్స్, బూటాన్ నుల్ట్రం 10, చైనా యువాన్లు 15, పాత భారత రు.2వేల నోటు 1 లభించినట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

దుర్గమ్మ భక్తుల విరాళాలు: శ్రీ దుర్గమల్లేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకమునకు ఏలూరుకు చెందిన గారపాటి రామ తులసమ్మ వారి కుటుంబసభ్యులతో కలిసి రూ.1,05,116లు సోమవారం అందించారు. విజయవాడకు చెందిన ఎన్‌విటల్‌కుమార్ తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,00,000లు నిత్యాన్నదాన పథకానికి విరాళ మందించారు. హైదరాబాద్‌కు చెందిన ఘంటశాల సుమన్ వారి కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,00,000లు ఉచిత ప్రసాద పంపిణీకి విరాళమందించారు. విజయవాడకి చెందిన ఎ.వెంకట కృష్ణారావు కెన్ గ్రిడ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట రూ.1,01,116లు విరాళాన్ని అధికారులకు అందచేశారు. దాతలకు శ్రీ స్వామిఅమ్మవార్ల దర్శనానంతరం తీర్థప్రసాద ములు అమ్మవారి చిత్రపటము, వేదపండితులచే వేదాశీర్వచనము అందచేశారు.

కూటమి ప్రభుత్వ కుట్రలకు ప్రజలు బలి

• శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపాటు

విజయనగరం/ చీపురుపల్లి, మే 18 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను బలి చేస్తుందని శాసన మండలి విపక్ష నేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. సోమవారం రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు పెంచిన పెట్రోల్ ధరలకు నిరసనగా చీపురుపల్లి నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను నిలువునా దోపుడుచేస్తున్న కూటమి ప్రభుత్వం, ఇంధన ధరల పెంపుపై బొత్స సత్యనారాయణ నిప్పులు చెరిగారు. చీపురుపల్లి జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ భారీ నిరసన ప్రదర్శన అనంతరం ఆయన ప్రసంగిస్తూ సంపద సృష్టిస్తామని చెప్పి, ప్రజల సంపదను దోచేస్తున్నారు అని మండిపడ్డారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కి వికలాంగుల పెన్షన్లపై సైతం మోసం చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన

తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు విచ్చలవిడిగా పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రజల మనుగడ ప్రశ్నార్థకముగా మారిందన్నారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల వల్ల రైతులు, కూలీలు, మధ్యతరగతి కుటుంబాలు బతుకలేని పరిస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు ప్రజలను నట్టేట ముంచారని బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా, ఇప్పటివరకు వికలాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయక పోవడం అత్యంత బాధాకరమని, ఈ ప్రభుత్వానికి మానవత్వం లేదని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు ఖచ్చితంగా బుద్ధి చెప్పే సమయం వస్తుంది" అని బొత్స సత్యనారాయణ హెచ్చరించారు. తక్షణమే పెంచిన ఇంధన ధరలను తగ్గించి, ప్రజలపై మోపిన అదనపు భారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ శోభా స్వాతిరాణి, వైసిపి జిల్లా కార్యనిర్వాక కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మీసాల వరహాల నాయుడు యువజన నాయకులు బెల్లాన వంశీ. చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారం కాదు... పేద పిల్లల చదువే లక్ష్యం

• రూ.40 కోట్లతో నెల్లూరులో తాగునీటి ప్రాజెక్టుకు మంత్రి నారాయణ శంకుస్థాపన

నెల్లూరు, మే 18, ప్రభాతవార్త- వైద్యం: నెల్లూరు సిటీ నియోజక వర్గంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. 761 కోట్ల భారీ వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభం కాగా, 54వ డివిజన్‌లో 350 కిలో లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంకు నిర్మాణానికి రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ భూమి పూజ చేశారు. అనంతరం ఏసీనగర్ మల్లెల సంజీవయ్య స్కూల్‌లో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన క్లాస్ రూం బల్లలపై కూర్చొని నాణ్యతను పరిశీలించారు. విద్యార్థిగా తన గతాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లా డుతూ సిఎం చంద్రబాబు అభివృద్ధి విషయం లో ఎక్కడా రాజీపడకుండా ముందుకు సాగు తున్నారు. సంపద సృష్టిస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నారని కొని యాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.14,000 కోట్లతో అమృత్ పథకం పనులు జరుగు

తున్నాయని, రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన జదీ జలాలను అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే నెల్లూరులోని ప్రభుత్వ హైస్కూళ్లను అంతర్జా తీయ ప్రమాణాలతో ఆధు నీకరిస్తున్నామని, వక్ఫ్‌బోర్డు స్థలంలో 20 కోట్లతో వీఆర్సీకి ధీటుగా మరో ఇంటర్నేషనల్ స్థాయి స్కూల్ నిర్మిస్తున్నామని ప్రకటించారు. వ్యాపార దృక్పథంతో చూస్తే నా పిల్లల నారాయణ విద్యాసంస్థల కోసం ప్రభుత్వ స్కూళ్లను నేను అభివృద్ధి చేయకూడదు. కానీ, పేదరిక నిర్మూలన కేవలం విద్యాభివృద్ధితోనే సాధ్యమని నమ్మి, ప్రతి పేద విద్యార్థికి ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డిలు మాట్లాడుతూ నెల్లూరు నగర నియోజకవర్గంలో మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పదో తరగతిలో 580 మార్కులు సాధించిన మల్లెల సంజీవయ్య స్కూల్ విద్యార్థినులను సన్మానించి మంత్రి నారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, అడిషనల్ కమీషనర్ హిమబిందు, మేయర్ సుజాత అశోక్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, 54వ డివిజన్ టీడీపీ నేతలు జమీర్, షాహీద్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

జిడి నెల్లూరులో దొంగ నోట్ల చెలామణి స్కామ్

- రూ.9.40 లక్షలు కాజేసిన పోలీసులు ఇంటికే

చిత్తూరు, మే 18 ప్రభాతవార్త: దొంగ నోట్ల చలామణి పేరిట చిత్తూరు ట్రాఫిక్ ఏఎస్ఐ, ఏఆర్ కానిస్టేబుల్ తో పాటు మరో నలుగురు టెంకాయ వ్యాపారి ని బెదిరించి రూ.9.40 0 లక్షలను కాజేశారు. పోలీసుల పేరిట తనను మోసం చేశారని గుర్తించిన తమిళనాడుకు చెందిన టెంకాయల వ్యాపారి జీడీ నెల్లూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన టెంకాయల వ్యాపారి గంగాధర నెల్లూరు పరిసర ప్రాంతాల్లో వచ్చి టెంకాయలు కొనుగోలు చేసి తమిళనాడు తీసుకెళ్లి అక్కడ అన్ని వ్యాపారం చేసుకుంటూ ఉండేవాడు. ఈ క్రమంలో జీడి నెల్లూరు పరిసర ప్రాంతంలో టెంకాయలు కొనుగోలు చేయడానికి రూ.10 లక్షలు తీసుకుని వచ్చిన ఆ వ్యాపారిని చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా పనిచేసే లోకనాథంతోపాటు చిత్తూరు ఏఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసే రవిచంద్రన్‌లతోపాటు తమిళనాడుకు చెందిన మరో ఇద్దరు స్థానికంగా ఉన్న మరో ఇద్దరు తమిళనాడు వ్యాపారిని దొంగనట్లు చలామణి చేస్తున్నాడని బెదిరించారు. తనకు దొంగ నోట్ల వ్యాపారంతో సంబంధం లేదని వ్యాపారి పలుమార్లు చెప్పిన ట్రాఫిక్ ఏఎస్ఐ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వినలేదు. తాము కొన్ని దొంగ నోట్లు ఇస్తామని వీటిని చలామణి చేసి తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది మాటలతో బెదిరిపోయిన తమిళనాడు చెందిన టెంకాయల వ్యాపారి తన వద్ద ఉన్న రూ.9.40 లక్షలు వారికి ఇచ్చివేసి వెళ్లిపోయాడు. ఈ విషయంలో తాను మోసపోయానని గ్రహించిన ఆ టెంకాయల వ్యాపారి వీధి జీడినెల్లూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదును విచారించిన గిడి నెల్లూరు పోలీసులు ఈ వ్యవహారంలో తమ శాఖకు చెందిన ఒక ఏఎస్ఐ తో పాటు మరో హెడ్ కానిస్టేబుల్ సూత్రధారులుగా ఉన్నారని నిర్ధారించింది. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తుకు చేయడానికి పోలీసు శాఖ సిద్ధం అవుతుంది.

పెట్రో ఉత్పత్తులపై నిరసన వ్యక్తం చేసే నైతిక హక్కు వైసిపికి లేదు

• టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు

అనంతపురం, మే 18 ప్రభాతవార్త బ్యూరో: పెట్రో ఉత్పత్తుల ధరలపై నిరసన వ్యక్తం చేసే నైతిక హక్కు వైసిపికి ఏమాత్రం లేదేలేదని ప్రభుత్వ విప్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తీవ్ర స్థాయిలో విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం వైసిపినిర్వహించిన నిరసన కార్యక్రమాలపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టడం వైసిపి ద్వంద్వ నీతికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశంలోని అనేక రాష్ట్రాలు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాయని, అయితే అప్పటి వైసిపి ప్రభుత్వం మాత్రం ప్రజల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. ధరలు తగ్గించని ఏకైక రాష్ట్రంగా అప్పట్లో ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. అంతటి కర్కోటక పాలకుడిగా జగన్ వ్యవహరించారని విమర్శించారు. 2019లో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిన సందర్భంలోనూ, అప్పటి సీఎం. నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం లీటరు రూ.2 తగ్గించి ప్రజలకు కొంత ఉపశమనం కలిగించిందని గుర్తుచేశారు. కానీ తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై సెస్, వ్యాట్ పేర్లతో అదనపు పన్నులు విధించి ప్రజలపై అధిక భారాలు మోపిందని ఆరోపించారు. పెట్రోల్‌పై రూ.8.59, డీజిల్‌పై రూ.6.48 వరకు అదనపు భారం అప్పట్లో వేసిందని తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ పన్నులను తగ్గించాలని ఆలోచిస్తున్నా, అప్పటి ఆర్థిక విధానాల కారణంగా వీలుకావడం లేదన్నారు. 2024 జూన్‌లో పెట్రోల్ ధర రూ.110, డీజిల్ ధర రూ.99 ఉండగా, పశ్చిమాసియా యుద్ధం కారణంగా అవి వరుసగా రూ.113, రూ.101కు చేరాయని, అయితే పెట్రోల్‌పై రూ.3, డీజిల్‌పై రూ.2 పెరిగిందని తెలిపారు. పెట్రో ఉత్పత్తుల ధరల విషయంలో గతంలో వైసిపి ప్రభుత్వం విధ్వంసకర విధానాలు అమలు చేసి, ఇప్పుడు అదే అంశంపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజలను మభ్యపెట్టే రాజకీయ ప్రయత్నమని కాలవ శ్రీనివాసులు విమర్శించారు.

టిటిడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడిలో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు సమస్యలను పరిష్కరించడంలో టిటిడి యాజమాన్యం నిరక్ష్యం చేస్తోందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతామోహన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ధార్మిక సంస్థలో వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారని, వారి సమస్యలు తీర్చడంలో ఉన్నతాధికారులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. 12వ పీఆర్సీ, 4 పెండింగ్ డిఏలు వెంటనే ఇవ్వాలన్నారు. సోమవారం టిటిడి పరిపాలన భవనం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, టిటిడి పారిశుధ్య కార్మికులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ ఆరు లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు కష్టపడి పని చేస్తున్నారని, ప్రజలకు సేవ చేస్తున్న ఉద్యోగస్తులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. గత 8 సంవత్సరాలుగా పీఆర్సీ ప్రకటించకపోవడం దారుణమన్నారు. బోనస్, పెండింగ్ డిఏలు వెంటనే ఇవ్వాలన్నారు. 30 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ ఉద్యోగులకు బకాయలు చెల్లించాలన్నారు. ముఖ్యమంత్రులుగా చంద్రబాబు, జగన్ ఇద్దరూ ఉద్యోగస్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. ధర్నా అనంతరం టిటిడి పరిపాలన భవనంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్ యాదవ్, రావణ్, దాసరి చిరంజీవి, తేజోవతి, శాంతి యాదవ్, ముని శోభ, సమీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు అకౌంట్లుతో బ్యాంకులకు టోకరా

నిందితుడు అరెస్టు... రిమాండ్

7 కోట్ల విలువైన స్థిర చరాస్థుల డాక్యుమెంట్లు స్వాధీనం

విజయవాడ కార్పొరేషన్, మే 18 ప్రభాతవార్త: విజయవాడలోని పలు యాక్సిక్ బ్యాంకు బ్రాంచుల్లో 2019 నుండి 26 సేవింగ్ ఖాతాలను తెరిచి క్రెడిట్ కార్డ్‌ల ద్వారా వివిధ లోన్ రూపాలలో లోన్‌లను తీసుకొని వాటిని కట్టకుండా మోసం చేసి తప్పించుకుని తిరుగుతున్నాడని విచారించి తగిన చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఫిర్యాదుపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని, సదరు కేసును త్వరగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేయాలని సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు సైబర్ క్రైం డిసిపి కె.కృష్ణప్రసన్న, సైబర్ క్రైం ఎసిపి నేతృత్వరంలో పలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా సదరు ప్రత్యేక బృందాలకు రాబడిన పక్కా సమాచారం మేరకు, సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నిందితులైన కృష్ణా జిల్లా గూడూరు గ్రామానికి చెందిన నీలం పవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించి అతని వద్ద నుండి వివిధ స్థిరాస్థులకు చెందిన 34 డాక్యుమెంట్ లను, ఒక కారు, ఒక బైక్, 122 గ్రాముల బంగారం, 927 గ్రాముల వెండి, 9 ఎటిఎం కార్డులు, రూ.11,500 నగదు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడు నీలం పవన్‌కుమార్ ఈ సేవలో పనిచేసే క్రమంలో జల్సాలకు అలవాటుపడి తనకు వచ్చిన జీతం జల్సాలకు సరిపోక ఏ విధంగానైనా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో తనకున్న కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని తప్పుడు శాలరీ స్లిప్స్, ఐడి కార్డులు మొదలైన బ్యాంక్‌లలో లోన్ పొందడానికి అవసరమైన పత్రాలను తయారు చేసుకొని వాటిని ఉపయోగించి సదరు బ్యాంక్ యొక్క గుణదల బ్రాంచి నందు 9 ఫేక్ అకౌంట్ల ద్వారా 1.76 కోట్ల రూపాయలు, ఏలూరు రోడ్ బ్రాంచి నందు 10 ఫేక్ అకౌంట్స్ ద్వారా 1.32 కోట్ల రూపాయలు, మెయిన్ బ్రాంచి నందు 7 ఫేక్ అకౌంట్ల ద్వారా 2.20 కోట్ల రూపాయిలు, మొత్తం 26 అకౌంట్ల ద్వారా సుమారు 5.28 కోట్ల రూపాయల వరకు లోన్ తీసుకుని వాటిని కట్టకుండా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసాడు. ఇతనిపై గతంలో గూడూరు పోలీస్‌స్టేషన్, బందరు పోలీస్‌స్టేషన్, భవానీపురం పోలీస్‌స్టేషన్, కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లలో పలు కేసులున్నాయని ఆయన తెలిపారు. కీలకమైన కేసును ఛేధించడంలో కీలకంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని అధికారులు అభినందించారు.

ఉద్యాన రైతుల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి అచ్చెన్నాయుడు

సచివాలయం, మే 18 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఉద్యాన పంటల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. స్వీట్ ఆరెంజ్ తోటల్లో నీటి ఒత్తిడి పరిస్థితులపై ఇప్పటికే రెండు నెలల క్రితమే అనంతపురం జిల్లాలో అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఈ అంశంపై శాఖాధికారులు, శాస్త్రవేత్తలు ఫీల్డ్ విజిట్‌లు నిర్వహించి పరిస్థితిని సమీక్షిస్తున్నారని, రైతులకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో మొత్తం 37వేల హెక్టార్ల స్వీట్ ఆరెంజ్ తోటలు ఉండగా, అందులో 2,260 హెక్టార్లలో సాగునీటి సమస్యను గుర్తించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైతులు లైవ్ మల్చింగ్, వీడ్ మ్యాట్ వినియోగం, ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేయడం, అవసరమైన చోట్ల నీటిని తరలించి జీవనాధార నీటి సరఫరా చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. ప్రత్యేకంగా మూడు గ్రామాల్లో 875హెక్టార్లలో తీవ్రమైన నీటి కొరత నెలకొన్నదని, రైతులు భారీ వ్యయంతో నీటిని తరలించి తోటలను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అయితే రవాణా వ్యయం అధికంగా ఉండడం, ఇతర ప్రాంతాల్లో కూడా తోటలు ఉండడంతో ఇద్దరు రైతులు కలపి సుమారు 4.5హెక్టార్ల తోటలను వదిలివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్‌లో నీటి కొరత కారణంగా ఆయా గ్రామాల చెరువుల నింపబడలేదని, చెరువులు నింపగలిగితే పరిస్థితి కొంత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ఈ మొత్తం అంశంపై జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించామని, ఆయన ప్రత్యక్ష పర్యవేక్షణలో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

అలాగే యాడికి మండలంలో కూడా కొన్ని నెలల క్రితం ఆమ్ల నిమ్మ పంటకు సాగునీటి సమస్య ఏర్పడిందని గుర్తుచేశారు. రైతులు నీటిని తరలించి పంటలను కాపాడుకోవడంతోపాటు ప్రస్తుతం ఆమ్ల నిమ్మ ధరలు అధికంగా ఉండడం వల్ల వారికి మంచి ఆదాయం లభించిందని చెప్పారు. రైతులు తీవ్ర ఆర్థికభారం భరించి పంటలను కాపాడు కునేందుకు కృషి చేస్తున్న నేపథ్యంలో వారికి నీటి రవాణా ఖర్చు అందించే అంశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళి, రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

గ్రీన్ ఫీల్డ్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పనులు

త్వరితగతిన పూర్తి చేయాలి

- పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి

సచివాలయం, మే 18 ప్రభాతవార్త: రాష్ట్రంలో 3 గ్రీన్ ఫీల్డ్ పోర్టులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తిచేసి అందుబాటు లోనికి తీసుకురావాలని మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి ఆదేశం చారు. సచివాలయంలో ఆర్ అండ్ బి, ఐ అండ్ ఐ శాఖ మంత్రి కార్యాలయంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 3 గ్రీన్ ఫీల్డ్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల పురోగతిపై ఆశాఖ ఉన్నతాధికారులతో మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి సమీక్షా సమావేశం జరిగింది. గ్రీన్ ఫీల్డ్ పోర్టు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని మంత్రి తెలిపారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణంలో ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే, పరిష్కారిస్తామని మంత్రి తెలిపారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల పనులు మరింత వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మూలాపేట పోర్టుకు సంబంధించి ప్రధానంగా ఉప్పు భూముల సమస్య, రోడ్డు, రైల్వే, ఆర్ అండ్ ఆర్ వంటి మౌలిక సదుపాయాల కల్పన సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. మూలాపేట గ్రామానికి పునరావాస కల్పనను వేగవంతం చేయడం ద్వారా డ్రెడ్జింగ్‌ను సకాలంలో పూర్తి చేయడంతో పాటు, ఈ ఏడాది ఆఖరు నాటికి పోర్టు నిర్మాణం పూర్తి చేయ వచ్చని మంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు. మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు సంబంధించి బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్ పనులు మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మచిలీపట్నం పోర్టుకు రైల్వే అనుసంధానం, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని గ్రీన్ ఫీల్డ్ పోర్టులను చేపట్టిన క్రమంలో వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు సహకరించాలని మంత్రి కోరారు. రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టులో డ్రెడ్జింగ్, ఫిషింగ్ హార్బర్‌ల పనులు కూడా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, మారిటైమ్ బోర్డు సీఈవో అభిషేక్ కుమార్, ఏపి మారిటైమ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ రాఘవరావు, పోర్టు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైళ్లలో అగ్నిప్రమాదాలపై ప్రత్యేక దృష్టి

• రైల్వే భద్రతా చర్యలపై సమీక్షలో జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

గుంతకల్ రైల్వే, మే 18 ప్రభాతవార్త: గుంతకల్ రైల్వే డివిజనల్ వేసవి కాలం దృష్ట్యా భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పాటించాల్సిన అగ్నిమాపక భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై వివరణాత్మక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, ప్రధాన విభాగాధిపతులతో పాటు పాల్గొన్నారు. విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్‌లలోని మొత్తం ఆరు డివిజన్‌ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డి.ఆర్.ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతపై తీసుకుంటున్న జాగ్రత్తలను సమీక్షించారు. జనరల్ మేనేజర్ మాట్లాడుతూ అగ్నిమాపక భద్రతా చర్యలపై దృష్టి సారించాలని, అలాగే సిబ్బందికి క్రమం తప్పకుండా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు సంబంధించిన అన్ని జాగ్రత్తలను సిబ్బంది కచ్చితంగా పాటించేలా అధికారులు పునరుద్ఘాటించాల్సిందిగా ఆయన సూచించారు. అగ్ని, పొగను గుర్తించే వ్యవస్థ

(ఫైర్ అండ్ స్మోక్ డిటెక్షన్ సిస్టమ్), దాని నిర్వహణ విషయంలో అధికారులు చురుకుగా వ్యవహరించాలని ఆయన సూచించారు. రైలు పట్టాల వెంబడి అగ్ని ప్రమాదాలనైనా నివారించడానికి గస్తీని ముమ్మరం చేయాలని ఆయన తెలిపారు.

జనరల్ మేనేజర్ రోలింగ్ స్టాక్ భద్రతపై నొక్కి చెబుతూ భారీ మొత్తంలో లోడింగ్‌చేసే సంధర్భంలో కఠినమైన మార్గదర్శకాలను పాటించాలని అసమాన లోడింగ్‌ను నివారించాలని అధికారులను ఆదేశించారు. అన్ని పాయింట్లు, క్రాసింగ్‌లపై దృష్టి సారించాలని కూడా ఆయన సూచించారు. జనరల్ మేనేజర్ ట్రాక్ భద్రతపై చర్చిస్తూ, కేబుల్ డామేజ్‌లు, అనధికార ప్రవేశ సంఘటనలు, బారికేడింగ్‌కు సంబంధించిన పనులు, జోన్‌లోని కేబులింగ్ పనులను సమీక్షించారు. ప్రస్తుతం కొనసాగుతున్న యార్డ్ పునర్నిర్మాణం; సిగ్నల్ అప్‌గ్రేడేషన్ పనులు, వంతెనలపై కాలి నడక మార్గాలు మొదలైన మౌలిక సదుపాయాల పనులను ఆయన సమీక్షించారు, నిర్దేశించిన లక్ష్యం ప్రకారం అట్టి పనులను పూర్తి చేయడానికి వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు.

ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ లీగ్ టోర్నమెంట్లు

■ క్రీడాకారులను ప్రోత్సహించడమే సాప్ ముఖ్య ఉద్దేశ్యం ■ ముగింపు వేడుకల్లో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, సాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ■ 26 జిల్లాల నుండి తరలివచ్చిన 400 మంది బాక్సర్లు

8లో

పీజీఆర్ఎస్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త

సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పి జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించా లన్నారు. ప్రజల పట్ల మర్యాదగా, సానుభూతితో వ్యవహరించడం ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా గుర్తించాలన్నారు. ఒక చిన్న పని కోసం పని మానుకుని, సెలవులు పెట్టి పాలు సార్లు వస్తున్నారని అందువల్ల నిరాశ ,ఆవేదన ఉంటుందని, ఆ సమయాలలో ప్రజల పట్ల మర్యాదగా సానుభూతితో వ్యవహరించడం ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత అన్నారు. ఫిర్యాదుదారుడు స్థానం లో మనం ఉంటే ఇబ్బందులు అర్థమవుతాయన్నారు. అధికారులు విధి నిర్వహణశీగా కాకుండా సామాన్య ప్రజల జీవితాలతో ముడిపడిన అంశాలుగా భావించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజల నుంచి 387 వినతులు అందాయి. అందులో రెవెన్యూ విభాగానికి చెందినవి 33,

తరువాయి 8వ పేజీలో

'గ్రేటర్' సౌత్ జోన్‌లో అక్రమ కట్టడాల దందా..!

35వ వార్డు, వేలంపేట బస్టాప్ ఎదుట సందులో

31వ వార్డు దాబాగార్డెన్స్, సెంటర్ పాయింట్ హోటల్ ఎదుట

➲ అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తులు ➲ అధికారుల మౌనం వెనుక ఎవరి అండ..? ➲ పార్కింగ్, సెట్ బాక్స్ నిబంధనలు గాలికి.. ➲ ఫిర్యాదులు చేసినా స్పందన శూన్యం

8 లో

రూ.3.77 కోట్లతో కేజీహెచ్‌లో ఆధునిక హిమోగ్లోబినోపతి కేంద్రం ప్రారంభం

✪ గిరిజన ప్రాంతాల ప్రజలకు వరం ✪ సికల్ సెల్ ఎనీమియా, తలసేమియా బాధితులకు మెరుగైన వైద్యం ✪ దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా అందుబాటులో కి వచ్చిన సదుపాయిశీ ✪ పుట్టిన 24 గంటల్లోనే నవజాత శిశువులకు రక్త పరీక్షలు ✪ గిరిజన రోగుల సహాయార్థం కేజీహెచ్‌లో ప్రత్యేక 'ఎస్టీ సెల్' ఏర్పాటు ✪ అదనపు నిధులు రూ. 56 లక్షల మంజూరుకు త్వరలోనే చర్యలు :మంత్రి సంధ్యారాణి

(వార్త 8వ పేజీలో)

వి ఎం ఆర్ డి ఎ ప్రజా దర్బార్ కి విశేష స్పందన

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త

వి ఎం ఆర్ డి ఎ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన ప్రజా దర్బార్ కి విశేష స్పందన లభించింది. ప్రజా దర్బార్ లో వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ శ్రీ ఎం వి ప్రణవ్ గోపాల్ గారు పాల్గొని బాధితుల నుంచి వినతులు అందుకున్నారు. వారితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని, సంబంధిత అధికారులతో చర్చించారు. వినతుల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఆదేశించారు. బాధితులని ఎక్కువ సార్లు కార్యాలయాల చుట్టూ తిరగకుండా చూడాలని ఆదేశించారు. ప్రజా దర్బార్ కి మొత్తం 7 వినతులు రాగా, వాటిలో ప్లానింగ్ 2, పరిపాలన 2, ఇంజనీరింగ్ కు 2 చొప్పున వినతులు వచ్చాయి. కార్యక్రమంలో కార్యదర్శి మురళీ కృష్ణ, ముఖ్య ఇంజనీర్ వినయ్ కుమార్ , ఎస్ ఈ మధు గారు ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 120 ఫిర్యాదులు

వార్త 8లో

వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌కు శంకుస్థాపన

8వ పేజీలో

పీజీఆర్ఎస్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

7వ తరువాయి ..

జీవీఎంసీ 163 ఉన్నాయి. ఇతర అన్ని శాఖల సంబంధించి 165 వినతులు రాగా పోలీస్ శాఖకు 26 వచ్చాయి. జాయింట్ కలెక్టర్ తో పాటు డి.ఆర్.ఓ. ఎం విశ్వేశ్వర్ నాయుడు, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సత్య వేణి, డిప్యూటీ కలెక్టర్ గోవింద్, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్ కు శంకుస్థాపన

రుషికొండ, మే 18, ప్రభాతవార్త:

రుషికొండ బీచ్ లో ఓషన్ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్ కు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. 1.5 ఎకరాల్లో రూ.3.35 కోట్లతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్), వి.ఎం.ఆర్.డి.ఏ. సంయుక్తంగా ఈ సెంటర్ ను నిర్మించనున్నాయి. సర్ఫింగ్, కయాకింగ్, కన్నోయింగ్, సెయిలింగ్, స్టాండ్ అప్ పాడింగ్ వంటి వాటర్ స్పోర్ట్స్ కు అవసరమైన సౌకర్యాలు ఇక్కడ కల్పిస్తారు. ఆయా స్పోర్ట్స్ కు సంబంధించి క్రీడాకారులకు అవసరమైన శిక్షణనిస్తారు. ప్రస్తుతం రుషికొండ బీచ్ లో స్పీడ్ బోటింగ్, స్కూబా డైవింగ్, జెట్ స్కీ, వించ్ పారా సెయిలింగ్, పారా మోటార్ తదితర స్పోర్ట్స్ అందుబాటులో ఉన్నాయి. కార్యక్రమంలో శాప్ చైర్మన్ ఎ.రవి నాయుడు, వి.ఎం.ఆర్.డి.ఎ. చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ జూన్ గాలియట్, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, శాప్ డైరక్టర్లు మేడిది రాజా, బుచ్చిరాజు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, లొడగల అప్పారావు, శాఖారి శ్రీనివాస్, చెట్టుపల్లి సన్యాసిరావు, నాగోతి సత్యనారాయణ, లొడగల రామ్మోహన్, సారిపల్లి శ్రీనివాస్, అక్కరబోయిన రాంబాబు, నాగరాజు, దొరబాబు, నాగలక్ష్మి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.77 కోట్లతో కేజీహెచ్‌లో ఆధునిక హిమోగ్లోబినోపతి కేంద్రం ప్రారంభం

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త

గిరిజన ప్రాంతాల్లోని ప్రజలను వేధిస్తున్న సికల్ సెల్ ఎనీమియా, తలసేమియా వంటి జన్యుపరమైన రక్తహీనత వ్యాధుల నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయని గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సోమవారం ఉదయం విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3 కోట్ల 77 లక్షల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన హిమోగ్లోబినోపతి – కాంప్రహెన్సివ్ కేర్ సెంటర్ (సీ ఓ సీ) ను స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో కలిసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. అరుకు పార్లమెంట్ పరిధిలోని విశాఖపట్నం చుట్టుపక్కల ఉన్న గిరిజన ప్రాంతాల ప్రజలు సికల్ సెల్ ఎనీమియాతో పడుతున్న ఇబ్బందులను గుర్తించి, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఈ కేంద్రాన్ని తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ కేంద్ర గిరిజన సంక్షేమ శాఖతో నిరంతరం సంప్రదింపులు జరిపడం ద్వారా, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ సీ ఓ సీ కేంద్రం సకాలంలో అందుబాటులోకి వచ్చేలా కృషి చేయడం ఉత్తరాంధ్రా గిరిజనులకు ఊరటని ఇస్తుందని తెలిపారు.

దక్షిణాది రాష్ట్రాల లోనే ప్రథమం ..

రక్తహీనతతో బాధపడే నవజాత శిశువులను ముందే గుర్తించేందుకు, పుట్టిన 24 గంటల తర్వాతే వారికి బ్లడ్ టెస్ట్ చేసే సరికొత్త విధానాన్ని దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా మన కేజీహెచ్‌లోనే ప్రారంభించడం రాష్ట్ర వైద్య రంగ ప్రగతికి నిదర్శనమని,మంత్రి చెప్పారు దీనివల్ల చిన్న వయసులోనే వ్యాధిని గుర్తించి ప్రాణనష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. కేజీహెచ్ హాస్పిటల్‌కు వచ్చే గిరిజన ప్రజలు గందరగోళానికి గురికాకుండా ఉండేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ఎస్టీ సెల్ ను గతం లోనే ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం దాన్ని బలోపేతం చేస్తూ ఇక్కడ ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉండి,గిరిజన రోగులకు ఏ విభాగానికి వెళ్ళాలి, ఎలాంటి వైద్యం తీసుకోవాలో మార్గదర్శకత్వం చేస్తారని తెలిపారు. హాస్పిటల్‌లో అందుబాటులో లేని మందులను ఐటీడీఏ ద్వారా ఇప్పించడంతో పాటు, అవసరమైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సాయం కూడా అందిస్తామన్నారు. ఈ కేంద్రం నిర్వహణకు, మరింత ఆధునీకరణకు హాస్పిటల్ సూపరింటెండెంట్ కోరిన అదనపు నిధులు రూ.56 లక్షలను కూడా ప్రభుత్వం నుండి త్వరలోనే మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రాలోని పాలకొండ నుండి రంపచోడవరం, పోలవరం వరకు ఉన్న గిరిజన ప్రజలందరూ ఈ కేంద్రాన్ని సందర్శించి, ఉచితంగా బ్లడ్ టెస్టులు చేయించుకోవాలని కోరారు. సికల్ సెల్ ఎనీమియా అనేది అంటువ్యాధి కాదని, ఇది కేవలం జన్యుపరంగా వచ్చే వ్యాధి అని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకుని, ప్రభుత్వం అందించే కార్డును పొంది, తద్వారా వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎన్ టి ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ సీతారాం సుధాకర్, కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణి, ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ సంధ్యారాణి వైద్యులు, కేజీహెచ్ అధికారులు, ఐటీడీఏ అధికారులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై హైడ్రోక్లోరిక్ యాసిడ్ లీకేజీ కలకలం

- అప్రమత్తమైన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది - తప్పిన పెను ప్రమాదం

ఆనందపురం, మే 18, ప్రభాతవార్త:

ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై సోమవారం హైడ్రోక్లోరిక్ యాసిడ్ లీకేజీ ఘటన కలకలం రేపింది. కొప్పుగు నుంచి ఆనందపురం వైపు వస్తున్న హైడ్రోక్లోరిక్ యాసిడ్‌తో నిండిన ట్యాంకర్ను తెల్లవారుజామున ఒక ఐచర్ వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో ట్యాంకర్ దెబ్బతింది. ప్రమాదం అనంతరం ట్యాంకర్‌కు తాత్కాలిక మరమ్మతులు చేసి తరలిస్తుండగా సాయంత్రం సమయంలో మళ్లీ యాసిడ్ లీకేజీ ప్రారంభమైంది. ట్యాంకర్‌లో సుమారు 30 టన్నుల హైడ్రోక్లోరిక్ యాసిడ్ ఉండటంతో పరిస్థితి ఒక్కసారిగా ఆందోళనకరంగా మారింది. జాతీయ రహదారిపై యాసిడ్ చిందడంతో దట్టమైన పొగలు వ్యాపించి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఆనందపురం సీఐ వాసునాయుడు వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ట్రాఫిక్ పోలీసులు, జాతీయ రహదారి అధికారులు, స్థానిక సిబ్బంది కలిసి ట్యాంకర్‌ను దుక్కవానిపాలెం టోల్ గేట్ సమీపంలోని సురక్షిత ప్రాంతానికి తరలించారు. ప్రజలకు ఎటువంటి ప్రమాదం కలగకుండా జాగ్రత్తలు ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌ను మళ్లించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది భారీగా నీటిని పోసి యాసిడ్ ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపట్టి పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఎటువంటి ప్రమాదం లేదని అధికారులు తెలిపారు. సమీప గ్రామాల్లో నీటి కాలుష్యం లేదా ప్రజారోగ్య సమస్యలు తలెత్తకుండా రెవెన్యూ, జిల్లా పరిపాలన, మండల పరిషత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్లు సీఐ వాసునాయుడు తెలిపారు.

పెట్రో ధరల పెంపుపై వైసిపి నిరసన ప్రదర్శన

-గాజువాక డిపో నుండి ములగాడ ఎమ్మార్వో ఆఫీస్ వరకు భారీ ర్యాలీ

-ప్రజలపై చంద్రబాబు బాదుడే బాదుడు:మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్

గాజువాక, మే 18, ప్రభాతవార్త:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నడూ లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ధ్వజమెత్తారు. ధరల పెంపును వ్యతిరేకంగా వైసిపి అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పశ్చిమ నియోజకవర్గంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ పరిశీలకులు జహీర్ అహ్మద్, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులతో కలిసి గాజువాక డిపో వద్ద నుంచి ములగాడ ఎమ్మార్వో కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ డి. రమకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గిస్తామని హామీలు ఇచ్చిన చంద్రబాబు నాయుడు, అధికారంలోకి రాగానే ఆ మాటలు విస్మరించారని మండిపడ్డారు. రేట్లు తగ్గించకపోగా, ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించకుండా వాహనదారులపై భారం వేశారన్నారు. డీజిల్ రేట్లు పెరగడం వల్ల రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఎక్సైజ్ సుంకం తగ్గించి సామాన్య ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, మహిళలు, యువజన విభాగం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ లీగ్ టోర్నమెంట్లు

గాజువాక,మే 18, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వికాస్‌నగర్ రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ లీగ్ పోటీలు సోమవారం నాటితో ఘనంగా ముగిశాయి. క్రీడల్లో పోటీ తత్వాన్ని పెంచడం, మారుమూల ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించేందుకు సాప్ ఈ ఏడాది ఫిబ్రవరి నుండి డిసెంబర్ వరకు రాష్ట్రవ్యాప్తంగా 31 క్రీడా విభాగాల్లో ఈ లీగ్ టోర్నమెంట్లను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గాజువాకలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి దాదాపు 400 మంది క్రీడాకారులు, 104 మంది కోచ్‌లు, మేనేజర్లు, 50 మంది సాంకేతిక అధికారులు తరలివచ్చారు.

ఈ బాక్సింగ్ పోటీల ముగింపు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఏపీ టీడీపీ అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అనిమిని రవి నాయుడు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

హోరాహోరీగా సాగిన పోటీలు.. విజేతల వివరాలు...

అండర్-15, అండర్-19 విభాగాల్లో బాలురు, బాలికలకు నిర్వహించిన బాక్సింగ్ పోటీలు క్రీడాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రింగులో బాక్సర్లు పంచ్‌ల వర్షం కురిపిస్తూ హోరాహోరీగా తలపడ్డారు.అండర్-15 విభాగం మొత్తం 15 కేటగిరీలలో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు 15 బంగారు (గోల్డ్), 15 రజత (సిల్వర్) పతకాలను అతిథులు అందజేశారు. అండర్-19 విభాగం: మొత్తం 10 కేటగిరీలలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి 10 బంగారు, 10 రజత పతకాలను బహూకరించారు.

ఘనంగా ముగింపు వేడుకలు....

కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ముగింపు సభలో విశాఖపట్నం జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జూన్ గ్యాలియెట్, సాప్ బోర్డు డైరెక్టర్ పి.వి.బి.ఎస్.ఎన్. రాజు (బుచ్చిరాజు), ద్రోణాచార్య అవార్డు గ్రహీత (బాక్సింగ్) ఐ. వెంకటేశ్వర రావు, బ్యాటిఫికేషన్ చైర్మన్ పెంటిరాజు తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు, విశాఖపట్నం డిస్ట్రిక్ట్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, సాప్ బాక్సింగ్ కోచ్‌లు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా శిక్షకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు.

'గ్రేటర్' సౌత్ జోన్‌లో అక్రమ కట్టడాల దందా..!

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

'గ్రేటర్' సౌత్ జోన్ పరిధిలో అక్రమ కట్టడాల వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో జీ ప్లస్ 2 అనుమతులతో ప్రారంభమైన నిర్మాణాలు అదనపు అంతస్తులతో కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రత్యేకంగా నివాస ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు లేకుండానే భారీ అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారని, సెట్బ్యాక్ నిబంధనలు పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని చెబుతున్నారు. ఇళ్ల మధ్య కనీస దూరం కూడా పాటించకుండా నిర్మాణాలు కొనసాగుతుండటంతో అగ్నిప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సౌత్ జోన్‌లోని పలు డివిజన్లలో అక్రమ నిర్మాణాలకు కొందరు మధ్యవర్తులు కీలకంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. అనుమతులు లేని భవనాలకు కూడా 'సెట్టింగ్'లతో గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 31వ వార్డు పరిధి డాబాగార్డెన్స్, సెంటర్ పాయింట్ హోటల్ ఎదురుగా ఎటువంటి నిబంధనలు పాటించకుండా.. గెడ్డకు ఆనుకొని రెండు భవనాల నిర్మాణనికి ప్లాన్స్ తీసుకొని, రెండు ప్లాన్స్ కలిపి ఒక్కటే భారీ భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నా.. టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. గెడ్డకు.. భవనానికి దాదాపు నాలుగు మీటర్స్ స్థలం వదలవలసి వున్నా.. రెండు అడుగులు స్థలం కూడా వదలకుండా.. ఈ భవనాన్ని నిర్మిస్తున్నా.. కనీసం పట్టించుకోకపోవడం విశేషం. 35వ వార్డు పరిధిలోని వేలంపేట బస్టాప్ ఎదురుగా ఇరుకైన సందులో నిబంధనలను ఉల్లంఘించి ఎటువంటి సెట్ బాక్స్ లేకుండా అంతస్తులపై అంతస్తులు నిర్మిస్తుంటే.. ఆ భవన నిర్మాణదారుడికి పవన్ కళ్యాణ్ సిబ్బంది పత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అవినీతి మత్తులో...

అక్రమ నిర్మాణదారుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి అధికార స్థాయిలో వ్యవహారాలు చక్కబెడుతున్నారన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.అనుమతులు ఒకలా తీసుకుని మూడు, నాలుగు అంతస్తులు నిర్మించడం సాధారణమైందని స్థానికులు అంటున్నారు. కొన్నిచోట్ల పూర్తిస్థాయి అనుమతులు లేకుండానే నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నప్పటికీ అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రజలు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందని స్థానిక సంఘాలు చెబుతున్నాయి. అక్రమ నిర్మాణాల కారణంగా ఇప్పటికే పలుచోట్ల రహదారులు ఇరుకుగా మారిపోయాయని, డ్రైనేజీ సమస్యలు తీవ్రమవుతున్నాయని పేర్కొంటున్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, ట్రాఫిక్ సమస్యలు పెరగడం వంటి ఇబ్బందులు ప్రజలను వేధిస్తున్నాయి.అంతేకాకుండా పాత కాలనీల్లో నిర్మాణ భద్రతా ప్రమాణాలు పాటించకుండా బహుళ అంతస్తులు నిర్మించడం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నా.. కొందరు అధికారులు మాత్రం నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు. ఫిర్యాదులు అందిన చోట తనిఖీలు నిర్వహించి నోటీసులు జారీ చేస్తున్నామని పేర్కొంటున్నారు. అయితే స్థానికులు మాత్రం కఠిన చర్యలు తీసుకోకపోతే అక్రమ నిర్మాణాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.జీవీఎంసీ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సౌత్ జోన్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న నిర్మాణదారులు, సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రవీణ్ కుమార్ కు న్యాయం చేయండి.. బాధ్యులపై చర్యలు తీసుకోండి

- విదసం నేత బూసి వెంకట రావు

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త

ఆంధ్ర విశ్వ విద్యాలయం అంబేద్కర్ చైర్ పరిశోధకుడు ప్రవీణ్ కుమార్ పై ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రాజశేఖర్ వేదింపులు ఆపాలని , జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశాల పై పోలీసులు విచారణ జరపాలని విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు మాట్లాడుతూ డిమాండ్ చేశారు.. ఆంధ్ర యూనివర్సిటీ లో జరుగుతున్న కుల వివక్ష పై చర్యలు కోసం జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో యూనివర్సిటీ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద విదసం నేతృత్వంలో నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ చైర్ ఫౌండేషన్ లో పరిశోధన చేసే దళిత స్కాలర్స్ ను కుల పరంగా అవమానిస్తూ ఫెలోషిప్ వేతనం, పరిశోధన పత్రాలు ఆమోదం వంటి ఎకడమిక్ పద్ధతులు అమలు చేయకుండా వీసీ , డీన్ ఆర్ అండ్ డీ వేధిస్తున్నారని తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొంతమంది రాజకీయ నాయకులు వీసీ నీ ప్రభావితం చేస్తున్నారని మొత్తం దళితుల పట్ల నేటి వీసీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 100 ఏళ్ల యూనివర్సిటీ ప్రతిష్ట ను వీసీ మంటగలుపుతున్నారని మండి పడ్డారు..ప్రతిభ కలిగిన యూనివర్సిటీ ఎకడమిస్ట్ లు ఎంతోమంది ఉండగా ప్రభుత్వం బయటి వ్యక్తిని తెచ్చి రుద్దడం వల్ల ఆంధ్ర యూనివర్సిటీ లో కుల వేధింపుల, కులతత్వం రాజ్యమేలుతుందన్నారు.. ప్రవీణ్ కుమార్ పిర్యాదు పై జాతీయ ఎస్సీ కమిషన్ జారీ చేసిన ఉత్తర్వులు ఆధారంగా పోలీసు కమిషనర్ తక్షణ చర్యలు తీసుకోవాలని, గవర్నర్ జోక్యం చేసుకుని పాఫెసర్ రాజశేఖర్ ను వీసీ పదవినుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.జాజి ఓంకార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గుడివాడ ప్రసాద్, గోడి వెంకటేశ్వర రావు, గుడివాడ భాస్కర రావు, చెక్క రాంబాబు, జీ తాత బాబు, మూర మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగానే దళిత స్కాలర్లపై వివక్ష

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త,

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో దళిత రీసెర్చ్ స్కాలర్ లమీద ఏయూ యాజమాన్యం వేధింపులకు దిగడం, ఉద్దేశపూర్వకంగా వివక్ష కనపరచడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె వి ప్రభాకర్ తెలిపారు. దళిత హక్కుల పోరాట సమితి, అంబేద్కర్ మెమొరీ సొసైటీ ప్రతినిధులు నిజ నిర్ధారణ కోసం ఏయూని సందర్శించారు. బాధిత అంబేద్కర్ చైర్ ఫెలోషిప్ స్కాలర్ లు అయిన ప్రవీణ్ కుమార్, మరో స్కాలర్ రాజ్ కుమార్ ను కలిసి వాస్తవాలను అడిగి తెలుసుకున్నారు. గత 14 నెలలుగా ఇద్దరు స్కాలర్లను ఉద్దేశపూర్వకంగానే ఇబ్బందులకు గురి చేస్తున్నారని, యూజీసీ నుంచి గ్రాంట్ వచ్చినప్పటికీ వీరికి నిధులు విడుదల చేయకుండా ఇబ్బంది పెడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జే వి ప్రభాకర్ అన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తే గాని గ్రాంట్ విడుదల చేయలేదన్నారు. గ్రాంటు ఇచ్చినట్లు యుటిలైజేషన్ సర్టిఫికెట్ కూడా ఆలస్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బి కళ్యాణ్ రావు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సామ రాజులు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం

మధురవాడ, మే 18 ప్రభాతవార్త

మిథిలాపురి లే అవుట్ శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయం ట్రస్టు బోర్డు సభ్యులతో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ అభివృద్ధికి సభ్యులందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ట్రస్టు బోర్డు చైర్మన్ గా ఎం. కోటేశ్వరరావును, వైస్ చైర్మన్ గా ఎం. రాజేశ్వరిలను ప్రకటించారు. సభ్యులుగా పి.భాస్కరరావు, జి.త్రిమూర్తి రాజు, ఎం. శ్రీనివాసరావు, ఎస్.గురుమూర్తి, జి.పద్మజ, జి.గిరిజలు ప్రమాణం చేశారు. జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, లొడగల అప్పారావు, మాన్యాల సోంబాబు, నాగోతి సత్యనారాయణ, చెట్టుపల్లి సన్యాసిరావు, నాగోతి సూర్య ప్రకాష్, మండా రమేష్, పిల్లా రాము, శ్రీకాంత్ రాజు, బోయి శ్రీను, నమ్మి రమణ, పోతిన ప్రసాద్, పిల్లా మోహన్ కృష్ణ, అప్పలరాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 120 ఫిర్యాదులు

విశాఖపట్నం, మే 18 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు 120 ఫిర్యాదులు వచ్చాయి. ప్రతీ సోమవారం నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహిస్తున్న ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ డాక్టర్.శంఖబ్రత భాగ్చి, ఐ.పీ.ఎస్., ప్రత్యక్షముగా నగర పోలీసు సమావేశమందిరం నందు లో నగర సబ్-డివిజన్ ఏ.సి.పి లు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ లు, ఎస్సైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనీ, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 120 మంది ఫిర్యాదుదారులు వచ్చి తమ తమ సమస్యలను రిపోర్టులు ద్వారా పోలీసు కమిషనర్ కి అందజేసినారు. సిపి ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాదిదారులతో స్వయముగా మాట్లాడి, వారి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదిదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసినదిగా ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి మరియు సివిల్ కేసుల విషయం సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

డీజిల్ ధరల పెరుగుదలతో కుదేలైన మత్స్య పరిశ్రమను కాపాడాలి

విశాఖపట్నం, మే 18 ప్రభాతవార్త

విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మెకనైజ్డ్ మరియు మోటరైజ్డ్ ఫిషింగ్ బోట్ యజమానులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారు. దేశవ్యాప్తంగా డీజిల్ ధరలు అమాంతం పెరగడంతో మత్స్య పరిశ్రమ పూర్తిగా కుదేలయ్యే పరిస్థితి ఏర్పడింది. సముద్రంలో వేటకు వెళ్లే ఖర్చులు భారీగా పెరగడంతో వేలాది మంది మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి కోల్పోయే ప్రమాదంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫిషింగ్ బోట్లకు వినియోగించే డీజిల్‌పై లీటరుకు రూ.25/- సబ్సిడీని కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే మంజూరు చేసి మత్స్యకారులను ఆదుకోవాలని వాసుపల్లి జానకిరామ్ అధ్యక్షతన సుమారు 400 మంది ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ సభ్యులు గట్టిగా డిమాండ్ చేసింది. అదేవిధంగా, గతంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో ఫిషింగ్ బోట్ల మరమ్మతులు, నిర్మాణ పనులు మరియు ప్రమాదాల సమయంలో బోట్ యజమానులకు ఉపయోగపడే విధంగా ఒక క్రేన్ మంజూరు చేయాలని ప్రతిపాదించగా, గత విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ రామ్ మోహన్ రావు గారు దానిని ఆమోదించి శాంక్షన్ చేసినప్పటికీ ఇప్పటివరకు ఆ క్రేన్ హార్బర్‌లో అందుబాటులోకి తీసుకురాకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం

విశాఖపట్నం, మే 18 ప్రభాతవార్త

ఇసుక కొండ ప్రాంతంలోని శ్రీ శ్రీ శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం తో పాటు పూర్ణామార్కెట్ శ్రీ దుర్గాలమ్మ ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్, సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగానే కాకుండా సమాజానికి సాంస్కృతిక వారసత్వాన్ని అందించే కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.

భక్తుల సౌకర్యార్థం ఆలయాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ , ప్రజల సహకారంతో ఆలయాల అభివృద్ధి మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ ఇంచార్జి సుధాకర్ , జనసేన పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివప్రసాద్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు , కూటమి నాయకులు, కార్యకర్తలు, దుర్గాలమ్మ ఆలయ చైర్మన్ రఘు, సత్యనారాయణ స్వామి ఆలయ చైర్మెన్ సూర్య ప్రకాశ్ , భక్తులు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మధురవాడ జోన్ వార్డుల విభజనపై అభ్యంతరం

పిఎం పాలెం, మే 18, ప్రభాతవార్త:

జీవీఎంసీ పరిధిలోని మధురవాడ జోన్‌లో చేపట్టిన వార్డుల విభజన విధానం పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా 10వ వార్డు పరిధిలో పి.ఎం.పాలం సమీప ప్రాంతాలను కలపకుండా, దూరంగా ఉన్న ఎం.వి.వి సిటీ తదితర ప్రాంతాలను కలిపి విభజించడం అన్యాయమని స్థానికులు పేర్కొంటు న్నారు. నేషనల్ హైవేను కేంద్రంగా తీసుకుని ఒక వైపు మూడు వార్డులు, మరో వైపు రెండు వార్డులుగా విభజిస్తే పరిపాలనా సౌలభ్యం ఉంటుందని జనసేన పార్టీ విశాఖపట్నం రూరల్ వైస్ ప్రెసిడెంట్ ఈ.ఎన్.ఎస్ చంద్రరావు తెలిపారు. ప్రజల అవసరాలు, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా చేసిన ఈ విభజనపై జీవీఎంసీ అధికారులు పునరాలోచన చేసి తగిన సర్దుబాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి వార్డుల విభజనలో మార్పులు చేయాలని చంద్రరావు కోరారు.

పెట్రోల్ భారం ప్రజలపై మోపింది ఎవరు?

: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్రీనివాస్

పిఎం పాలెం, మే 18, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ ధరల భారాన్ని ప్రజలపై మోపింది గత వైసీపీ ప్రభుత్వమేనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్రీనివాస్ విమర్శించారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఐదు సంవత్సరాల కాలంలో విడతల వారీగా లీటరు పెట్రోల్‌పై సుమారు రూ.45 వరకు భారం పెంచారని ఆయన ఆరోపించారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రజలకు ఎటువంటి ఉపశమనం కల్పించలేదని పేర్కొన్నారు.ఇతర రాష్ట్రాలు పన్నులు తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ, అప్పటి వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తగ్గించలేదని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాలనలో కనిపిస్తున్న ధరల పెరుగుదల రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల వల్ల కాదని, అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల ప్రభావంతో దేశవ్యాప్తంగా ఏర్పడిన స్వల్ప పెరుగుదల మాత్రమేనని తెలిపారు. దేశ ప్రధాని తమ వాహన వినియో గాన్ని తగ్గించు కుని ఆదా చర్యలు చేపడు తున్నారని, అలాగే గౌరవ ముఖ్య మంత్రి కూడా భద్రతా సిబ్బంది వాహనాల విని యోగాన్ని తగ్గిస్తూ డీజిల్ ఆదా దిశగా చర్యలు తీసుకుం టున్నారని పేర్కొన్నారు. భవిష్య త్తులో యుద్ధ ప్రభావం వల్ల మరిన్ని ఆర్థిక ఇబ్బం దులు వచ్చే అవకా శాలను ముందు గానే అంచనా వేసి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుం టోందని అన్నారు. ఇలాంటి సమయంలో ప్రజలు, మేధావులు, రాజకీయ పార్టీలు కలిసి పరిస్థితులను ఎదుర్కో వాల్సి ఉండగా, తమ రాజకీయ ఉనికిని కాపాడు కోవడానికి వైసీపీ నాయకులు ధర్నాల పేరుతో రోడ్లపైకి రావడం ప్రజలు సహించు కుంటున్నారని దాసరి శ్రీనివాస్ వ్యాఖ్యా నించారు.

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : విజయనగరం
రికవరీ సెక్షన్, పాత బాలాజీ జంక్షన్, రింగ్ రోడ్డు, విజయనగరం-535002.

హైపోథికేషన్ డీడ్ క్రింద బ్యాంకుకు సెక్యూరిటీగా హైపోథికేట్ చేయబడిన వాహనము అమ్మకానికి ఇ-వేలం నోటీసు

కెనరా బ్యాంక్ సెక్యూర్డ్ క్రెడిటర్ స్వాధీనం చేసుకున్న, బ్యాంకు/సెక్యూర్డ్ క్రెడిటర్‌కు హైపోథికేట్ చేయబడిన/చార్జ్ చేయబడిన, కెనరా బ్యాంక్ వారికి బకాయిల మొత్తాన్ని తిరిగి పొందడానికి క్రింద వివరించిన వాహనాలను "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో తేది.10.06.2026 న మ॥ 03:00 నుండి సా॥ 04:00 గం॥ల వరకు విక్రయించబడుతుందని, ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది. ఋణగ్రహీత వివరాలు, బకాయి ఉన్న మొత్తం, వాహనం యొక్క వివరాలు, రిజర్వు ధర మరియు ముందస్తు డబ్బు డిపాజిట్, బిడ్ పెరుగుదల క్రింద ఇవ్వబడ్డాయి.

చింతలవలస బ్రాంచ్, ఫోన్: 83310 15675

ఋణగ్రహీత: శ్రీ. పూలేపాటి వెంకటేశ్వర్లు, డి నెం.37-7-26, శివాలయం వీధి, మంచుకొండ గార్డెన్స్, సత్య నగర్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530007 వారు చెల్లించవలసిన బకాయి మొత్తం: రూ. 3,38,125.45/- + తేది.15.05.2026 నుండి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు.

వాహనం వివరములు	రిజర్వు ధర
HYUNDAI MOTOR COMPANY Vehicle Reg.No: AP 35 AQ 2548 Engine No: D4FCJM626197 Chassis No: MALBM51RLJM574353 Model: I20 ACTIVE CRDI	రూ. 4,20,000/-
	ధరావత్తు రూ. 42,000/-

★ ఆన్‌లైన్ ఈ -వేలం అమ్మకం జరుగు పోర్టల్ https://baanknet.com ★ రిజర్వ్ ధరలో 10% ధరావత్తు మొత్తాన్ని M/s పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని ధరావత్తును RTGS/NEFT ద్వారా చలానాలోని ఖాతా వివరములకు తేది 10.06.2026 న మ॥ 12.00 గం॥ల లోపుగా పొందుపరిచి జమచేయాలి. ★ విజయవంతమైన బిడ్డర్ అమ్మకపు ధరలో 25% (ఇప్పటికే చెల్లించిన ధరావత్తుతో సహా) వెంటనే అదే రోజు మరియు తదుపరి పనిదినం తర్వాత డిపాజిట్ చేయాలి మరియు మిగిలిన 75% అమ్మకపు ధరను సెక్యూర్డ్ క్రెడిటర్ అమ్మకం నిర్ధారించిన తేదీ నుండి 15 రోజులలోపు జమ చేయాలి. ★ విజయవంతమైన బిడ్డర్ పైన తెలిపిన వ్యవధిలోపు అమ్మకపు ధరను చెల్లించకపోతే, అతను చేసిన డిపాజిట్‌ను అధీకృత అధికారి ఎటువంటి నోటీసు లేకుండా జప్తు చేస్తారు మరియు ఆస్తిని వెంటనే మళ్ళీ అమ్మకానికి ఉంచుతారు. వాహనం యొక్క తగిన శ్రద్ధ మరియు భౌతిక ధృవీకరణ మరియు బిడ్ సమర్పించే ముందు ఆస్తి/ఆస్తుల వివరణ గురించి సంతృప్తి చెందడం బిడ్డర్ బాధ్యత. బిడ్ సమర్పించిన తర్వాత ఎటువంటి క్లెయిమ్‌ను బ్యాంకు స్వీకరించదు. ఆసక్తిగల బిడ్డర్లకు తేది.18.05.2026 నుండి 06.06.2026 వరకు ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4:00 గం॥ల మధ్యలో వెబ్‌సైట్ వేలంలో వాహన తనిఖీకి అనుమతి ఉంటుంది. ★ వేలం రద్దు చేయుటకు / వాయిదా వేయుటకు బ్యాంక్ వారికి సర్వ హక్కులు కలవు. ★ విజయవంతమైన బిడ్డరు వాహనం యొక్క గోడౌన్ పార్కింగ్ చార్జీలు, స్టాంప్ డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ మొదలైన వాటికోసం అయ్యే అన్ని ఛార్జీలు భరించవలసి ఉంటుంది. ★ ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: M/s పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్, వెబ్ పోర్టల్: https://baanknet.com, మొబైల్: 7046612345/6354910172 /8291220220/9892219848/8160205051.

తేది : 16.05.2026, స్థలం : విజయనగరం — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

జూన్ 23న మాధవధార కుంచుమాంబ అమ్మవారి ప్రధాన పండుగ

మాధవధార, మే 18, ప్రభాతవార్త

మాధవధార గ్రామ దేవత,గ్రామ ఇలవేల్పు శ్రీ కుంచుమాంబ అమ్మవారి పండుగకు సంబదించి గ్రామస్తుల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్ణయించారు.జూన్ 22వ తేది సోమవారం నాడు శ్రీ కుంచుమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం నిర్వహిస్తారని,జూన్ 23వ తేది మంగళవారం నాడు శ్రీ కుంచుమాంబ అమ్మవారి ప్రధాన పండుగ,జూన్ 30వ తేది మంగళవారం నాడు శ్రీ కుంచుమాంబ అమ్మవారి మారువారం,జూలై 2వ తేది గురువారం నాడు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి పండుగ,జూలై 5వ తేది ఆదివారం నాడు శ్రీ కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీ మాధవ యువజన సమాజం కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గో మాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గో మాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలి.

కలెక్టర్లు తప్పనిసరిగా ఎస్పిసిఏ మీటింగ్‌లను తప్పనిసరిగా నిర్వహించాలి

మట్టికొయ్య పోతురాజు, అధ్యక్షులు, హైందవ దళితసేన

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త

గావో విశ్వస్య మాతరః: ఎస్పిసిఏ గనుక జిల్లా కలెక్టర్లు సక్రమంగా నిర్వహించి అధికారులను అప్రమత్తం చేయగలిగితే జంతువధ, ప్రధానంగా గో వధ ఆపడానికి పెద్ద అవరోధం ఉంటుందని కావున తప్పనిసరిగా ఎస్పిసిఏ మీటింగ్‌లను నిర్వహించాలని కోరుతూ విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాన్ని సమర్పించినట్లు హైందవ దళితసేన వ్యవస్థాపక అధ్యక్షులు మట్టికొయ్య పోతురాజు మీడియా సమావేశంలో వెల్లడించారు. విశాఖపట్నం వింజాన్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హైందవ దళితసేన గౌరవ అధ్యక్షులు బూసిం వైవి సత్యనారాయణతో కలిసి మాట్లాడారు. భారత దేశ సంస్కృతి సంప్రదాయాలలో గో మాతకు ఉన్న ప్రత్యేకత మీకు తెలియంది కాదు. అనేక కారణాల వల్ల మనదేశంలో గో సంతతి నశిస్తున్న సంగతి కూడా మీకు తెలుసు. గోసంతతిని పెంచి పోషించాల్సిన రైతు వ్యవసాయంలో గో, వృషభాలను పక్కనపెట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ ముందుకు పోతున్నాడు. అలాగే రసాయనాలతో కూడిన పాలు, పెరుగు, నెయ్యి వంటి వాడుకుంటూ కుటుంబ ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారు. మనకు దైవమిచ్చిన ప్రకృతి సంపదలో గో సంతతి ప్రధానమైనది. పురాణకాలం నుండి గో సంతతి ఈ దేశంలో కుటుంబంలో ఒక సభ్యునిగా కలిసి ఉండేది. కానీ, ఈ రోజు అదే గోవు పోషణ లేక రోడ్డున పడి ప్లాస్టిక్ పదార్థాలను తింటూ ఆరోగ్యం పాడు చేసుకోవడంతో పాటు ఎవరికీ అక్కర్లేని పశువులా మారిపోయింది. ఇది చాల దురదృష్టకరం. ఈ విషయంలో ప్రజలందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో హైందవ దళిత సేన, ఆంధ్రప్రదేశ్, ధర్మో రక్షతి రక్షితః ఫౌండేషన్ మరియు ఇతర గో రక్షా ప్రేమికులతో కలిసి గో రక్షా రథయాత్ర పేరుతో ఇచ్ఛాపురం నుండి హిందూ పురం వరకూ గో మాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోటి సంతకాల సేకరణ, గో మాత, గో సంతతి పట్ల అవగాహన పేరుతో 6 నెలల పాటు రథయాత్ర, పాదయాత్ర, బహిరంగ సభ ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఎంత చైతన్యవంతులైనా ప్రభుత్వ సహకారం లేకుండా ముందుకు పోలేమన్న సంగతి మీకూ తెలుసు. అందుకే ప్రజా ప్రతినిధులైన రాష్ట్ర ఎమ్మెల్సీ,ఎమ్మెల్యేల సహకారాన్ని అర్థిస్తూ వారి ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము. ఉత్తరాంధ్రలోని ఎమ్మెల్సీలకు వినతి పత్రాలు ఇచ్చాము. పార్లమెంట్‌లో కూడా చట్టం తెచ్చి గో మాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలని ఎంపిలకు విజ్ఞప్తి చేస్తున్నాము. అదే విధంగా గో సంతతిని కూడా ప్రతి ఇంటా ఒక సభ్యునిగా చేర్చుకుని పెంచుకునేలా నెల నెల వృద్ధులకు, వికలాంగులకు ఇస్తున్నట్లు పెన్షన్ మాదిరి చేయాలని, ధర్మాదాయ శాఖ నుండి 30% నిధులను కేటాయించి గోవును కూడా రూ. 1,000/-ల చొప్పున పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము. ఇదేవిధంగా గోసంతతిని లెక్కించి వాటికి ఆధార్ తరహా కార్డులను, వాటి ఆరోగ్య సంరక్షణకు మొబైల్ వ్యాన్‌లను ఏర్పాటు చేసే కొన్ని రాష్ట్రాల్లో రైతు భరోసా పొందుతున్న లబ్ధిదారి రైతులకు గోవుల్ని పెంచే విధంగా ఆయా గోవులకు కూడా ఈ సౌకర్యం అందితే గో సంరక్షణ మరింత సులభం అవుతుంది. అదే విధంగా విధంగా పార్లమెంట్‌లో చర్చించాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో హైందవ దళితసేన రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ పితాని సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీ చందు స్వామీజీ, పితాని నంద గోపాల్, శ్రీ వెంకట దత్తనంద స్వామీజీ వారు, శ్రీ తురగా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

కోటి విష్ణు సహస్రనామం పారాయణం ప్రారంభం

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త

వన్ టౌన్ రాజప్ప నాయుడు వీధిలో గల శ్రీ గీతా ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో శ్రీ గీతా భవనంలో శ్రీ గీతా మందిరంలో సుదర్శన సహిత కోటి విష్ణు సహస్రనామం పారాయణం మంగళ ధ్వని వేదమంత్రములతో అత్యంత వైభవంగా ప్రారంభమైంది . ఈ ఉత్సవాన్ని అమ్మవారి ఉపాసకులు సిద్ధాంత శిరోమణి దైవజ్ఞ బ్రహ్మశ్రీ అక్కా జోస్యుల రమేష్ శర్మ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు . అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విష్ణు సహస్రనామాన్ని పారాయణం చేయడం వలన విశ్వశాంతి కలగడమే కాకుండా లోకం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు . పారాయణంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ పరమాత్మ యొక్క కృపను పొందే దిశగా పారాయణం చేయాలని పిలుపునిచ్చారు . ఉత్సవాన్ని తలపెట్టిన నిర్వాహకులను అభినందించి ఆశీస్సులను అందజేశారు . ప్రారంభంలో భాగంగా అఖండ జ్యోతి ప్రజ్వలన , గణపతి పూజ , పుణ్యాహవాచనం, రుత్విక్ వరుణ , దీక్షాధారణ, అగ్ని ప్రతిష్ట , నవగ్రహ ఆరాధన, మండపారాధన, విశ్వరూప భగవానునికి అర్చనలు , ప్రత్యేక పూజలు , కుంకుమ అర్చనలు హోమములు, పరమేశ్వరునికి అభిషేకములు అర్చకులు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ , శ్రీ గీతా ప్రచార సమితి అధ్యక్షులు సిహెచ్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి జగన్ మోహనరావు , కార్యదర్శి ఎం వనజా దేవి , సంయుక్త కార్యదర్శి పి నూకరాజు , కోశాధికారి జివిఆర్ ప్రసాద్ , జి లక్ష్మీనరసింహ వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు , సభ్యులు స్థానికులు పరిసర ప్రాంత వాసులు వివిధ ప్రాంతాల నుండి భక్తులు విచ్చేశారు . పారాయణంలో పాల్గొన్న భక్తులు ముక్తకంఠంతో శ్రీ విష్ణు సహస్రనామాన్ని పారాయణం చేస్తున్నారు.

కులాయి నీటిని పునరుద్ధరించాలని జీవీఎంసీకి బీజేపీ నేతలు వినతి

గాజువాక, మే 18, ప్రభాతవార్త:

అక్కిరెడ్డిపాలెం రైల్వే ట్రాక్ సమీప నివాసితులకు తాగునీటి కులాయిలను పునరుద్ధరించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షులు పరశురామరాజు నేతృత్వంలో, గాజువాక ఇన్‌ఛార్జ్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో జీవీఎంసీ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర నేత పి.వి.ఎన్. మాధవ్ సూచనలతో తాము క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నామన్నారు. నీటి సరఫరా నిలిచిపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దాడి రమేష్, కృష్ణారెడ్డి బాధిత మహిళలు పాల్గొన్నారు.

సకాలంలో కురవని వర్షాలు ముందుకుసాగని తొలకరి పనులు

పద్మనాభం, మే 18, ప్రభాతవార్త

శాస్త్రవేత్తలు చెప్పిన ప్రకారం వాతావరణంలో నెలకొన్న ఎలినినో ప్రభావం వల్ల పద్మనాభం మండలంలో వర్షాబావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో వర్షాలు ముఖం చాటేయడంతో ఈ సంవత్సరం తొలకరి పనులు ముందుకు సాగలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు వారాలు క్రితం కురిసిన వర్షాలకు కృష్ణాపురం, మద్ది, అనంతవరం, పాండ్రంగి, గెద్దపేట, పొట్నూరు, విలాసఖానపాలెం, విజయరామపురం, గందవరం తదితర గ్రామాలలో తొలకరి పంటలలో భాగంగా నువ్వుల విత్తనాలు చల్లారు. వర్షాలు లేక మొక్కలు భూస్థాయిలో ఉండిపోయాయి. అలాగే పలు గ్రామాలలో అసలు నువ్వులు చల్లలేదు. వేరుశనగ విత్తనాలు వెయడానికి వివిధ గ్రామాలలో దుక్కులే దున్నలేదు.అయితే నైరుతీ రుతుపవనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.వారం రోజులలో వర్షాలు పడకపోతే తొలకరి పంటలు లేనట్లేనని రైతులు తెలిపారు.

విద్యాసంస్థల బస్సులపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు

మాధవధార, మే 18, ప్రభాతవార్త

విశాఖలో విద్యాసంస్థల బస్సులపై కొనసాగుతున్న ప్రత్యేక తనిఖీలలో భాగంగా సోమవారం ఏయూ మైదానంలో విద్యాసంస్థల బస్సులను అధికారులు ముమ్మరంగా తనిఖీ చేశారు.నగరవ్యాప్తంగా 22 మంది ఇన్స్పెక్టర్లతో ఈ తనిఖీలు చేపట్టారు.3టౌన్ పరిధిలో 20 బస్సులను అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గోవిందరావు పరిశీలించగా,ఎక్స్పైరీ అయిన ఫైర్ సిలిండర్లు ఉన్న 3 బస్సులకు నోటీసులు ఇచ్చారు. విద్యార్థుల భద్రత కోసమే ఈ చర్యలని ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు తెలిపారు.లోపాలను సరిచేసుకొని, సంబంధిత ఎంవీఐ/ఏఎంవీఐ సమక్షంలో డీటీసీ కార్యాలయంలో వాహనాలను సమర్పించాలని ఆదేశించారు.భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

గాజువాకలో వారాహి అమ్మవారి ప్రత్యేక పూజలు-ఘనంగా గోడపత్రిక ఆవిష్కరణ

గాజువాక, మే 18, ప్రభాతవార్త:

గాజువాక వడ్లపూడిలో జూలై 15 నుండి 24 వరకు శ్రీ వారాహి అమ్మవారి ప్రత్యేక పూజలు, హోమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు వేదపండితులు హరీష్ శర్మ తెలిపారు. మద్దిలపాలెంలోని బీజేపీ నేత పి.వి.ఎన్. మాధవ్ క్యాంపు కార్యాలయంలో ఈ పూజలకు సంబంధించిన గోడ పత్రికను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీష్ శర్మ మాట్లాడుతూ.. వడ్లపూడి మీసేవా కేంద్రం ఎదురుగా ఉన్న మైదానంలో పది రోజుల పాటు శాస్త్రోక్తంగా హోమాలు జరుగుతాయని, ఈ వేడుకలకు పలువురు పీఠాధిపతులు, స్వామీజీలు విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్, గాజువాక ఇన్‌ఛార్జ్ కరణంరెడ్డి నరసింగరావు, కృష్ణారెడ్డి, రాజశేఖర్, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

-పైడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా ఘనంగా సత్కారం

గాజువాక, మే 18, ప్రభాతవార్త:

జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో శ్రీ శ్రీ శ్రీ పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామానికి చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. 2025-2026 ఎస్సెస్సీ ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులతో పాటు రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీల్లో రాణించిన క్రీడాకారులను నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్కూల్ విద్యార్థులు జి. సాహితి (594), టి. సాయిప్రియ నిహారిక (589), జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వి.ఎస్.ఎస్. అధితి (591), జి. కోటలక్ష్మి (587), శ్రీ సాయిశర్వాణి స్కూల్ విద్యార్థులు పి. శశిప్రియ (582), ఎం. లావణ్య (565) మార్కులతో పురస్కారాలు అందుకున్నారు. అలాగే ఖో-ఖో పోటీల్లో ప్రతిభ చాటిన ఆర్. తరుణ్ కుమార్, ఆర్. దిల్లేశ్వరి, గిరీషలను అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ గుడివాడ అనూష, రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్, బి.వి. రమణ, కె. రాంబాబు, పీటీ మాస్టర్ ఇస్మాయిల్ హాజరై విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణారావు, బొడ్డు గంగరాజు, బొడ్డు అప్పారావు నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలో గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వార్డుల పునర్విభజన తర్వాతే ఓటర్ల జాబితా ఇవ్వాలి

-జేసీకి బీజేపీ వినతి

గాజువాక, మే 18, ప్రభాతవార్త:

జీవీఎంసీ వార్డులను 98 నుండి 120కి పెంచే ప్రక్రియలో భాగంగా, ప్రత్యేక ఓటర్ల సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పూర్తయిన తర్వాతే తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని బీజేపీ నాయకులు కోరారు. 'జనతా వారధి' ఆధ్వర్యంలో విశాఖ జాయింట్ కలెక్టర్ గొబ్బిల్ల విద్యాధరికి బీజేపీ జిల్లా అధ్యక్షులు పరశురామరాజు నేతృత్వంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ సూచనల మేరకు ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని చెప్పారు. జిల్లాలోని చెరువుల్లో పూడికతీత పనులను వేగవంతం చేయాలని, దాని ద్వారా వచ్చే మట్టిని స్థానిక కుమ్మరులకు ఉచితంగా ఇవ్వాలని కోరారు. దీనివల్ల చేతివృత్తుల వారికి ఆర్థికంగా మేలు జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాడి రమేష్ నాయుడు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెన్నేటినగర్ పార్క్ అభివృద్ధి పనులు ప్రారంభోత్సవంలో విష్ణుకుమార్ రాజు



విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త

సహాకారంతో నగరపాలక సంస్థ తెన్నేటినగర్ పార్కులో వివిధ అభివృద్ధి పనులు దాదాపు 20 లక్షలు రూపాయల అభివృద్ధి పనులుఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ఎపి బిజెపి శాసనసభా పక్షనాయకులు శ్రీ విష్ణు కుమార్ రాజు గారి చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 50 వ వార్డ్ తెదేపా అధ్యక్షులు ఏపి కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ సనపల వరప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో శ్రీ విష్ణుకుమార్ రాజు గారు మాట్లాడుతూ మాధవదార చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి తాను ఎంతైనా కృషిచేస్తానని అన్నారు. అలాగే విశాఖపట్నాన్ని ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని అన్నారు.తదనంతరం పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల వితరణ విష్ణుకుమార్ రాజు గారి చేతులు మీదుగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారిని తెన్నేటినగర్ నివాసులు గజమాలతో ఘనంగా సత్కరించారు. జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి శ్రీ లొడగల క్రిష్ణ గారు, విశాఖ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు శ్రీ సురేష్ బాబు గారు, 50 వ వార్డ్ బిజెపి అధ్యక్షుడు శ్రీ కూన వెంకట్రావు, శ్రీ యు. అప్పలకొండ యాదవ్, వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ శ్రీమతి టి.పద్మజా తెన్నేటినగర్ అధ్యక్షుడు శ్రీ నంబాళ్ళ ఈశ్వరరావు, కార్యదర్శి శ్రీ శీపాన రాము, శ్రీ సనపల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విలాసఖానపాలెంలో ఘనంగా బంగారమ్మ తల్లి తొలేళ్ల సంబరం

పద్మనాభం, మే 18, ప్రభాతవార్త

మండలంలో విలాసఖానపాలెం గ్రామంలో కొలువు దీరిన బంగారమ్మ తల్లి తొలేళ్ల సంబరంను గ్రామ ప్రజలు సోమవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. ముందుగా సాయంత్రం పూజారి రామశింగు సత్యమమ్మ అమ్మవారి ఘటాలను పూర్వ సాంప్రదాయ ప్రకారం మాదిగ డప్పులతో గ్రామంలో ఊరేగింపు కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం ఘటాలను గ్రామంలో బోని సన్యాసినాయుడు మాస్టారు ఇంటి వద్ద ఉన్న శతకం పట్టు వద్ద వేంచేయించారు. అక్కడ గ్రామ ప్రజలు అమ్మవారికి పూజలు చేసారు.

సామాజిక సేవలో గాదె బాలాజీ చేస్తున్నా కృషి అభినందనీయం

- ఘనంగా రాధా రంగ రాయల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గాదె బాలాజీ జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన రాజకీయ,వ్యాపార, సంఘనాయకులు, అభిమానులు

- బొగ్గు శ్రీను మిత్రమండలి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహణ

- టెలి ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి, భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాస్

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త

సామాజిక సేవలో గాదె బాలాజీ చేస్తున్నా కృషి అభినందనీయమని పలువురు అభినందించారు.సోమవారం రాధా రంగ రాయల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గాదె బాలాజీ జన్మదిన వేడుకలు బొగ్గు శ్రీను మిత్రమండలి ఆధ్వర్యంలో అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషుల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ ప్రముఖులు, సంఘ నాయకులు హాజరై బాలాజీకి శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక సేవా రంగంలో ఆయన చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అందరూ ప్రశంసించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఉత్తర ఎం ఎల్ ఏ విష్ణు కుమార్ రాజు,వైకాపా నగర అధ్యక్షుడు కె కె రాజు, జై భారత్ నగర్ గ్రామ అధ్యక్షులు డా॥ బొగ్గు శ్రీను స్వయంగా బాలాజీని కలిసి జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు.మాజీ మంత్రి,భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాస్ అందుబాటులో లేకపోవడంతో టెలి ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, "గాదె బాలాజీ" మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించి, నిరంతరం ప్రజా సేవలో నిమగ్నం కావాలని" ఆకాంక్షించారు. బాలాజీ జన్మదినాన్ని పురస్కరించుకుని బొగ్గు శ్రీను మిత్రమండలి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గం నలుమూల నుంచి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు నీరాజనాలు పలికారు. వేడుక ప్రాంతమంతా సందడిగా మారింది. ఈ వేడుకలో వివిధ సంఘాల నాయకులు,మాధవ ధార జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాపు సంఘం నాయకులు,కూటమి నాయకులు,జనసేన నాయకులు,వైకాపా నాయకులు, స్థానిక ప్రముఖులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని జన్మదిన వేడుకలను విజయవంతం చేశారు.

తాటిపూడి రిజర్వాయర్‌ను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త

తాటిపూడి జలాశయం నుంచి జీవీఎంసీకి జరుగుతున్న నీటి సరఫరా వ్యవస్థను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం పరిశీలించారు. కృష్ణాపురం హెడ్‌వాటర్ వర్క్స్ నీటి శుద్ధి కేంద్రం, పంప్ హౌస్‌ను తనిఖీ చేసి నిర్వహణను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. రానున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా సమృద్ధిగా ఉండేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. తాటిపూడి నుంచి జీవీఎంసీకి రోజుకు 11 ఎంజీడీ ముడి నీరు సరఫరా అవుతోందని అధికారులు కమిషనర్‌కు వివరించారు. అనంతరం జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్క్ కార్యాలయాన్ని సందర్శించిన కమిషనర్, పరిశ్రమలకు అవసరమైన నీటి వినియోగంపై వివరాలు తెలుసుకుని సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్ మురళీకృష్ణ, విజయనగరం ఇరిగేషన్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ అప్పలనాయుడు, విస్కో ప్రతినిధి సుమన్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ వీరయ్య, నీటి శుద్ధి కేంద్రం స్కాడా కాంట్రాక్టర్ రమేష్‌రాజు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో ట్రాఫిక్ జాతర!

-పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలతో ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు -కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్.. ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు -రోడ్డుపై స్టేజీల ఏర్పాటుతోనే సమస్య -వాహనదారుల ఆగ్రహం -ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు విఫలం

గాజువాక, మే 18, ప్రభాతవార్త:

గాజువాక పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. జింక్ ప్రధాన ద్వారం సమీపం శ్రీ శ్రీ శ్రీ పెంటమాంబ అమ్మవారి ఆలయ పండగ మహోత్సవాల సందర్భంగా సోమవారం గాజువాక ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆలయ ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపైనే భారీ స్టేజీలు, పండగ ఏర్పాట్లు చేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. పెంటమాంబ అమ్మవారి గుడి నుంచి కోరమండల్ గేట్ వరకు దాదాపు కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దాదాపు రెండు గంటలకు పైగా వాహనాలు కదలని స్థితిలో ఉండిపోవడంతో కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు, అత్యవసర ప్రయాణికులు తీవ్ర నరకయాతన అనుభవించారు.

పోలీసుల వైఫల్యంపై మండిపాటు..

ఇంత పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుగుతున్నప్పటికీ, ముందస్తుగా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టడంలో స్థానిక ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని వాహనదారులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు కూడా సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి, పండగ ముగిసే వరకు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని,ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

'1 నిమిషం - 4 డబ్బాలు' అవగాహన కార్యక్రమం ప్రారంభం

చెత్తను నాలుగు రకాలుగా విభజించి అందించాలని ప్రజలకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపు

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త:

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో "1 నిమిషం -- 4 డబ్బాలు" పేరుతో ప్రత్యేక ప్రజా అవగాహన కార్యక్రమాన్ని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం ప్రారంభించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి ఇంటిలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తడి, పొడి, హానికర, ప్రత్యేక వ్యర్థాలుగా నాలుగు వేర్వేరు డబ్బాలలో విభజించి పారిశుధ్య కార్మికులకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో విశాఖ నగరాన్ని దేశంలోనే పరిశుభ్ర నగరంగా నిలపాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. "స్వచ్ఛ సేవకులు" ప్రతి ఇంటికి వెళ్లి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పిస్తారని, ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. తడి చెత్తను ఆకుపచ్చ డబ్బాలో, పొడి చెత్తను నీలం డబ్బాలో, హానికర చెత్తను ఎరుపు డబ్బాలో, ప్రత్యేక చెత్తను నలుపు రంగు డబ్బాలో వేయడం ద్వారా వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ సులభమవుతుందని కమిషనర్ వివరించారు.

కూటమి హామీలను అమలు చేయాలి: సిపిఐ డిమాండ్

గాజువాక,మే 18,ప్రభాతవార్త:

ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ సచివాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించి, అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వడంలో విఫలమయ్యాయన్నారు. 2014 నాటి టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంచలేదని, పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాల హామీని అటకెక్కించారని మండిపడ్డారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న లక్షలాది రేషన్ కార్డులు, పెన్షన్ల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కాంద్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు, టి. కామేశ్వరరావు, జి. జయ, టి. గోపి, ఎస్. లక్ష్మి, బి. వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రంగంలో అనకాపల్లిని ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం

త్వరలో అత్యాధునిక ఎం ఆర్ ఐ స్కాన్ సౌకర్యం ఏర్పాటు చేస్తాం : ఎంపీ డా. సీఎం రమేష్

అనకాపల్లి, ప్రభాతవార్త

ఆరోగ్య రంగంలో అనకాపల్లిని ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో పనిచేస్తున్నామని అనకా పల్లి పార్లమెంట్ సభ్యులు డా.సీఎం రమేష్ అన్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయంలో పార్లమెం టు సభ్యులు సీఎం రమేష్ ప్రత్యేక చొరవతో మీగ్నేసిత ఇండియా లిమిటెడ్ సంస్థ సి ఎస్ ఆర్ నిధుల ద్వారా రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పేషంట్ వెయిటింగ్ హాల్, బేబీ ఫీడింగ్ రూమ్, డి-అడిక్షన్, రిహాబిలిటేషన్ సెంటర్‌ల ను ఎంపీ సీఎం రమేష్, మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాజమండ్రి సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్‌లు సోమవారం ఘనంగా ప్రారంభించారు. అదేవిధంగా 2025-26 సంవత్సరానికి గాను ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన రూ.6 లక్షల వ్యయంతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ సి.ఎం.రమేష్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సిఎస్ఆర్ నిధులను జిల్లా అభివృద్ధికి వినియోగిస్తు న్నామని తెలిపారు. ఆరు నెలల్లో పూర్తి చేయాల్సిన నిర్మాణ పనులను కేవలం 80 రోజుల్లోనే పూర్తి చేసి సంస్థ కమిట్‌మెంట్‌ను చాటిందని పేర్కొంటూ. మీగ్నేసిత ఇండియా లిమిటెడ్ సంస్థ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఎన్టీఆర్ ఆసుపత్రికి వచ్చే వేలాది మంది రోగులు, వారి సహాయకుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎంపీ నిధులతో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని తెలిపారు. స్థానిక అవసరాలను గుర్తించి తక్కువ సమయంలోనే దీనిని అందుబాటులోకి తీసుకువచ్చిన అధికారులను అభినందించారు. ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కాన్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, దాదాపు రూ.5 నుంచి రూ.6 కోట్ల వ్యయంతో అత్యాధునిక ఎంఆర్ఐ స్కాన్ ఏర్పాటు చేయడానికి అవసరమైన నిధులను సమీకరించి త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ వివిధ పరిశ్రమలు సిఎస్ఆర్ నిధులతో ముందుకు వస్తే మోడ్రన్ అనకాపల్లి నిర్మాణం సాధ్యమవుతుందని, ఆరోగ్య రంగంలో అనకాపల్లి జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో పరిశ్రమల సిఎస్ఆర్ నిధులను ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు ప్రజా అవసరాల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సదుపాయాలు రోగులకు, వారి సహాయకులకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య రంగాభివృద్ధికి పరిశ్రమలు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని అన్నారు. ఆసుపత్రుల్లో మౌలిక పాయాల అభివృద్ధి, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, కార్పొరేషన్ చైర్మన్లు బత్తుల తాతయ్య బాబు, మల్ల సురేంద్ర, ఉమ్మడి విశాఖ మాజీ టీడీపీ జిల్లా అధ్యక్షులు దాడి రత్నాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపూరెడ్డి పరమేశ్వరరావు, మీగ్నేసిత ఇండియా లిమిటెడ్ హెడ్ నాగేశ్వరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ హైమావతి, డీసీహెచ్ఎస్ డా.శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రవికుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి మే 18, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా నలుమూలన అనేక వ్యాధులతో ఇబ్బంది పడుతూ వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సూచించారు. సోమవారం అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆస్పుటల్ నందు ఆయన ఆకస్మిక పర్యటన చేసి ఆస్పుటల్ పేషెంట్స్‌తో మాట్లాడుతూ హాస్పిటల్లో అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్పిటల్ మెయింటినెన్స్, హాస్పటల్లో, ఆపరేషన్ థియేటర్లో నిర్వహిస్తున్న పరిశుభ్రతను, పేషంట్స్ అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ హాస్పిటల్‌కి వచ్చే పేషెంట్స్‌కి మెరుగైన వైద్యం అందించాలని, మందులు కొరత ఉండరాదని, పరిశుభ్రత పాటించాలని, ఇలాంటి విషయాలో ఉపేక్షించేది లేదని వైద్య సిబ్బందికి, కాంట్రాక్టర్లకు తెలియజేశారు.

కలెక్టరేట్‌లో ఆయుష్ ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహణ

అనకాపల్లి, మే 18, ప్రభాతవార్త

జిల్లా కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్) నిర్వహించే రోజున ఆయుష్ ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సూచనల మేరకు సోమవారం ఉదయం కలెక్టరేట్లో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలియజేశారు. ప్రతి సోమవారం ప్రజలకు అందుబాటులో ఆయుర్వేదం, హోమియోపతి సేవలు అందించడం జరుగుతుంది. వ్యాధి నిరోధక శక్తిని పెంచే మందుల పంపిణీతో పాటు బీపీ చెక్ అప్, మోకాళ్ళ నొప్పులు, ఆయాసం, దగ్గు, నీరసం, ఎసిడిటీ, మధుమేహం, వంటి వ్యాధులకు మందులు, సన్ స్ట్రోక్ నకు ప్రివెంటివ్ మందులు పంపిణీ చేసినట్లు రోగులను తనిఖీ చేయడానికి హోమియోపతి మెడికల్ అధికారి నీ నియమించినట్లు కలెక్టర్ తెలియజేశారు.

పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

ఎలమంచిలి, మే 18, ప్రభాతవార్త

పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలంటూ వైఎస్ ఆర్సిపి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ర్యాలీ నిర్వహించి అనంతరం తహశీల్దార్ వరహాలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి నాయకులు మాట్లాడుతూ పెరుగు తున్న ఇంధన ధరలు సామాన్య ప్రజలు, ఆటో కార్మికులు, రైతులు మధ్య తరగతి కుటుంబాలపై తీవ్ర భారం మోగుతున్నాయని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వ నిలబెట్టుకోవాలని వెంటనే పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలు కారణంగా నిత్యవసర వస్తువులు ధరలు కూడా పెరిగి ప్రజల జీవనం కష్టతరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కోలా గురువులు, నియోజవర్గ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు : ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి మే 18, ప్రభాతవార్త

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ హెచ్చరిం చారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, డి.ఎస్.పి ఎం.శ్రావణి ఆదేశాల మేరకు, అనకాపల్లి టౌన్ పరిధిలో ట్రాఫిక్ సీఐ ఎం.వెంకట నారాయణ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ద్విచక్ర వాహనాలను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ, అజాగ్రత్తగా, అధిక శబ్దం చేస్తూ, నెంబర్ ప్లేట్లు లేకుండా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారిని గుర్తించి పట్టుకున్నారు. ఇలాంటి వాహనదారులపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వాహనాలు నడిపిన వారిపై ఐదు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజల ప్రాణాలకు, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ట్రాఫిక్ రూల్స్ పాటించ కుండా వాహనాలు నడిపే వారిపై ఇదే విధంగా కఠిన చర్యలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు.

గుంతలమయమైన రోడ్డుతో ప్రమాదాలు

తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజా సంఘాల డిమాండ్

అచ్యుతాపురం, మే 18, ప్రభాతవార్త

అచ్యుతాపురం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు నుంచి భోగాపురం వెళ్లే రహదారిలో వాటర్ పైప్‌లైన్ పనుల కోసం రోడ్డు తవ్వి తిరిగి పునరుద్ధరణ చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి గుంతల మయంగా మారడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజా సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, ఐద్వా మండల కన్వీనర్ రొంగలి లక్ష్మి మాట్లాడుతూ మండల కేంద్రానికి అనుసంధానంగా ఉన్న ఈ రహదారిపై మడుతూరు, అప్పన్నపాలెం, జంగులూరు ప్రాంతాల ప్రజలతో పాటు అపార్ట్మెంట్ల నివాసితులు, కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, కంపెనీ కార్మికులు వందల సంఖ్యలో నిత్యం ప్రయాణిస్తున్నారని తెలిపారు. రోడ్డు పూర్తిగా గుంతలతో నిండిపోవడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని, పలువురు గాయపడుతున్నారని చెప్పారు. ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారిని మరమ్మతు చేసి ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్డి అప్పలనాయుడు, చుక్క నాగేశ్వరరావు, పారిపల్లి సోమునాయుడు, ఈ.యశోద లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా బైక్‌ను తాడుతో లాగిన సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం మే 18 ప్రభాతవార్త

అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా సీఐటీయూ ఆధ్వ ర్యంలో సోమవారం వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. బైక్‌కు తాడు కట్టి లాగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రాము మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల దేశవ్యాప్తంగా ప్రధాన సమస్యగా మారిందన్నారు. ఇంధన ధరలు పెరగడం వల్ల కేవలం వాహనదారులకే కాకుండా ప్రతి సామాన్యుడిపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ఇంధన ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు అధికమై కూరగాయలు, పాలు, నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. దీంతో సామాన్య ప్రజల నెలవారీ కుటుంబ బడ్జెట్ దెబ్బతింటోందన్నారు. డీజిల్ ధరల పెరుగుదల కారణంగా ట్రాక్టర్లు, పంపుసెట్ల వినియోగ వ్యయం పెరిగి రైతులపై అదనపు భారం పడుతోందని చెప్పారు. అలాగే బస్సు ఛార్జీలు, ఆటో అద్దెలు పెరగడంతో ప్రజల ప్రయాణ ఖర్చులు కూడా భారమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వస్తువుల ఉత్పత్తి, పంపిణీ ఖర్చులు పెరగడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా సామాన్య ప్రజలపై భారం మోపుతున్నాయని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూరేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, ప్రజల అవసరంగా మారిన వాహనాల ఇంధనంపై ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతున్నాయని ఆరోపించారు. ఈ విధానాలను ప్రభుత్వం మార్చుకోకపోతే ప్రజలు తిరుగుబాటు చేయా ల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో లభించే ఆయిల్ నిక్షేపాలను ప్రైవేటు పెట్టుబడిదారులకు అప్పగించి, మరోవైపు ప్రజలకు పొదుపు చర్యలు చేపట్టాలని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు లాలం నర్సింగరావు, శ్రీను, సత్యం, రాము, రాజు, వాసు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో వార్డుల విభజనపై ముసాయిదా ప్రతిపాదన విడుదల

ఎలమంచిలి, మే 18, ప్రభాతవార్త

మున్సిపాలిటీలో వార్డుల విభజనపై ముసాయిదా ప్రతిపాదన సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు, సచివాల సిబ్బందితో ముసాయిదాను విడుదల చేశారు. పురపాలక సంఘం పరిధిలో వార్డుల పునర్విభజన ప్రక్రియ వేగవంతమైంది. ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల చట్టం 1965, ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నెం.64 మార్గదర్శకాలకు అనుగుణంగా, పట్టణంలోని వార్డుల సంఖ్యను ప్రస్తుతమున్న 25 నుండి 32కు పెంచుతూ ముసాయిదాను సిద్ధం చేశారు. పెరిగిన జనాభా, ఓటర్ల సంఖ్యను ప్రాతిపదికన తీసుకుని ఈ విభజనను రూపొందించినట్లు కమిషనర్ ప్రసాద్ రాజు వెల్లడించారు. ఈ పునర్విభజన ముసాయిదా ప్రతిపాదనలను ఇప్పటికే పురపాలక సంఘ కార్యాలయంతో పాటు, స్థానిక తహసీల్దార్ కార్యాలయం, అన్ని వార్డు సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచారని తెలిపారు. ఈ ప్రతిపాదిత వార్డుల పునర్విభజనపై ప్రజలు తమ అభ్యంతరాలను, సలహాలను లేదా సూచనలను రాతపూర్వక రూపంలో సమర్పించేందుకు అవకాశం కల్పించారు. ఆసక్తి గల వారు ఈ ప్రకటన వెలువడిన ఏడు రోజుల గడువులోగా, అంటే మే 25, 2026 సాయంత్రం 5 గంటలలోపు తమ అభిప్రాయాలను యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌కు నేరుగా అందజేయాలని అన్నారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత అందే ఎలాంటి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని కమిషనర్ ప్రసాద్ రాజు స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, వార్డుల విభజన ప్రక్రియలో తమ అభిప్రాయాలను పంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

20న అనకాపల్లి జిల్లాలో మందుల దుకాణాలు బంద్

అనకాపల్లి మే 18, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లాలో ఈనెల 20న మందుల దుకాణాలు బంద్ నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వంకాయల ఈశ్వర రావు, కార్యదర్శి ఎంఎస్ ప్రకాష్ గుప్తా, కోశాధికారి వై సతీష్ కుమార్ తెలిపారు. అనకాపల్లిలో సోమవారం జరిగిన అనకాపల్లి జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ జిల్లా స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ దేశయంగా సుదీర్ఘకాలంగా సుమారు 12 లక్షల 47 వేల మందుల దుకాణాలను నిర్వహిస్తూ, వాటిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన సుమారు నాలుగు కోట్ల మంది భారతీయులను ఇబ్బందులు పాలు చేసే విధంగా నిర్వహిస్తున్న మందుల ఆన్లైన్, కార్పొరేట్, నిషేధిత, నకిలీ ముందుల అమ్మకాలకు నిరసనగా ఈనెల 20వ తేదీ బుధవారం దేశవ్యాప్త సమ్మె లో భాగంగా అనకాపల్లి జిల్లాలో కూడా అన్ని మందుల దుకాణాలను మూసివేస్తున్నామని తెలిపారు. దేశంలో ప్రవేశించిన ఆన్లైన్ ముందుల అమ్మకాలు, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్ లు ఆఫర్ల పేరిట జరుగుతున్న మోస పూరిత వ్యాపారాలు, నిషేధిత, నకిలీ ముందుల విక్రయాలతో దేశీయంగా సాంప్రదాయ మందుల దుకాణాల యజమానులు వీటిపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడిన వారు పెద్ద ఎత్తున ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మెకు జాతీయ స్థాయిలో ఉన్న సంఘాలు అన్నీ పిలుపునిచ్చాయన్నారు. ఆల్ ఇండియా సమ్మెలో భాగంగా జిల్లాలో కూడా అన్ని మందుల దుకాణాలను మూసివేస్తున్నామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో మందులు వాడుతున్న వారు, అత్యవసర పరిస్థితుల్లోనూ ఎవరూ ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమ్మెకు అందరూ సహకరించి విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. దేశంలో ఉన్న సుమారు 12.47 లక్షల దుకాణాలపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడి ఉన్న నాలుగు కోట్ల మంది జీవనం కోసం చేస్తున్న ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సమ్మె గోడ, కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పెతకశీశెట్టి శివ సత్యనారాయణ, పరమేశ్వరరావు, రాము, సూర్యనారాయణ, రాజేష్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ ధరలు పిలుపుపై... వైయస్సార్ సిపి ఆందోళన

గొలుగొండ మే 18 ప్రభాతవార్త

పెట్రోల్ డీజిల్ ధరలు పెంపుపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తాహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు కొరుప్రోలు ఫణి శాంతారాం ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఆందోళనలో ప్రభుత్వ తీరును ఎండగడుతూ సామాన్యుల పై ధరలు భారం మోపి బ్రతుకు భారం చేస్తుందని ఆరోపించారు. నిత్యవసర గా మారిన పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడంతో నిత్యవసర సరుకులపై భారం రేట్లు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని లీటర్ కు మూడు రూపాయలు ఒకేసారి పెంచడం అన్యాయమని విమర్శించారు. ఏలే వారికి బుద్ధి లేకుండా హద్దులు దాటి సామాన్యుల బ్రతుకులపై పెట్రోభారం మోపుతున్నారని అన్నారు. అనంతరం తహసిల్దార్ కాకర నూకరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, మాజీ సర్పంచులు, వైసిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

గొలుసు కట్టు చెరువులు ఆధునీకరణ పనులు పరిశీలన

గోల్కొండ మే 18 ప్రభాతవార్త

సాగునీటిని మెరుగుపరిచేదుకు ప్రభుత్వం నీటిపారుదల శాఖ ద్వారా చెరువుల ఆధునీకరణ పనులు చేపట్టినట్లు ఎంపీడీవో ఉలపాల శ్రీనివాస రావు అన్నారు. జనసేన నాయకులు బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన సూర్యచంద్రతో కలిసి సిహెచ్ నాగపురం పంచాయతీలో పాలెపు చెరువును ఆయన సందర్శించారు. గొలుసు కట్టు చెరువుగా ఆధునికరిస్తున్న పనులను పరిశీలించి స్థానిక శ్రామికులతో మాట్లాడారు. పని సమయంలో అందుతున్న కొత్త వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి శ్రామికులకు తగు జాగ్రత్తలు, గ్రామంలో పారిశుధ్యంపై అవగాహన తడి, పొడి చెత్త వేరుచేయడం ప్లాస్టిక్, పేపర్లు స్వచ్ఛ రథంనకు అందజేసి తగిన నిత్యవసరాలు తీసుకోవాలని సూచించారు. జనసేన నాయకులు రేగుబళ్ళ సాంబశివ, నీటిపారుదల శాఖ రవిచంద్ర, ఏపీవో సూర్య మనణి, కూటమి నాయకులు బొప్పన ప్రసాద్, ముఖ్య నాయకులు, శ్రామికులు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి- మండల వైసీపీ డిమాండ్

మాకవరపాలెం మే 18 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై అధిక భారాన్ని మోపే విధంగా పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం సరికాదంటూ మండల వైసీపీ అధ్య క్షులు చిటికెల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద మండల వైఎస్ఆర్సిపి పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోలు డీజిల్ ధరలు పెంపకంపై రాష్ట్ర వైఎస్ఆర్సిపి పిలుపుమేరకు మాకవరపాలెం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రెవెన్యూ కార్యాలయం ఎదురుగా పార్టీ జెండాలతో వైఎస్ఆర్సిపి మండల నాయకులు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు చిటికిల వెంకటరమణ మాట్లాడుతూ సామాన్యుల నడ్డి విరిసే విధంగా పెట్రోల్ డీజిల్ పెంచడం పట్ల ఆయన అసహనం వ్యక్తపరిచారు. పెట్రోలు డీజిల్ రేట్లు పెంచడం వలన నిత్యవసర సరుకులు పై దాని ప్రభావం పడి నిరుపేద మధ్యతరగతి కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యే అవకాశం ఉందన్నారు. దీనిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేసి పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఆయన ఈసందర్భంగా డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన పాలనతో సామాన్య ప్రజలకు గుడి బంధగా మారిందన్నారు. కనీసం సామాన్య ప్రజలకు అత్యవసరమైన గ్యాస్ ను చైతన్ సరఫరా చేయలేని స్థితిలో ప్రభుత్వ పనీతీరు ఉందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సంక్షేమం అభివృద్ధి అనే పేరుతో పాలన చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజలను పూర్తిస్థాయిలో మోసం చేసింది అంటూ వెంకటరమణ ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించి సామాన్యులకు న్యాయం చేయాలని ఈసందర్భంగా వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాగంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహల్దారుకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు(సర్వం) వైఎస్ఆర్సిపి మండల మాజీ అధ్యక్షులు రుత్తల వాసు, వైస్,ఎంపీపీ రాజారావు,మాజీ ఎంపీపీ రుత్తల సత్తిబాబు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గొంతెన హరిబాబు, పెట్ల దొరబాబు, రుత్తల శీను, భీమిరెడ్డి గోవింద, పాశెపు నాగేశ్వరరావు, చిటికెల బాబు,బుడ్డా రమణ, చినబాబు, అధిక సంఖ్యలో మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

కూటమి ప్రభుతం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి

ఎస్ రాయవరం, మే 18, ప్రభాతవార్త

పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పార్టీ పిలుపుమేరకు నాయకులు కార్యకర్తలు అడ్డరోడ్డు జంక్షన్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ, నిరసనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు సక్రమంగా నిర్వహించలేదు, రెండేళ్ల పాలల్లో పెట్రోలు డీజిల్ ధరలు పెంచడం దారుణం అన్నారు. పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలన్నారు. అనంతరం అడ్డరోడ్డు ఆర్డిఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ,చిక్కాల రామారావు, నక్కపల్లి జెడ్ పి టి సి కాసులమ్మ, ఎస్ రాయవరం వైస్ ఎంపీపీ అప్పన్న, ఎస్ రాయవరం మండల పార్టీ అధ్యక్షులు మధువర్మ నియోజవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి వైకాపా రాష్ట్ర నేత వీసం

నక్కపల్లి,ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వం పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలను తక్షణమే తగ్గించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ,విశాఖ దక్షిణ నియోజక వర్గం ఇంచార్జ్ వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో రామకృష్ణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నక్కపల్లి మండలం నుంచి వైకాపాశ్రేణులు తరలి వెళ్లిన సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రజలు అనేకమైన సమస్యల మీద సతమతం అవుతున్న సందర్భంలో మరోపక్క గ్యాస్ దొరక్క అవస్థలు పడుతున్న పరిస్థితుల్లో పెట్రోల్, డీజిల్ పెంచడం దారుణమని రామకృష్ణ అన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఆలోచించి ఉపసంహరించుకోవాలని, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు పూర్తిస్థాయిలో ప్రజలకు మేలు కలిగే విధంగా తగ్గించాలని కోరారు. ఆయనతోపాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోసలకాసులమ్మ, వెలగ ఈశ్వరరావు, గొర్ల గోవిందు, పొడగట్ల పాపారావు, కాకర వెంకటరావు, ఎలమంచిలి చందు ,తల్లా భార్గవ్ ,వెలగ రమేష్ ,తూము ప్రసాద్, ఎల్లేటి సత్యనారాయణ ,గంట తిరుపతిరావు ,పిక్కి తాతయ్యలు, దేశెట్టి గంగా నాగేశ్వరరావు, రాజయ్యపేట సూరిబాబు, తదితరులు ఉన్నారు.

అద్దె చెల్లించని యూకో బ్యాంక్‌పై చర్యలు తీసుకోవాలి

: పి.ఎ.సి.ఎస్ చైర్మన్ డిమాండ్

గూడెం కొత్తవీధి, మే 18, (ప్రభాతవార్త)

గత 11 ఏళ్లుగా అద్దె చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న యూకో బ్యాంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని, తమ భవనాన్ని ఖాళీ చేయించాలని పి.ఎ.సి.ఎస్ జీకే వీధి చైర్మన్ మొట్టడం నూకరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సొసైటీ సీఈవో చిన్నబ్బాయితో కలిసి సోమవారం జీకే వీధి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ఆయన ఫిర్యాదు చేశారు .ఈ సందర్భంగా చైర్మన్ నూకరాజు మాట్లాడుతూ.. జీకే వీధి కోఆపరేటివ్ సొసైటీ భవనాన్ని 2013లో నెలకు రూ.1,500 అద్దె చెల్లించే ఒప్పందంతో యూకో బ్యాంక్ తీసుకుందని తెలిపారు. అయితే, గత 11 సంవత్సరాలుగా బ్యాంక్ యాజమాన్యం అద్దె చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు నోటీసులు జారీ చేసినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు . ఇప్పటికైనా పూర్తి అద్దె బకాయిలను చెల్లించి, భవనాన్ని ఖాళీ చేసి సొసైటీకి అప్పగించాలని గ్రీవెన్స్‌లో కోరి నట్లు చెప్పారు. సొసైటీ సీఈవో చిన్నబ్బాయి, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంధన ధరల పెంపుపై వైఎస్సార్‌సీపీ నేత బొబ్బిలి లక్ష్మణ్ ఆగ్రహం:

ఇంధన పన్నులు తగ్గించాలని డిమాండ్...

గూడెం కొత్తవీధి, మే 18, (ప్రభాతవార్త)

దేశవ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్య ప్రజలపై తీవ్ర భారాన్ని మోపుతున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగ కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఇంధన ధరలను అదుపు చేయాలని ఆయన కోరారు. పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావం రవాణా రంగంపై పడి, మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని బొబ్బిలి లక్ష్మణ్ పేర్కొన్నారు. దీనివల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు రోజువారీ జీవనంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిరంతరం పెరుగుతున్న పెట్రో భారం వల్ల సమాజంలోని వివిధ వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆయన వివరించారు. ముఖ్యంగా పెట్టుబడి వ్యయం పెరిగి రైతులు, రోజువారీ సంపాదన కోల్పోతూ ఆటో డ్రైవర్లు, కార్మికులు మరియు మధ్యతరగతి ప్రజలు ఈ ధరల పెరుగుదల వల్ల నలిగిపోతున్నారని ఆవేదన చెందారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని బొబ్బిలి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ప్రజల ఇబ్బందులు, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇంధనంపై విధిస్తున్న పన్నులను తగ్గించి, ధరలను తక్షణమే అదుపులోకి తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

శ్రీ మోదకొండమ్మ జాతరలో

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రదర్శన

ప్రదర్శనను ఘనంగా జ్యోతి ప్రజ్వలన గవించి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ నిషాంతి

పాడేరు, మే 18, (ప్రభాతవార్త)

స్థానిక అశేష భక్తజనావళి ఎంతగానో ఎదురుచూసే ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకొని భక్తుల కోసం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయని, అమ్మవారి దర్శనార్థం వచ్చే లక్షలాది మంది భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచేందుకు, అమ్మవారి గుడి ఎదురుగా ఉన్న ఓపెన్ ఆడిటోరియంలో బ్రహ్మకుమారీస్ ఓం శాంతి సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బృహత్తర ఆధ్యాత్మిక జ్ఞాన విజ్ఞాన చిత్ర ప్రదర్శనను సోమవారం ఘనంగా జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అల్లూరి జిల్లా కలెక్టర్ టి.నిశాంతిముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. భక్తులను ఎంతగానో ఆకట్టుకునేలా ఈ ప్రదర్శనలో పలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.?108 శివలింగాల అలంకరణ, భక్తుల దర్శనార్థం ఏకకాలంలో 108 శివలింగాలను ఇక్కడ కొలువుదీర్చారు.?స్వర్ణిమ భారతదేశ నమూనా, భారతదేశ ప్రాచీన వైభవాన్ని, ఆధ్యాత్మిక ఉన్నతిని చాటిచెప్పే స్వర్ణిమ భారత దేశ నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.?ఆధ్యాత్మిక జ్ఞాన విజ్ఞాన చిత్ర ప్రదర్శన, మానసిక ప్రశాంతతకు, జీవిత విలువలకు సంబంధించిన చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు.ఆధ్యాత్మిక విలువలతో కూడిన సన్ ఫ్లవర్ సెల్ఫీ పాయింట్, జాతరకు వచ్చే యువత, భక్తుల కోసం నైతిక విలువలను చాటిచెప్పే అందమైన 'సన్ ఫ్లవర్ సెల్ఫీ పాయింట్'ను సిద్ధం చేశామన్నారు. ఈ ప్రదర్శన తిలకించేందుకు విచ్చేసిన ప్రముఖులు, ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని బ్రహ్మకుమారీస్ సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాడేరు మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గిడ్డి ఈశ్వరి,పాడేరు ఐటీడీఏ అధికారిగా గతంలో పనిచేసిన అభిషేక్, రాష్ట్ర సాంస్కృతిక కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ గంగులయ్య, ఇతర ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతర ముగిసేవరకు ఈ ప్రదర్శన భక్తులకు అందుబాటులో ఉంటుందని, కావున భక్తులందరూ ఈ ఆధ్యాత్మిక ప్రదర్శనను తిలకించి, అమ్మవారి కృపతో పాటు మానసిక ప్రశాంతతను పొందాల్సిందిగా నిర్వాహకులు కోరారు.

జాతర లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉచిత మజ్జిగ పంపిణీ

పాడేరు, మే 18, (ప్రభాతవార్త)

మన్యం ఆరాధ్యదైవం శ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవాలు పాడేరులో ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా సాగుతున్నాయి.అమ్మవారిని దర్శించుకోవడానికి పోటెత్తిన భక్తుల సేవలో స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ఆదివారం, సోమవారం ముందుకొచ్చింది. జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నాడు ఎండ తీవ్రతను సైతం లెక్కచేయక తరలివచ్చిన వేలాది మంది భక్తులకు బ్యాంకు ఆధ్వర్యంలో చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. అమ్మవారి కృపతో తోటి జీవులకు సేవ చేయడమే పరమార్థంగా భావించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.?ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ సంగ్రామం జిత్ సహో మాట్లాడుతూ, ఏటా అత్యంత పవిత్రంగా జరిగే మోదకొండమ్మ తల్లి జాతరలో భక్తులకు సేవ చేసే భాగ్యం కలగడం పూర్వజన్మ సుకృతమని కొనియాడారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల దాహం తీర్చి, వారిలో ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని నింపడానికే బ్యాంకు తరపున ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పండగ రెండవ రోజైన మంగళవారం కూడా ఈ మజ్జిగ పంపిణీ నిరంతరాయంగా కొనసాగుతుందని, భక్తుల సేవలో భాగస్వాములు కావడం తమకు ఎంతో తృప్తిని ఇచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ఎండ వేడిమిలో అలసిపోయిన భక్తులకు మజ్జిగ అందిస్తూ బ్యాంకు సిబ్బంది చూపిన సేవాభావం అందరిలోనూ స్ఫూర్తిని నింపింది. ఈ కార్యక్రమంలో బ్యాంకు డిప్యూటీ మేనేజర్ సంగ్రామం జిత్ సహో,డి. ఎమ్.ఎన్. శ్రీనివాస్, కుమార్, సోములు, శివ రామకృష్ణ, శ్రీనివాస్ నాయుడు, మూర్తి, కిరణ్, శివ, మన్మధ్, సూర్య, బహుగుణ,సత్యనారాయణ, నిరుపమతో పాటు పెద్ద సంఖ్యలో బ్యాంకు ఖాతాదారులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

వేలాది మందితో భారీ అన్న సమారాధన

పాడేరు, మే 18, (ప్రభాతవార్త)

పాడేరు శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ వారి మూడు రోజులు జాతర మహోత్సవములు కొరకు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థంరోజు 3000 నుండి 4000 మంది వరకు భారీ అన్నదాన కార్యక్రమం విశాఖపట్నం స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ వారి ఆర్థిక సహాయంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు సల్లా రామకృష్ణ, తమర్బ ప్రసాదరావు నాయుడు కొణతాల సతీష్, కిల్లు చంద్రమోహన్ కుమార్ ,గూడెపు సూర్య ప్రకాష్, లకే రత్నబయి, పలాసి రమణమ్మ పురుష లక్ష్మయ్య, కూర రాము, దిలీప్ కుమార్ ,పాల్గొన్నారు అలాగే మూడో రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నది కావున భక్తులందరు వచ్చి అన్న ప్రసాద కార్యక్రమాన్ని స్వీకరించి అమ్మవారు ఆశీస్సులు పొందవలసిందిగా కోరి ప్రార్థిస్తూ ఉన్నామన్నాడు.

రోడ్డు కి అడ్డదిడ్డంగా చిన్ను వైన్స్ వాహన పార్కింగ్

రోడ్డును సగానికి ఆక్రమించి మద్యం సరుకును దించుతున్న చిన్ను వైన్స్

అరకులోయ, మే 18, ప్రభాతవార్త:

పర్యాటక కేంద్రమైన అందాల అరకులోయ లో మద్యం దుకాణాలకు సంబంధించిన వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నాయి. నిత్యం ఇటు పర్యాటకులు , అటు స్థానిక వాహనాలతో రద్దీగా ఉండే అరకులోయ ప్రధాన రహదారిలో చిన్ను వైన్స్ కు చెందిన వాహనం రోడ్డుని సగానికి పైగా ఆక్రమించి పార్కింగ్ చేసి సరుకును దించుతుండ డంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు పోలీస్ శాఖ రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, మరోవైపు ఇవేవీ పట్టనట్లు చిన్ను వైన్స్ వ్యవహరిస్తూ సరుకును దించేందుకు తమ వాహనాన్ని రోడ్డుకి అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. తమను ఎవ్వరూ అడిగేవారు లేరన్న ధీమాతో ప్రధాన రహదారిలో రోడ్డుని ఆక్రమించి మద్యం సరుకును దించుకోవడంతో ఇతర వాహనదారులు చిన్ను వైన్స్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీస్ శాఖ , ఎక్సైజ్ శాఖ చర్యలు చేపట్టాలని స్థానికులు వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు .

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం పై 20,21 తేదీల్లో నిరసన

పాడేరు, మే 18, (ప్రభాతవార్త)

ప్రభాతవార్త:ఏపీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ నెల 20,21 వ తేదీల్లో విద్యుత్తు బస్సులను ఆర్టీసీ ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయాలనీ ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనీ,స్త్రీ శక్తి బస్సులలో జీరో టికెట్టు ఇచ్చే విధానాన్ని నిలుపుదల చేసి, మిగతా ప్రయాణీకులకు టిక్కెట్టు ఇచ్చే విధంగా చర్యలు తీసుకొవాలని, సిబ్బందిపై పనిభారం తగ్గించాలనీ,పీ ఆర్ సి కమిటీని నియమించి ఐఆర్ ను వెంటనే ప్రకటించాలనీ,పెండింగ్లో ఉన్న 4 డి ఎ లు, అరియర్స్ లీవ్ ఎనాక్యాష్మెంట్లు ఇవ్వాలలని ఈ నెల13న ప్రభుత్వానికి,ఆర్టీసీ యం.డి.కి వినతి పత్రం అందజేసినట్టు నాయకులు పేర్కొన్నారూ.ప్రయాణీకులకు సరిపడా కొత్త బస్సులు వెంటనే కొనుగోలు చేయాలనీ, అన్ని కేటగిరీలలో ఖాళీలను భర్తీ చేయాలనీ,రిటైర్ అయిన, చనిపోయిన సిబ్బందికి వెంటనే సెటిల్మెంట్స్ చేయాలనీ,ఉద్యోగులను ఈ హెచ్ ఎస్ నుండి మినహాయించి గతంలో ఆర్టీసీ నందు ఉన్న వైద్య సదుపాయం అమలుచేయాలనీ పాడేరు డిపో మేనేజర్ వినతి పత్రం అందజేసినట్టు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ పాడేరు డిపో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టి.రమణ, జిల్లా ప్రెసిడెంట్ బి ఎస్ నారాయణ,జిల్లా సెక్రెటరీ జి.వి రమణ, డిపో ప్రెసిడెంట్ తురక గంగాధర్ డిపో సెక్రెటరీ ఎస్ ఆర్ బాబు తెలియజేసారు.

ఈదురు గాలుల బీభత్సం - విద్యుత్ కు అంతరాయం

గూడెం కొత్తవీధి/సీలేరు, మే 18, (ప్రభాతవార్త)

గూడెం కొత్తవీధి మండలం దారకొండ గ్రామంలో సోమవారం సాయంత్రం వేసిన బారి ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు పడిపోయి విద్యుత్ తీగలపై పడటం వలన విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి కొత్త స్థంబాల చేరిక వంటి మరమ్మతు పనులు ప్రారంభించారు. 33 కెవి లైన్ స్థంబాలు 2 పూర్తిగా విరిగిపోవడం. 4 చోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడం వలన విద్యుత్ సరఫరాకు కొంత ఆలస్యం అవుతుందని ప్రజలు సహకరించాలని విద్యుత్ సిబ్బంది తెలిపారు.

తెలుగు దేశం పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి..

మండల మాజీ తెలుగు మహిళ అధ్యక్షురాలు ముక్కలి రాములమ్మ పిలుపు.

గూడెంకొత్తవీధి, మే 18, (ప్రభాతవార్త):

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని జీకేవీధి మండల టీడీపీ కార్యకర్తలకు మాజీ టిడిపి తెలుగు మహిళ అధ్యక్షురాలు ముక్కలి రాములమ్మ పిలుపునిచ్చారు.సోమవారం ఆమె విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, జీకేవీధి మండలంలో పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు.పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్యకర్తలను ప్రోత్సహించడం తమ బాధ్యత అని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారిని గుర్తించి తగిన గౌరవం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామాల్లో ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.టీడీపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీకి మరింత ఆదరణ పెంచాలని కోరారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుకు నిరసన

అరకు రూరల్, మే 18, ప్రభాతవార్త:

పెట్రోల్, డీజిల్ పెంపుకు నిరసనగా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ లో అరకు శాసనసభ్యులు రేగం మత్స్యలింగం, ఉమ్మడి విశాఖ జడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైసిపి శ్రేణులతో కలిసి శాంతి ర్యాలీ జరిపారు. అరకులోయ భారత పెట్రోల్ బంక్ నుండి ప్రధాన రహదారి మీదగా వైయస్సార్ విగ్రహం వరకు శాంతి ర్యాలీ కొనసాగింది. ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ పాలనను కొనసాగిస్తున్నాయని, దీనిలో భాగంగానే సామాన్య ప్రజల నడ్డి విరిచేలా పెట్రోల్ డీజిల్ ధరలను పెంచినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. లీటర్ పెట్రోల్ కేంద్రం మూడు రూపాయలు పెంచితే రాష్ట్రం ఐదు రూపాయలు పెంచిందని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్ యుద్ధ పరిస్థితులను సాకుగా చూపి ధరలను పెంచడం దుర్మార్గమన్నారు. అలాగే ప్రజలపై పన్నుల భారం మోపడం అన్యాయమని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలతో పాటు సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెబుతారని అన్నారు. వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సూచనలు మేరకు అరకులోయలో శాంతి ర్యాలీ నిర్వహించడం జరిగిందని చెప్పారు. కాగా శాంతి ర్యాలీ అనంతరం వైసీపీ నాయకులు శ్రేణులు అరకు రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించి, ధరలు తగ్గించకపోతే ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగం చాణిక్య, వైసిపి సీనియర్ నాయకుడు కమ్మిడి అశోక్, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, వైసీపీ నాయకులు చెట్టి అప్పాలు, స్వాభిరామ్మూర్తి, సూర్యనారాయణ, పరశురాం, అనిల్, పద్మారావు, విజయ్ కుమార్, ఈశ్వరమ్మ, మితుల, గుడివాడ ప్రకాష్, శుక్ర పాస్టర్, తదితరులు పాల్గొన్నారు.

భరోసా పార్టీ అధ్యక్షుడు

అభినయ్ దర్శన్‌పై దుండగుల దాడి

గూడెం కొత్తవీధి, మే 18, (ప్రభాతవార్త)

భరోసా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభినయ్ దర్శన్‌పై సోమవారం కొందరు గుర్తుతెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. స్థానికులు మరియు బాధితుల కథనం ప్రకారం.. అభినయ్ దర్శన్ తన అనుచరులతో కలిసి జీకే వీధి మండలం జర్రెల సమీపంలోని నీరుతోటమామిడి పాలెం గ్రామానికి వాహనంలో వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కొందరు అపరిచిత వ్యక్తులు ఆయన ప్రయాణిస్తున్న కారును అడ్డగించి, మొదట వాహనాన్ని తీవ్రంగా ధ్వంసం చేశారు. అనంతరం అభినయ్ దర్శన్‌ను బలవంతంగా సమీపంలోని కాఫీ తోటల్లోకి లాక్కెళ్లి తీవ్రంగా కొట్టారు. ఈ దాడిలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, ఆయనను చికిత్స నిమిత్తం సమీపంలోని జర్రెల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ దాడికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

ఘనంగా కొనసాగుతున్న అమ్మవారి జాతర మహోత్సవాలు

పాడేరు, మే 18, (ప్రభాతవార్త)

ఉత్తరాంధ్ర జిల్లాల దైవం, మన్య ప్రజల ఇలవేల్పు పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారు మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పాడేరు మెయిన్ రోడ్డు సతకం పట్టు వద్ద కొలువుతీరు ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తల్లి ఘటాన్ని పాదాలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు అలాగే రెండవ రోజు పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెక్కరు. అమ్మవారి దర్శనానికి వందలాదిగా రావడంతో ఆలయం కిటకిటలాడుతుంది. జాతరలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పాడేరు పురావీధులలో వైభవంగా అమ్మవారి ఘటాలు ఊరేగింపు

- కళాబృందాలు, డప్పు వాయిద్యాల కోలాహలంతో పాడేరు పట్టణం

పాడేరు, మే 18, (ప్రభాతవార్త)

శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయం నుండి ఐటీడీఏ వరకు నిర్వహించిన అమ్మవారి ఘటాల ఊరేగింపు అత్యంత వైభవంగా, కన్నులపండువగా సాగింది. స్థానిక పురావీధుల గుండా సాగిన ఈ శోభాయాత్ర భక్తులలో ఆధ్యాత్మిక పండగ వాతావరణాన్ని నింపింది. ఈ ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సాంప్రదాయ కళాబృందాల నృత్యాలు, స్థానిక గిరిజన సంస్కృతిని ప్రతిబింబించే ప్రదర్శనలు తిలకకర్తలను విశేషంగా ఆకట్టుకున్నాయి. డప్పు వాయిద్యాల హోరు, మేళతాళాల గింగురుల మధ్య భక్తులు అమ్మవారి ఘటాలకు ఘనంగా స్వాగతం పలికారు. దారిపొడవునా మహిళలు హారతులు పట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.?అమ్మవారి ఆలయం నుండి ప్రారంభమైన ఈ భారీ ఊరేగింపు ముఖ్య కూడళ్ల గుండా సాగుతూ ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, పెద్ద సంఖ్యలో గిరిజన భక్తులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

ప్రపంచ హైపర్‌టెన్షన్ దినోత్సవం సందర్భంగా..

కలెక్టరేట్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

పిఎం పాలెం, మే 18, ప్రభాతవార్త:

ప్రపంచ హైపర్‌టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా జాయింట్ కలెక్టర్ జీ. విద్యాధరి సమక్షంలో, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో మూడు వైద్య బృందాలు పాల్గొని కలెక్టరేట్ సిబ్బంది, పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమానికి హాజరైన ప్రజలకు రక్తపోటు పరీక్షలు నిర్వహించాయి. ఈ సందర్భంగా వైద్య బృందాలు అధిక రక్తపోటు వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రమం తప్పకుండా బీపీ పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించాయి. ఉప్పు వినియోగాన్ని తగ్గించడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, మానసిక ఒత్తిడిని నియంత్రించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం వంటి సూచనలు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమానికి వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. డా. కె. అప్పారావు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త, డా. బి. హారిక, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్తతో పాటు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన, డిప్యూటీ ఎంపీడివో సత్యనారాయణ

ఎస్.రాయవరం, మే 18, ప్రభాతవార్త

మండలంలోని రామయ్య పట్నం, పెట్టుగొల్లపల్లి, చిన గుమ్ములూరు, దార్ల పూడి గ్రామ పంచాయతీలలో అమలు జరుగుతున్న పారిశుద్ధ్య పనులను సోమవారం డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్య నారాయణ పరిశీలన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థకు సంబంధించిన గ్రామ పంచాయతీలలో అమలు జరుగుతున్న డోర్ టు డోర్ కలెక్షన్ శానిటేషన్ పనులపై ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజల వద్ద నుండి అభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. ప్రతి పంచాయతీలో క్లాప్ మిత్రల ద్వారా తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని, తడి చెత్తను సంపద తయారీ కేంద్రం వద్ద కు తరలించి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని, పొడి చెత్తను స్వచ్ఛ రథం నిర్వాహకులకు అందించడం ద్వారా నిత్యావసర సరుకులు ప్రజలు పొందవచ్చునని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు మండలంలో గల 7 వైన్ షాపుల యజమానులు తప్పనిసరిగా డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసుకోవాలని, అవి నిండిన తర్వాత స్వచ్ఛ రథం నిర్వాహకులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డురోడ్డు ఆర్డీవో ఆఫీసు పిజిఆర్ఎస్‌కు ఏడు దరఖాస్తులు

ఎస్.రాయవరం, మే 18, ప్రభాతవార్త

మండలంలో తిమ్మాపురం లో అడ్డురోడ్డు జంక్షన్ రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో, సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక,రెవిన్యూ క్లినిక్ లో 7 దరఖాస్తులు రావడం జరిగింది. ఎస్ రాయవరం మండలం 3, నక్కపల్లి మండలం 4, వీటిలో రెవిన్యూ డిపార్ట్మెంట్ 5, పోలీస్ శాఖ 1, ఇరిగేషన్ శాఖ 1, దరఖాస్తులు రావడం జరిగిందని, వాటిపై ఆర్డిఓ కార్యాలయం ఏవో నాగరాజు దరఖాస్తులు స్వీకరించారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి బియ్యం అందజేయాలి: తహశీల్దారుకు వైకాపా వినతి

నక్కపల్లి, ప్రభాతవార్త

రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వేట నిషేధిత సందర్భంలో గ్రామస్తులకు మాట ఇచ్చిన ప్రకారం హెటిరో సంస్థ అందరికీ బియ్యం సరఫరా చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ నాయకత్వంలో

జడ్పిటిసి గోసలకాసులమ్మ ఆధ్వర్యంలో సోమ వారం తాసిల్దార్ చిన్ని కృష్ణకి వినతిపత్రం అందజేశారు. ఈ బియ్యం అందక 100 మంది కుటుంబాలు ఇబ్బంది పడుతున్నారని వారందరికీ రేషన్ డిపో ద్వారా బియ్యం పంపిణీ చేయాలని తాసిల్దార్ కోరారు. స్పందించిన తాసిల్దార్ పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. తాసిల్దార్ని కలిసిన వారిలో మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగ ఈశ్వరరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు గొర్ల గోవిందు, వైకాపా నాయకులు పొడగట్ల పాపారావు, కాకర వెంకట్రావు, భార్గవ్, తాతయ్యలు, సూరిబాబు ఉన్నారు.

ఆయిల్, గ్యాస్ సరఫరాపై ఆందోళన వద్దు

నిరంతర పర్యవేక్షణలో ప్రభుత్వ యంత్రాంగం -అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సిఎం రమేష్

అనకాపల్లి మే 18 ప్రభాతవార్త

ఇటీవల అంతర్జాతీయంగా నెలకొన్న ఆసియా- పసిఫిక్ యుద్ధ వాతావరణం, ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్పీజీ (గ్యాస్), డీజిల్, పెట్రోల్ కొరత ఏర్పడుతుందనే వదంతులను నమ్మవద్దని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం జరిగిన దిశా (డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ కో-ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ/జిల్లాస్థాయి అభివృద్ధి సమన్వయ, మానటరింగ్ కమిటీ) సమావేశం అనంతరం మీడియాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ డా.సి ఎం రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నతాధికారులతో నిర్వహించిన దిశ సమీక్షా సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పన మరియు ఇంధన నిల్వలపై సుదీర్ఘంగా చర్చించా మన్నారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 4,35,000 ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయని, వీరికి సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అలాగే, పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా, నల్లబజారుకు తరలకుండా, కృత్రిమ కొరత సృష్టించకుండా కఠిన చర్యలు అధికారులు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ధరలను, సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అన్నారు దేశంలో మరో నెల రోజులకు సరిపడా ఆయిల్ నిల్వలు ముందస్తుగా అందుబాటులో ఉన్నాయని, నిన్ననే గుజరాత్ తీరానికి మరొక గ్యాస్ షిప్ సురక్షితంగా చేరుకుందని స్పష్టం చేశారు. కాబట్టి ప్రజలు భయాందోళనలతో (ఖ్రుఅఊ దీబఎఅఅస్త్ర) ఒకేసారి చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. జిల్లాలో జాతీయ రహదారులు (చీఃఅశీఖ్రీ ఎఅస్త్రష్ఖుఎం), పంచాయతీరాజ్ రోడ్లు, రైల్వే లైన్లు మరియు గ్యాస్ పైప్‌లైన్ పనుల పురోగతిపై చర్చించామని చెప్పారు. జల్‌శక్తి - జలజీవన్ మిషన్ కింద గతంలో జరిగిన కొన్ని పనులలో గందరగోళం నెలకొందని, ఆ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌తో పాటు పిఎమ్‌కెవై, వంటి పథకాలు జిల్లాలో విజయవంతంగా నడుస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో “డబుల్ ఇంజన్” సర్కార్ ఉండటం వల్ల కేంద్రం నుంచి అన్ని రకాల పథకాలకు నిధులు, అనుమతులు సులభంగా మంజూరవుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, మరోవైపు మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అనకాపల్లి జిల్లాకు వస్తున్న కొత్త పరిశ్రమలకు అవసరమైన రోడ్లు, ఇతర మౌలిక వసతులను ఎలా అనుసంధానం చేయాలి, తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు ఏ విధంగా మెరుగుపరచాలనే అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. ఈసమావేశంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కె ఎస్ ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

నక్కపల్లి, ప్రభాతవార్త

నక్కపల్లి జాతీయ రహదారిపై సోమవారం ఉదయం తృటిలో ప్రమాదం తప్పింది. మండలంలోని చిన్న దొడ్డి గళ్ళు గ్రామానికి చెందిన కర్రీ గోవిందు తాటికాయలు ఎక్కడ ఇచ్చేందుకు ఆటోలో ఎలమంచి వెళుతుండగా హెట్టిరో రోడ్డు వద్దకు వచ్చేసరికి ఆటో సైడ్‌కి నిలిపివేసి ఉంచాడు. ఆ సమయంలో అదే రహదారిలో వస్తున్న ఆటో బలంగా ఢీకొట్టడంతో ఆటో తిరగబడింది. ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

వడ్డాది జూనియర్ కళాశాల మెగా అడ్మిషన్ డ్రైవ్.. గ్రామాల్లో అవగాహన ర్యాలీ

బుచ్చయ్యపేట మే 18 ప్రభాతవార్త

వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026--27 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం కళాశాల యాజమాన్యం విస్తృత స్థాయిలో మెగా అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహించింది. కళాశాల ప్రిన్సిపాల్ జి.చిన్నారావు ఆధ్వర్యంలో సిబ్బంది కలిసి విజయరామరాజుపేట, వీరవిల్లి అగ్రహారం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రభుత్వ కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గత విద్యాసంవత్సరంలో కళాశాల సాధించిన ఉత్తమ ఫలితాలను వివరించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 80 శాతం, రెండో సంవత్సరంలో 89 శాతం ఫలితాలు సాధించామని తెలియజేస్తూ, నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, సౌకర్యాలు, భవిష్యత్ అవకాశాల గురించి సమగ్రంగా వివరించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి. చిన్నారావుతో పాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గతుకుల రోడ్డులను సొంత నిధులతో కప్పిన,చెల్లూరి లక్ష్మీ జయరావు

ఎస్.రాయవరం, మే 18, ప్రభాతవార్త

మండలంలో పెద్ద ఉప్పలం గ్రామంలో గతుకుల రోడ్డులో ప్రయాణిస్తున్న గ్రామ ప్రజలు ఇబ్బందులు, గుర్తించి ఆయన మంచి మనసుని చాటుకున్నారు,.ఆయన సొంత నిధులతో 4 గు రోజు శ్రమించి, 85000 వేల రూపాయల ఖర్చు చేసి రోడ్డు గుంతలు పూర్చడం జరిగింది . ప్రతి రోజు నీళ్లతో తడుపుతూ వేసిన గుంతలు పాడవ్వకుండా ఉదయం సాయంత్రం వాటర్‌తో తడుపుతున్నారు, మంచి మనసుతో రోడ్డు గుంతలు పూడ్చినందుకు గ్రామస్తులు ఆయన్ని అభినందించారు.

వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాలో స్వల్ప మార్పులు

నక్కపల్లి, ప్రభాతవార్త

మరమ్మత్తులు కారణంగా 220 కెవి బ్రాండిక్స్ పవర్ ట్రాన్స్ ఫార్మర్ పనులు చేస్తున్న నేపథ్యంలో పది రోజులు వరకు ఎస్ రాయవరం మండలం కొరుప్రోలు 132 కెవి విద్యుత్ సరఫరాకి ఆటంకం కలిగిందని ఆ కారణంగా వ్యవసాయ రంగానికి ఇచ్చే విద్యుత్ సరఫరా లో కొద్దిగా స్వల్ప మార్పులు చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ కారణంగా 132 కెవి పాయకరావుపేట ఎస్ ఎస్ నుండి విద్యుత్ సరఫరా తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. అయినప్పటికీ అది కూడా ఓవర్ లోడ్ వలన ఓల్టేజ్ సమస్య వస్తున్న కారణంగా వ్యవసాయ విద్యుత్తు వినియోగానికి ఇచ్చే వేళలు మార్చడం జరిగిందని, ఆ మేరకు ఉదయం 4:00 నుండి 10:00 ,సాయంత్రం 04 :00 నుండి 07:00 వరకు మార్పు చేయడం జరిగిందని వినియోగదారులు సహకరించాలని ఇంజనీర్ చెల్లి బాబు కోరారు.

సామాన్యుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా కార్యాచరణ ఉండాలి

దిశా సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం : స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అనకాపల్లి, మే 18, ప్రభాతవార్త

జిల్లాలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సామాన్యులు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ప్రోత్సహిస్తూ వారికి కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా ఆర్థిక ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలని, విభిన్న చర్యలు చేపడుతూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు వెళ్లాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వాటి ద్వారా కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించాలని, విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. పథకాల అమలు కొరకు కేంద్రం నుంచి వస్తున్న నిధులను సమృద్ధిగా వినియోగిం చాలని, లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.రాష్ట్ర పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల తీరు తెన్నులు, సమస్యలు, ఎదురవుతున్న సవాళ్లు, అధికారుల సమన్వయం తదితర అంశాలపై కలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం సాయంత్రం జరిగిన దిశా (డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ కో-ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ/జిల్లాస్థాయి అభివృద్ధి సమన్వయ మరియు మానటరింగ్ కమిటీ) సమావేశంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, బండారు సత్యనారాయణమూర్తి, కొణతాల రామకృష్ణ, కె ఎస్ ఎన్ ఎస్ రాజ లతో కలిసి ఎంపీ సీఎం రమేష్ వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ క్రమంలో జిల్లాలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ లభ్యత, వినియోగంతో పాటు 31 విభాగాల పరిధిలో అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, దీన్ దయాల్ అంత్యోదయ యోజన, జల్ జీవన్ మిషన్, నేషనల్ హైవేస్, సోలార్ లైటింగ్, నేషనల్ హైవేస్, అగ్రికల్చర్, టెలికం సేవలు, సోలార్ లైటింగ్ ఏర్పాటు, స్కిల్ డెవలప్మెంట్, ఐసిడిఎస్, ప్రధాన మంత్రి పసల్ భీమా యోజన, ప్రధాన మంత్రి మాతృవంద యోజన, నేషనల్ హెల్త్ మిషన్, పీఎం పోషణ్, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకాల తీరు తెన్నులు, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పలు అంశాల్లో అనుసరించాల్సిన పద్ధతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా అధికారులు చూసుకోవాల న్నారు. మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి పండుగ సందర్భంగా అక్కడ ప్రజలకు గ్యాస్ కొరత లేకుండా చూడాలని డీఎస్ఓను ఆదేశించారు. శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, బండారు సత్యనారాయణ మూర్తి, కొణతాల రామకృష్ణ, కేఎస్ఎన్ఎస్ రాజు, సమీక్షలో భాగంగా వివిధ అంశాలపై వారి అభిప్రాయా లను వెల్లడించారు. ఏపీ గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ళా సురేంద్ర, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ కోట్ని బాలాజీ, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, జిల్లా పరిషత్ సీఈవో సత్యనారాయణమూర్తి, డ్వామా పీడీ, డిఆర్డిఏ పిడి, సిపిఓ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్, పోలీస్, ఇతర విభాగాల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాంబిల్లి మండల టీడీపీ అధ్యక్షులు లాలం భరత్ అధ్యక్షతన పార్టీ సమావేశం..

ఎలమంచిలి,మే 18, ప్రభాతవార్త

రాంబిల్లి మండలం లాలం కోడూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు లాలం భరత్ అధ్యక్షతన సోమ వారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు హాజరయ్యారు ఈ కార్యక్రమంలో ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 27 28 29వ తేదీల్లో నెల్లూరు జిల్లాలో జరగవలసిన మహానాడు ను హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించాలని అన్నారు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ ఈ మహానాడు కార్యక్రమాన్ని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించడానికి నిర్ణయించారన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్రంలో ప్రతి క్లస్టర్ పరిధిలో ఈ కార్యక్రమం వర్చువల్‌గా నిర్వహిస్తున్నామని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ ఈ విషయం గమనించాలన్నారు, కూటమి ప్రభుత్వం హయాంలో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు, ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని విమర్శించాలని ఉద్దేశంతో అనేక ఆరోపణలు చేస్తున్నాయి అన్నారు, ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని, తల్లికి వందనం పేరుతో నేరుగా తల్లులు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరిగిందని, దీనివలన 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం అందిందని, స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచితంగా 63.61 కోట్ల ప్రయాణాలు జరిగాయని, దివ్యంగా శక్తి పథకంలో భాగంగా ఇప్పటికీ 20.51 లక్షల ప్రయాణాలు జరిగాయని, దీపం- 2 పథకంలో ఉచితంగా ఒక్కొక్కరికి మూడు సిలిండర్లు చొప్పున 11 కోట్ల రూపాయలు పెట్టి నాలుగు కోట్ల సిలిండర్లు అందించామని, అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా 46 లక్షల మంది రైతులకు మూడు విడతలుగా మొత్తం 89.85 కోట్లు జమ చేశామన్నారు, ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా ఇప్పటివరకు సామాజిక భద్రత పెన్షన్ కోసం 63 వేల కోట్లు వ్యయం వెచ్చించామని, ఆటో డ్రైవర్ సేవలో ఏడాదికి 15000 చొప్పున 436 కోట్లు జమ చేసామన్నారు, ఇంత అభివృద్ధి కార్యక్రమం చేస్తుంటే కొన్ని పార్టీలు అనవసర రాద్ధాంతం చేసి కూటమి ప్రభుత్వంపై బురద జల్లే కార్యక్రమాలు చెయ్యడమేంటన్నారు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కలిసి పనిచేస్తామని ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో రాంబిల్లి పిఎసిఎస్ చైర్మన్ ఎరిపల్లి చిట్టిబాబు, క్లస్టర్ ఇంచార్జ్ చోడిపల్లి సత్యనారాయణ, సీనియర్ నాయకులు లాలం తాతబాబు, ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గరికిన గోవింద, మాజీ మండల అధ్యక్షులు రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

జనగణన సర్వేన పరిశీలించిన దెందుకూరు

నక్కపల్లి, ప్రభాతవార్త

మండలంలోని ఉపమాక గ్రామంలో ఇంటింటికి జరుగుతున్న జనగణన సర్వేను ఆ గ్రామ ప్రత్యేక అధికారి, ఏవో దెందుకూరు సీతారామరాజు సోమవారం పరిశీలించారు. ఈ మేరకు ఇంటింటికి కార్యదర్శులు చిన్నం నాయుడు ,జయప్రకాష్ లతోపాటు చేస్తున్న సర్వేను ఆయన నేరుగా పరిశీలించారు.

జలధార-జల హారతి కార్యక్రమాన్ని పరిశీలించిన దెందుకూరి

నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త

మండలంలోని నక్కపల్లి కేంద్రంగా రేవుల చెరువు వద్ద జరుగుతున్న జల ధార జల హారతి కార్యక్రమాన్ని ఏవో గ్రామ ప్రత్యేక అధికారి దెందుకూరు సీతారామరాజు సోమవారం ఉదయం పరిశీలించారు. పనులు విషయమే కూలీలతో మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను తెలియజేశారు కూలీలకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను ఏపీవో భాగ్యలక్ష్మి తెలియజేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని సూచించారు. కార్యదర్శి పీవీపీ రాజశేఖర్, చిన్నమనాయుడు తదితరులు ఉన్నారు.

చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించిన ఏవో దెందుకూరి

నక్కపల్లి, ప్రభాతవార్త

నక్కపల్లి పట్టణంలోని ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని ఏవో గ్రామ ప్రత్యేక అధికారి దెందుకూరు సీతారామరాజు సోమవారం ఉదయం పరిశీలించారు. తడి పొడి చెత్తను వేరు చేసే విషయాన్ని తెలుసుకున్న ఏవో, గ్రామంలో ప్రతిఎత్తిన ప్రచారం నిర్వహిం చాలని సంపద కేంద్రానికి చెత్తను సేకరించి తీసుకొచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యదర్శి పివిపి రాజశేఖర్, చిన్నమనాయుడు తదితరులు ఉన్నారు.

మహిళా భద్రతపై అవగాహన సదస్సు

‘శక్తి’ యాప్ వినియోగంపై అవగాహన కల్పించిన సీఐ ధనుంజయరావు

ఎలమంచిలి, మే 18, ప్రభాతవార్త

మండలంలోని షేకిళ్ళపాలెం రూరల్ ఎస్సై ఉపేంద్ర ఆధ్వర్యంలో సీఐ ధనుంజయరావు గ్రామంలో మహిళలు, పిల్లల రక్షణే ధ్యేయంగా ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామస్థులకు వివరించారు. ముఖ్యంగా ఆపద సమయంలో రక్షణ కవచంలా నిలిచే ‘శక్తి’ యాప్ ప్రాధాన్యతను, దానిని మొబైల్ ఫోన్లలో ఏ విధంగా ఉపయోగించాలో ఈ సందర్భంగా వివరించారు. ఈ యాప్ ద్వారా ఆపదలో ఉన్న మహిళలు తక్షణమే పోలీసుల సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ సదస్సులో కేవలం రక్షణ అంశాలే కాకుండా, పిల్లల భద్రత, సామాజిక నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ అధికారులు, ఐ.సి.డి.ఎస్ సిబ్బంది, గ్రామ పెద్దల సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది గ్రామస్థులు పాల్గొన్నారు. మహిళలు, పిల్లల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఏదైనా సమస్య తలెత్తితే వెనుకాడకుండా పోలీసులను ఆశ్రయించాలని సి.ఐ ధనుంజయ రావు గ్రామస్థులకు భరోసా ఇచ్చారు. గ్రామీణ స్థాయిలో ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహించడం వల్ల నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై సావిత్రి, పాల్గొన్నారు.

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ..

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి విస్తృత ప్రచారం

గొలుగొండ మే 18 ప్రభాతవార్త

ప్రైవేటు పాఠ శాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల లు నిర్వహణలో ఆధునిక సౌకర్యాలు పెరిగాయని పిల్లల ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిం చాలంటూ ఎల్ పురం హైస్కూల్ ఉపా ధ్యాయులు విస్తృత ప్రచారం నిర్వహించారు. సోమవారం ఏ ఎల్ పురంలో ఉపాధ్యాయులు, పోలీసులు విద్యార్థులు కలిసి ర్యాలీ చేపట్టి ప్రభుత్వ పాఠశాల ప్రాముఖ్యతను వివరించారు. ఆధునిక వసతులతో పాటు, విద్య, భోజన సౌకర్యం, తల్లికి వందనం అందిస్తూ మెరుగైన విద్యా ఫలితాలు సాధిస్తూ మంచి గుర్తింపు ఇస్తున్నారని అన్నారు. ఈ ఏడాది పదవ తరగతిలో 500 దాటి మార్కులు సాధించిన విద్యార్థులతో ఈ ర్యాలీలో తమ మార్కులను ప్రదర్శించారు.

ఉచిత యునానీ వైద్య శిబిరం

పిఎం పాలెం, మే 18, ప్రభాతవార్త

విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో సోమ వారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఉచిత యునానీ వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. భీమిలి యునానీ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ప్రతిభ రోగులను పరీక్షించారు. 72 మంది రోగులను పరీక్షించారు. ఈ శిబిరాన్ని డిసిహెచ్ఎస్ డాక్టర్ నరేంద్ర సింగ్ సందర్శించారు.

ఆర్టీసీని ప్రైవేటుపరం చేయొద్దు

శ్రీకాకుళం, మే 18 (ప్రభాతవార్త) :
విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ ఆపరేటర్లకు ఇచ్చి ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఏపీ జేఏసీ అమరావతి శ్రీకాకుళం జిల్లా శాఖ చైర్మన్ బి.వి.వి.ఎన్. రాజు తెలియజేశారు. సోమవారం పీజీఆర్ కార్యక్రమంలో ప్రభుత్వానికి ఆర్టీసీ ఉద్యోగులు సమస్యలపై వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి శ్రీకాకుళం జిల్లా ఉమెన్ వింగ్ చైర్పర్సన్ కె.ప్రవల్లిక ప్రియ, ఏపీజేఏసీ అమరావతి జనరల్ సెక్రెటరీ ఎస్.వి.రమణ, శ్రీకాకుళం జిల్లా ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కె.దశరథుడు, జి.త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రధానం

శ్రీకాకుళం, మే 18 (ప్రభాతవార్త) :

శ్రీకాకుళం ఆర్టీసీ ఆధ్వర్యంలో నడపబడుతున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన 25వ బ్యాచ్ అభ్యర్థులకు సర్టిఫికెట్స్‌ను జిల్లా ప్రజా రవాణా అధికారి సి.హెచ్.అప్పలనారాయణ సోమవారం అందచేసి, అభినందనలు తెలిపారు. తదుపరి బ్యాచ్ నందు చేరుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనదని జిల్లా ప్రజా రవాణా అధికారి సి.హెచ్.అప్పలనారాయణ సోమవారం తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్ ఒక సంవత్సరం అనుభవం కలిగి 21 సంవత్సరాలు నిండిన వారు ఈ హెవీ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్‌కు అర్హులు. మొత్తము శిక్షణ 40 రోజుల పాటు పుంటుంది. కావున ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని మనవి. ఫీజు, ఇతర వివరములకు 9390886033 ఫోన్ నంబర్‌ను సంప్రదించగలరు. శ్రీకాకుళం 1వ డిపో మేనేజర్ అమరసింహుడు, శిక్షకుడు వి ఏ వి రావు పాల్గొన్నారు.

గొదలాంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

సంతబొమ్మాళి, మే 18 ప్రభాతవార్త :
మండలంలోని గొదలాం గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఉమా పాలేశ్వర స్వామి మూడవ కళ్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో జిల్లా నలుమూల లల నుంచి 40టీములు తమ పేర్లు నమోదు చేసుకున్నాయి. మొదట రోజు సీతానగరం సున్నాపల్లి జట్ల మధ్య రసవత్తరంగా పోటీ జరిగింది. ఈ పోటీలో సీతానగరం జట్టు విజయం సాధించింది. ఈ టీమ్‌లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా బాలు బహుమతి అందుకున్నారు. ఈ టోర్నమెంట్ శివాలయ యూత్, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

20న మందుల షాపుల బంద్‌కు పిలుపు

సంతకవిటి, మే 18 ప్రభాతవార్త :
ఈ నెల 20వ తేదీన అఖిలభారత కెమిస్ట్ సంఘం సమాఖ్య ఆల్ ఇండియా పిలుపు మేరకు సంతకవిటిలో మెడికల్ షాపులను బందు జరుపుతున్నట్లు విజయనగరం జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి సభ్యులు అక్కరబోతు సత్యనారాయణ సోమవారం విలేకరులకు తెలిపారు. ప్రెస్క్రిప్షన్ వెరిఫికేషన్ చూడకుండా ఆన్లైన్లో మందులు అమ్మడానికి భారీ డిస్కౌంట్ లిస్టు మెడికల్ తీవ్ర నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో బంధుకు పిలుపునిచ్చినట్లు ఆయన వివరించారు. అవసరమైన వారు ముందుగానే అవసరమైన మందులను కొనుక్కొని జాగ్రత్త పడాలని సత్యనారాయణ సూచించారు.

పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి

ఇచ్ఛాపురం, మే 18 ప్రభాతవార్త :
పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైస్సార్సీపీ శ్రేణులు ఇచ్ఛాపురం బస్టాండ్ నుండి ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ వెంకటరావుకు వినతిపత్రం అంద జేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, సోంపేట ఎంపీపీ నిమ్మన దాస, సోంపేట జడ్పీటీసీ యశోదమ్మ, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, ప్రత్తి ఆన్నెప్ప, ఆశి పురుషోత్తం, చిట్టి బాబు, ప్రకాశరావు పట్నాయక్, ఆశి కృష్ణారెడ్డి, ఆశి పురుషోత్తం, నర్తు ప్రేమ్ కుమార్, తడక జోగారావు, పిలక విజయ్, నీలాపు భీష్మ, సాలిన గాంధీ, వల్ల దేవరాజు, పిలక దేవరాజు, కాళ్ళ మదన్, బొంగడ మహేష్, నీలయ్య, వల్లభరావు, బద్రు జగన్, బాకీ లక్ష్మీనారాయణ, దక్కత నూకయ్య, కారంగి త్రినాథ్, వలసయ్య, దుక్క ధనలక్ష్మి, ప్రవీణ్, శ్రీరామ్, సాడి జయరాం తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలలో జ్ఞానభారతి ప్రతిభ

ఇచ్ఛాపురం, మే 18 ప్రభాతవార్త :

ఇటీవలే విడుదలైన సిబిఎస్ఇ 12వ తరగతి ఫలితాలలో జ్ఞానభారతి పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. జాతీయస్థాయిలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్వహించిన పరీక్షల ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించారు. విద్యార్థిని ఉమ్మి హబీబా అక్తరి 500 మార్కులకు గాను 387 మార్కులతో 77.4% సాధించి మొదటి స్థానంలో నిలిచింది. అత్యధికంగా ఇంగ్లీష్ సబ్జెక్టులో 89 మార్కులు సాధించింది. 363 మార్కులతో 72.6% సాధించిన అనసూరి సంతోష్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ విద్యార్థి అత్యధికంగా ఇంగ్లీషులో 95 మార్కులు సాధించాడు. 344 మార్కులతో అనామిక తృతీయ స్థానంలో నిలిచింది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పాఠశాల కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వాహణ అధికారి జోహర్ ఖాన్, ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ సభ్యులు రమణమూర్తి, ప్రిన్సిపాల్ బబి పండా, ప్రధానోపాధ్యాయురాలు సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ ఎమ్.ఖాన్ అభినందించారు.

వీరఘట్టం క్రికెట్ టీంపై శ్రీకాకుళం సిక్కోలు చీటాస్ విజయం

ఆముదాలవలస, మే 18 (ప్రభాతవార్త)
వీరఘట్టం క్రికెట్ టీంపై శ్రీకాకుళం సిక్కోలు సిటాస్ విజయం సాధించింది. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న చిరంజీవి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సెమిఫైనల్ క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా జరిగింది. వీరఘట్టం క్రికెట్ టీం పై శ్రీకాకుళం సిక్కోలు చిటాస్ 3పరుగులు తేడాతో విజయం సాధించింది. వీరఘట్టం క్రికెట్ టీం టాస్ గెలిచి బౌలింగ్ చేయడంతో శ్రీకాకుళం చిక్కోలు చిటాస్ 20 ఓవర్లకు 182 పరుగులు చేసి 9 వికెట్లు కోల్పోయింది. తర్వాత వచ్చిన వీరఘట్టం క్లబ్ సభ్యులు 20 ఓవర్లకు 178 పరుగులు చేయడంతో చిక్కోలు చీటాస్ టీం విజయం సాధించారు. దీంతో చిక్కోలు చీటాస్ టీం గెలిచినట్లు క్రికెట్ నిర్వాహణ కమిటీ సభ్యులు ప్రకటించారు. అంపైర్లుగా కిల్లి సుదర్శనరావు, స్కోరర్‌గా ఈశ్వరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తమ్మినేని విద్యాసాగర్, చిరంజీవి మెమోరియల్ క్రికెట్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. బుధవారం సోంపేట, శ్రీకాకుళం జడ్పీ సిసి జట్ల మధ్య క్రికెట్ పోటీ జరుగుతుందని నిర్వాహకులు తమ్మినేని విద్యాసాగర్ ప్రకటించారు.

బాలింత మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

సీతంపేట, మే 18 ప్రభాతవార్త
పాలకొండలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన గిరిజన బాలింత నిమ్మక మాధురి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం రాగోలు ఆసుపత్రిలో చికిత్సకు ముందు పాలకొండ ఆసుపత్రిలో మాధురి చికిత్స పొందారని రంజిత్ కుమార్ వివరించారు. గతంలో కూడా ఇదే ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన పలువురు మృతి చెందినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయని రంజిత్ కుమార్ వివరించారు మాధురి మృతిపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్వచ్ఛ పాతపట్నమే తమ లక్ష్యం

పాతపట్నం, మే 18 ప్రభాతవార్త :

పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసే ఆధునిక మిషనరిని సోమవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మిషనరీ పనితీరును ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గాన్ని పరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చడమే కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలిపారు. పర్యావరణానికి ఎంతో ముప్పుగా మారిన ప్లాస్టిక్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించేందుకు ఆధునిక మిషనరీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ యంత్రం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను సులభంగా వేరు చేసి, రీసైక్లింగ్‌కు పంపడం ద్వారా కాలుష్యాన్ని అదుపు చేయవచ్చని తెలిపారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరుచుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, పారిశుధ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై అధికారులను నిలదీసిన ఎంపీపీ

-మండల సమావేశంలో ఏఈ పై ప్రశ్నలు వర్షం

సంతబొమ్మాళి, మే 18 ప్రభాతవార్త :
ఉమిలాడ గ్రామంలో రక్షిత మంచినీటి పైప్ లైన్ పాడైందని నాలుగు నెలల క్రితం నుంచి చెబుతున్నాం. ఇంతవరకు మీరు ఏమి చేసారు? ఆ సమస్య నెరవేరలేదని ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అప్పారావు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మహేష్‌ను నిలదీశారు.

స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశమందిరంలో ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అప్పారావు అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా ఆర్డబ్ల్యూఎస్ శాఖపై చర్చ జరుగుతుండగా ఉమిలాడ సంగం వీధిలో రోడ్డు పనులు సమయంలో సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల రక్షిత మంచినీటి పథకం పైపులైను పాడై తాగునీరు కొళాయిలకు సరఫరా కాక వృధాగా పోతుందని ఈ సమస్య గత సమావేశం ముందు మీ దృష్టికి తీసుకువచ్చిన ఇప్పటికి ఆ సమస్యకు పరిష్కారం చూపలేదని ఇది మీ పనితీరుకు నిదర్శనంగా కనిపిస్తుందని ఎంపీపీ ప్రశ్నిచారు. పైప్ లైన్ మరమ్మతు కోసం మండల పరిషత్ నిధులు ఇస్తామన్నా మీరు ఎందుకు తస్సారం చేస్తున్నారని నిలదీశారు. ప్రస్తుతం నీటి ఎద్దడి ఎక్కువగా గ్రామంలో ఉందని ఎప్పటికైనా మీరు ఆ సమస్యలను పరిష్కారం చూపకపోతే ఖాళీ బిందెలతో జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఎంపీపీ హెచ్చరించారు. ఈ సమావేశంలో వచ్చిన సమస్యలు వచ్చే సమస్య సమావేశంలోపల పరిష్కారం చూపకపోతే ఇలాంటి సమావేశంలో జరుపుకోవడం ఎందుకు దండగ అని మేఘవరం ఎంపీటీసీ సభ్యులు సూరాడ రాజారావు అన్నారు. ప్రస్తుతం తీరప్రాంత గ్రామాలలో నీటి ఏద్దడి ఎక్కువగా ఉందని మురువాడ, గద్దలపాడులలో గ్రామ దేవత పండుగలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా తాగునీరు ట్యాంకర్‌లతో సరఫరా చేయాలని ఏఈ కోరారు. నౌపడ పంచాయతీ సీతానగరం గ్రామంలో కొన్నేళ్లుగా నీరు సరఫరా కావడం లేదు. ఈ విషయం పలుమార్లు మీ అధికారులు దృష్టిలో పెట్టిన ఫలితం లేకపోయింది. కనీసం హ్యాండ్ బోరు వేసయినా నీటి ఏద్దది లేకుండా చూడాలని ఎంపీటీసీ బత్సల సుధా సమావేశంలో కోరారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణ కోసం మీరు ఏమైనా ప్రణాళికలు చేశారా అంటూ చింతాడ చిన్నారావు ఏఈ ని ప్రశ్నిచారు. అనంతరం రెండేళ్ల నుంచి అందని గౌరవ వేతనంపై ఎంపీడీఓ జయంతి ప్రసాద్‌ను సభ్యులు ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీఓ ఇటీవల జడ్పీ నుంచి వివరాలు అడిగారని పంపించాము త్వరలో నిధులు విడుదలవుతాయని ఆయన తెలిపారు. దీనిపై జడ్పిటిసి పాలవసంత రెడ్డి ఇటీవల జడ్పీ సమావేశంలో దీనిపై చర్చ జరిగిందని సత్వరమే సభ్యుల గౌరవ వేతనం విడుదలకు చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు. మీరు మరొకసారి జెడ్పీలో మాట్లాడాలని ఎంపీడీవోకు ఆయన సూచించారు. అనంతరం విద్యుత్, రెవిన్యూ, వైద్య ఆరోగ్య, వెటర్నరీ, మత్యాశాఖలపై సాధారణ చర్చ జరిగింది. ఈ సమావేశం ఉదయం 10గంటలకు జరగాల్సి ఉండగా కోరం సభ్యులు హాజరు లేక గంట ఆలస్యం జరిగింది. ఈ సమావేశానికి ఆర్ అండ్ బి, నీటిపారుదల శాఖ అధికారులు డుమ్మా కొట్టారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ పాల వసంత రెడ్డి. ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ ఎం ఈఓ అర్జునుడు, అధికారులు సభ్యులు పాల్గొన్నారు.

జనగణన వేగవంతం చేయాలి

ఇచ్ఛాపురం, మే 18 ప్రభాతవార్త :

మండలంలో జనగణన వేగవంతం చేయాలని తహసీల్దార్ వెంకటరావు ఆదేశించారు. ఎంపిడిఓ ప్రభాకరరావుతో కలిసి ఈదుపురం, తులసిగాం ధర్మాపురం గ్రామాలను సందర్శించి తక్కువ ప్రగతి ఉన్న ఎన్యుమరేటర్‌లను సర్వే వేగవంతం చెయ్యమని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు ప్రకారం ఈ నెల 20 లోగా పూర్తి చెయ్యమని ఆదేశించారు. నేటి వరకు 70శాతం మాత్రమే పూర్తయ్యిందని మిగిలిన 30 శాతం కూడా ఈ రెండు రోజుల్లో తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎవరు కూడా అలసత్వం వహించారాదని హెచ్చరికలు జారి చేశారు.

బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన

ఆమదాలవలస, మే 18, (ప్రభాతవార్త)

నియోజకవర్గంలో పొందూరు మండలం తండ్యం గ్రామానికి చెందిన బాధ లోకేష్ కుటుంబానికి ఒక లక్ష 55 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే కూన రవికుమార్ తన నివాసంలో పంపిణీ చేశారు. వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి అందించాలని పలువురు ఎమ్మెల్యే రవికుమార్‌కు విన్నవించుకున్నారు. వారి విన్నపాన్ని ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కార్యాలయానికి అందించారు. ఈ దరఖాస్తులు పరిశీలించిన ముఖ్యమంత్రి కార్యాలయం సహాయనిధి మంజూరు చేశారు. సీఎం సహాయనిధి చెక్కులను వైద్య చికిత్స నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని అన్నారు. సీఎంఆర్ఎఫ్ సహాయం అందడంతో లోకేష్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రవికుమార్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల వాటాకు త్వరలో నిధులు : ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, మే 18 ప్రభాతవార్త
పలాస నియోజకవర్గ పరిధిలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు వారి వాటా మొత్తాన్ని త్వరలోనే అందిస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ, గత ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వడం కంటే రంగులు వేయడానికే ప్రాధాన్యత ఇచ్చింది. పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే ఆలోచన వారికి లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసి, లబ్ధిదారులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందవద్దు. మీ అమౌంట్ త్వరలోనే మీ చేతికి అందుతుంది" అని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసిందని, బకాయిలు క్లియర్ చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. పేదల సంక్షేమమే తమ కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కవిటి వాసి మృతి

కంచిలి, మే 18 ప్రభాతవార్త :
మండల పరిధిలోని ఆదివారం సంత జాతీయ రహదారి వద్ద సోమవారం మధ్యా హ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలం పాత శిలగాం గ్రామానికి చెందిన పోకల రాము (55) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు స్థానికులు, కంచిలి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన మనవరాలి వైద్య పరీక్షల కోసం ద్విచక్ర వాహనంపై సోంపేట వెళ్లిన రాము, తిరిగి స్వగ్రామం వెళ్లే క్రమంలో మకరాంపురం జంక్షన్ వద్ద ఆగాడు. అక్కడ మంచినీళ్లు తాగిన అనంతరం, మకరాంపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న జార్ఖండ్‌కి చెందిన కారు వేగంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో రాముకి చెందిన ద్విచక్ర వాహనం కారు మధ్యలో ఇరుక్కొని సుమారు 500 మీటర్ల వరకు ఈడ్చుకు వెళ్ళి పోయింది. దీంతో రాము తలకి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు గ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య రాజేశ్వరితో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. జరిగిన సంఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పారినాయుడు తెలిపారు.

శ్రీనీలమణి దుర్గా అమ్మవారి హుండీ ఆదాయం రూ.7.98 లక్షలు

పాతపట్నం, మే 18 ప్రభాతవార్త :

పాతపట్నంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి దేవస్థానంలోని హుండీలను సోమవారం దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. గత 53 రోజులకు గాను అమ్మవారికి 7,98,629 రూపాయలు ఆదాయం లభించినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మందస గ్రూపు దేవాలయాల కార్య నిర్వహణాధికారి ఎస్.నాగేశ్వరరావు, నీలమణి దుర్గా ఆలయ కార్యనిర్వహణాధికారి టి.వాసుదేవరావు ఈ లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులతో పాటు ధర్మకర్తల మండలి చైర్మన్ అక్కంధ్ర సన్యాసిరావు, కమిటీ సభ్యులు ఉమా శంకర్ మిశ్రో, కె రమాదేవి, ధర్మకర్త ప్రతినిధి ఎస్.బుల్లిబాబు, దాసరి వెంకటరమణ, బి.గోపాలరావు, భక్తులు, శ్రీ వేంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త

ప్రత్యేక కిట్టుతో... గంజాయి మత్తుకి చెక్

వీరఘట్టం, మే 17 ప్రభాతవార్త :
జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక కిట్టుతో గంజాయి మత్తుకు చెక్ పెడుతున్నారు వీరఘట్టం పోలీసులు. ఇందులో భాగంగా సోమవారం పలు తనిఖీలను ఎస్సై ఎస్.షణ్ముఖరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇటీవల గంజాయి వినియోగిస్తున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో వారిని నియంత్రించాలనే ఉద్దేశంతో ఒక ప్రత్యేక తనిఖీని చేపట్టారు. గంజాయి తాగుతున్న వారిని గుర్తించడం కోసం టి.హెచ్.సి.కిట్‌ను ఉపయోగించి, వారు గంజాయి సేవించారా లేదా అనే విషయాన్ని ఈ కిట్టు ద్వారా నిర్ధారించవచ్చు. ఇందులో భాగంగా సోమవారం కొంతమంది అనుమానిత వ్యక్తులను ఈ కిట్ సహాయంతో ఎస్సై బృందం పరీక్షించారు. ఈ సందర్భంగా యువత గంజాయికి బానిసలై తప్పుడు మార్గాల్లో వెళ్తూ తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, యువత అంతా గంజాయి మరియు ఇతర మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కోరుతూ ప్రతి గ్రామంలోనూ అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఎవరైనా యువకులు గంజాయికి అలవాటు పడినట్లు గమనిస్తే, వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని ఎస్సై షణ్ముఖరావు కోరారు.

21న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సీతంపేట, మే 18 ప్రభాతవార్త
పాలకొండ డివిజన్ పరిధిలోని సీతంపేట ఎలక్ట్రికల్ సెక్షన్ కార్యాలయంలో మే 21న ఉదయం 10 గంటల నుండి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వేదికను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీఈపీడీసీఎల్ పార్వతీపురం మన్యం జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ కె.మల్లిఖార్జునరావు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. పరిష్కరించే విద్యుత్ సమస్యలు తప్పుగా బిల్లింగ్ చేయడం బిల్లుల్లో తప్పులు, కాలిపోయిన విద్యుత్ మీటర్ల మార్పిడి, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, లోవోల్టేజ్ హైవోల్టేజ్ సమస్యలు, సర్వీసుల్లో లోపాలు, ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలు చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు సమస్యలపై ప్రత్యేక వేదికలో ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. వీటితోపాటు ఇతర ఏవైనా విద్యుత్ సంబంధిత ఇబ్బందులు ఉంటే, వాటిని ఈ వినియోగదారుల పరిష్కార వేదిక దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన పరిష్కరించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించండి

పాతపట్నం, మే 18 ప్రభాతవార్త :

పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని బాలాజీ నగర్3 (మార్కెట్ యార్డ్ వెనుక భాగంలో) ఉన్న హుడా సుడా (జగనన్న కాలనీ) నివాసితులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ పాతపట్నం మండల వైకాపా అధ్యక్షులు, వైస్ ఎంపిపి సవిరిగాన ప్రదీప్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల క్రితం ఈ కాలనీ మంజూరైనప్పటికీ, నేటికీ అక్కడ సరైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ మరియు ఇతర మౌలిక వసతులు లేవని పేర్కొన్నారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈ విన్నపాన్ని సానుకూలంగా పరిశీలించాలని ఆయన కోరారు. సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి, త్వరితగతిన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ప్రదీప్ విజ్ఞప్తి చేశారు. విన్నపంతో పాటు కాలనీలోని ప్రస్తుత పరిస్థితిని వివరించే ఫోటోలను కూడా జతచేసి వినతిపత్రాన్ని సమర్పించారు.

సామాజిక అంశాలపై అవగాహన కల్పించిన పోలీస్

వీరఘట్టం, మే 17 ప్రభాతవార్త
సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే ధ్యేయంగా పోలీస్ శాఖ కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని బొడ్లపాడు గ్రామంలో ఎస్ఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు అందరూ తప్పనిసరిగా రహదారి నిబంధనలను పాటించి తీరాలన్నారు. మితిమీరిన వేగం, అజాగ్రత్త వల్ల జరిగే ప్రమాదాల గురించి ప్రజలను అప్రమత్తం చేశారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అది ప్రాణ రక్షణ కవచమని ఎస్సై ప్రజలకు వివరించారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల గురించి అవగాహనతోపాటు, అపరిచిత వ్యక్తులకు ఓటిపి లు చెప్పకూడదని, నకిలీ లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వారికి తెలియజేసారు. యువత వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని, గ్రామంలో ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా లేదా వాడినా వెంటనే సమాచారం అందించాలని ఎస్ఎస్ షణ్ముఖరావు కోరారు.

గ్రంథాలయంలో ఉత్సాహంగా వేసవి శిక్షణ

పాతపట్నం, మే 18 ప్రభాతవార్త :

స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం సోమవారం అత్యంత ఉత్సాహంగా కొనసాగింది. గ్రంథాలయ అధికారిణి డి.సాయమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈరోజు శిక్షణలో భాగంగా విద్యార్థులతో అల్లావుద్దీన్ అద్భుత దీపం, ఆలీబాబా 40 దొంగలు వంటి సాహస గాథలతో పాటు, జీవన విలువలను నేర్పే పంచతంత్రం కథలను చదివించారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థులలో ఊహాశక్తిని, నైతిక విలువలను పెంపొందించవచ్చని ఈ సందర్భంగా సాయమ్మ పేర్కొన్నారు. చదువుతో పాటు శారీరక ఉల్లాసం కోసం విద్యార్థులచే కోలాటం ఆడించారు. మన సాంప్రదాయ కళలను ప్రతిబింబించేలా విద్యార్థులు లయబద్ధంగా చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. వేసవి సెలవులను ఇలా జ్ఞానంతో పాటు వినోదంతో గడపడం పట్ల విద్యార్థులు మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి సిద్ధమైన కూరగాయల్ని వినియోగించండి

కోటబొమ్మాళి, మే 18 ప్రభాతవార్త :
అంతు చిక్కని వ్యాధులు ప్రబలుతున్న ఈ రోజుల్లో రసాయనిక ఎరువులతో పండించిన పంటలు విడనాడి ప్రకృతి సిద్ధంగా పండే పంటలను వినియోగించాలని ప్రకృతి వ్యవసాయం మోడల్ మేకర్ వంక సింహాచలం అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను స్టాల్ పెట్టి వినియోగదారులకు అమ్మకాలు నిర్వహించారు. ఈ స్టాల్ నందు విక్రయించే కాయగూరలు ఆకుకూరలు గోఆదారిత ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించినటు వంటివి, ఆరోగ్యాభిలాషులందరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. రానున్న రోజుల్లో వ్యతిరేకి రసాయనిక ఎరువులు విడనాడి గోదారిత వ్యవసాయాన్ని చేయడం ద్వారా ప్రజా ఆరోగ్యాన్ని సారక్షించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైసీపీ భారీ నిరసన

పలాస, మే 18 ప్రభాతవార్త :

పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పలాసలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. కాశీబుగ్గలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు పాల్గొన్నారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల కారణంగా పెట్రోల్, డీజిల్ ధరలు నిరంతరం పెరుగుతున్నాయని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డా.సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ, పెరిగిన ఇంధన ధరలతో సామాన్యులు, రైతులు, కార్మికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజలపై అదనపు భారం మోపే విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

19-5Pg9th cheli.qxd:19-5Pg9th cheli.qxd 1/1/02 6:29 AM Page 1

వేడిమిని తట్టుకుందామిలా!

పెరుగుతున్న వేడి మనల్ని ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంది కదూ ! దీనికి ఉక్కబోతకి చర్మం జిక్కడం, దద్దుర్లు, దురద సహా ఇంకెన్ని సమస్యలో! పోగొట్టుకోవడానికి మార్కెట్‌లో బోలెడు ఉత్పత్తులు. కానీ ఖర్చేమో ఎక్కువ. దాన్ని తగ్గిస్తూ సహజ మార్గాలను ప్రయత్నిద్దాం. పనిమీద అలా బయటికి వెళ్లొచ్చామంటే చాలు. ముఖం ఎర్రగా కమిలిపోతుంది. కొందరిలో కాసేపటికి తగ్గుతుంది. కానీ చాలామందిలో దద్దుర్లు, చర్మమంతా నల్లగా మారడం లాంటివి కనిపిస్తాయి. తప్పించుకోవాలంటే ఇంటికి రాగానే ముఖాన్ని శుభ్రం చేసుకొన్నాక కలబంద గుజ్జును రాసి చూడండి. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టేస్తాయి. గ్రీన్ టీని చల్లార్చి దూదితో రాసి, ఆరాక కడిగినా మంచిదే. ఇంట్లో ఉన్నా ఉక్కబోత తక్కువా? అదేమో చెమట కాయలు, దురదలకు దారితీస్తుంది. సాధారణంగా పౌడర్ చల్లుతుంటాం కదా? బదులుగా ఓట్‌మీల్‌ని ప్రయత్నించండి. దీన్ని మెత్తగా పౌడర్‌లా చేసుకుని, బకెట్ గోరువెచ్చని నీటిలో రెండు పెద్ద చెంచాలు కలపాలి. పావుగంట అలా వదిలేసి, ఆ నీటితో స్నానం చేయండి. ఇలా తరచూ చేస్తే సరి. చర్మానికీ పోషణ అందుతుంది. సమస్యా అదుపులోకివస్తుంది. చెమటకి జిడ్డుగా అనిపిస్తుందని మాయిశ్చరైజర్‌ని రాయడానికి సందేహించేవారే ఎక్కువ. దీంతో చర్మం నిర్జీవంగా, కళావిహీనంగా తయారవుతుంది. రాత్రుల్లు స్నానం చేశాకగానీ, ఉదయం స్నానానికి ముందుగానీ కొబ్బరి నూనెను ఒళ్లంతా పట్టించండి. నలుగుకు ముందులా కాకుండా రెండు మూడు చుక్కలు వేసు కుంటూ మృదువుగా రాసుకుంటూ వెళితే చాలు. దీనిలో సమృద్ధిగా ఉండే ఫ్యాటీయాసిడ్లు కావాల్సిన తేమను అందిసూనతనే చర్మం అందంగా, ఆరోగ్యంగా ఉండేలానూ చూస్తాయి. అదీ జిడ్డే అనిపిస్తే పుచ్చకాయ రసాన్ని రాసుకొని, ఆరాక కడిగినా చాలు. చిన్నవే కానీ.. చర్మసంరక్షణలో చూపే ప్రయోజనమెంతో. ఈ చిట్కాలతో వేసవి నుంచి చర్మాన్ని కాపాడుకుందాం.

'లగోరీ' ఆడదామా !

రెండు జట్లు.. ఏడు రాళ్లు లేదా పెంకులు.. ఒక టెన్నిస్ బంతి. ఆ రాళ్లను ఒకదానిపై ఒకటి టవర్‌లా పేర్చి ఒక జట్టు దాన్ని పడగొట్టి మళ్లీ కడుతూ ఉంటే ప్రత్యర్థి జట్టు ఈ రాళ్లను చెదర గొడుతూ ఉండాలి. ఆడటానికి ఓపిక ఉండాలే గానీ వయసుతో సంబంధం లేదు. ఆడేవాళ్లంతా చురుకుగా అలర్ట్‌గా ఉంటూ ఆ రాళ్లను పేరుస్తూ ఉంటే వేరే వాళ్లు చెదర గొడుతూ ఉంటారు. దీన్నే లగోరీ అనీ, ఏడు రాళ్లాట అనీ పిలు స్తారు. సరదాగా ఆరుబయట ఆడే ఈ లగోరీకి దేశ విదేశాల్లో కూడా మంచి క్రేజ్ ఉందని తెలుసా! అంతేనా.దీనికి జాతీయ స్థాయిలో ఛాంపియన్స్ ఉన్నారు. అంతర్జాతీయ స్థాయిలో టోర్నమెంట్లు జరుగుతాయి. దీనికి ప్రపంచ కప్ కూడా ఉంది. చాలా చోట్ల ఈ ఏడురాళ్లాటని విద్యాసంస్థల్లో కూడా భాగం చేశారట. ఇంత చరిత్ర ఉన్నఈ లగోరీ ద్వాపర యుగం నుంచే ఉందట. శ్రీకృష్ణుడు తన స్నేహితులతో ఎక్కువగా ఈ ఏడు పెంకులాటే ఆడేవాడట. దాన్ని రిఫరెన్స్‌గా తీసు కునే ఈ లగోరీని రూపొందించారట. గోవాలో జాతీయ క్రీడలకి ఒక ఆటని ఎంపిక చేయాల్సి వచ్చినప్పుడు అక్కడి క్రీడల మంత్రి ఈ లగోరీని ఎంపిక చేశాడట. ఆ తర్వాత దీన్ని గురించి ప్రధానమంత్రి మోదీ కూడా మన్‌కీబాత్‌లో ప్రస్తావించి తన చిన్ననాటి రోజులను గుర్తుచేసుకున్నారు. ఇంతటి చరిత్ర గల ఈ ఏడు రాళ్లాట మన భారత సంతతికి చెందినది. తలుచుకుంటేనే ఎంతో గర్వంగా అనిపిస్తుంది కదూ.. ఇంకెందుకు ఆలస్యం.. ఈ లగోరీని పిల్లలకి నేర్పించండి. ఈ వేసవి సాయంత్రాల్లో మీరూ వాళ్లతో కలిసి ఆడేసేయండి.

నచ్చింది తిందాం ..

బరువు పెరిగిపోతామే మోనని నచ్చినవి తినడం మానేస్తుంటాం కొందరు. డైటింగ్ పేరుతోనోరు కట్టే సుకుంటారు మరి కొందరు. లావైతే శరీరాన్ని అసహ్యించు కునే వారూ లేకపోలేదు. ఇవన్నీ ఆరోగ్యాన్నే కాదు.. మనసునూ దెబ్బతీస్తాయి. కోరి కోరి ఈ సమస్యల్ని కొనితెచ్చుకోవడం కంటే నిచ్చనవి తింటూ, ఎలా ఉన్నా శరీరాన్ని అంగీకరిస్తే అంతకంటే ఆరోగ్యం ఇంకే ముంటుంది? ఇదే పాజిటివిటీని చాటి చెబుతోంది. సరైన ఆహార నియమాలు పాటించేలా అందరిలో అవగాహన కల్పించడం వ్యక్తిగత అవసరాల రీత్యా ప్రత్యేకమైన ఆహార నియమాలు పాటించేవారు. ఈ రోజు మాత్రం ఇవన్నీ పక్కన పెట్టి నచ్చిన ఆహారం తీసుకునేలా ప్రోత్సహించడం. విభిన్న శరీరతత్వాలు, శరీరాకృతుల్ని ప్రోత్సహిస్తూ.. స్వీయ ప్రేమను పెంచుకునేలా వెన్నుతట్టడం. బాడీ షేమింగ్, ఫ్యాట్ షేమింగ్..వంటి వివక్షను అంతమొందించేలా చర్యలు తీసుకోవడం. వేగంగా బరువు తగ్గేందుకు ఉపయోగపడే క్రాష్ డైట్లతో తలెత్తే సమస్యలపై అవగాహన పెంచడం. వివిధ రకాల ఈటింగ్‌న డిజార్డర్లతో బాధపడుతోన్న వారిని చేరదీసి.. ఆయా సమస్యల నుంచి బయటపడేసేందుకు వారికి సహకరించడం. కార్యాలయాల్లో / పని ప్రదేశాల్లో.. సహోద్యోగుల్ని బాడీ షేమింగ్ చేయకుండా.. వాళ్లలో ఉన్న ప్రత్యేకమైన నైపుణ్యాల్ని, వాళ్లు సాధించే విజయాల్ని ప్రశంసించడం..

స్వీయ ప్రేమను పెంపొందించు కోవాలంటే నియమాలు..

.కొవ్వులు, క్యాలరీలు సంగతి పక్కన పెట్టి.. మనసుకు నచ్చిన ఆహారం తీసుకోవాలి. తద్వారా మనసు, జిహ్వ. రెండూ తృప్తి పడతాయి. బరువు తూచుకోవడాలు, నడుం కొలుచుకోవడాలు, తమను తాము విమర్శించుకోవడం.. వంటివన్నీ పక్కన పెట్టి మిమ్మల్ని మీరు నిజాయితీగా స్వీకరించండి. ఆ క్షణం మనసు ఎంతసంతోష పడుతుందో స్వయంగా ఆస్వాదించచ్చు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రత్యేకత దాగుంటుంది. దాన్ని వెలికి తీయండి. మీకు మీరు కొత్తగా కనిపిస్తారు. పాజిటివిటీ తో అడుగు ముందుకు వేయగలుగుతారు. వంట రాని వారు కూడా నచ్చిన రెసిపీ తయారు చేసుకోవడానికి ఆసక్తి చూపు తారు. ఈ రోజున మీరూ అలాంటి ప్రయత్నమే చేయచ్చు. ఇది మీకు కొత్త అనుభూతిని అందించడమే కాదు. మీలో ఉన్న పాక శాస్త్ర నైపుణ్యాలూ మీకు అవగతమవు తాయి. అయినా వంటను మించిన థెరపీ మరేముంది చెపనపండి? ★

సెల్ఫ్‌కేర్ అవసరం..

ముస్తాబు పూర్తయ్యాక అద్దంలో చూసుకుంటే 'అరె భలే అందంగా ఉన్నానే' అని ఎప్పుడైనా అనిపించిందా? క్షణం తెలియకుండానే ముఖంలో చిరునవ్వు విరియడమే కాదు, ఒత్తిడి స్థాయీ తగ్గుతుందట. మనపై మనం చూపించే ప్రేమ మహత్తే అది. కొనసాగాలా.. సెల్ఫ్‌కేర్ అవసరం.. ఎవ్రీథింగ్ షవర్'ని ప్రయత్నించండి. ఇప్పుడిదో ట్రెండ్ కూడా! అసలేమిటిది అంటే.. సాధారణంగా వేడుకలు, పండగలు ఉన్నప్పుడు ఆడవాళ్లు స్వీయశ్రద్ధ పెట్టడం మామూలే మిగతారోజుల్లో సమయం లేదని తాము పట్టించుకోరు. దాంతో శారీరకంగానే కాదు, మానసికంగానూ సమస్యలు కొనితెచ్చుకంటారు. వారికి సెల్ఫ్‌కేర్‌ని అలవాటు చేసే క్రమంలో రూపుదిద్దు కుందే.. ఈ ఎవ్రీథింగ్ షవర్! దీనికిగానూ.. వారంలో ఒకరోజు కేటాయించాలి ఆరోజు.. గబగబా స్నానం ముగించే ద్దామన్న తొందరొద్దు. స్నానాల గదిలో సెంటెడ్ క్యాండిల్స్ లేదా నచ్చిన పరిమళాన్ని చల్లుకోవాలి. ఈ సువాసనలు మనసును తేలికపరుస్తాయి. ఆపై మరీ చల్లగా, వేడిగా కాకుండా గోరువెచ్చని నీటిని సిద్ధం చేసుకోండి. దానిలో ఎసెన్షియల్ అయిల్ లేదా బాతింగ్ సాల్ట్ వేసుకోండి. ఇప్పుడు నచ్చిన బాడీవాష్ లేదా సబ్బుతో నింపాదిగా స్నానం చేయండి. శరీరానికి తాజాదనం అందడమే కాదు, మనసులోని ప్రతికూల భావనలూ తొలగిపోతాయి అంటున్నారు నిపుణులు. ఇప్పుడు బాడీస్క్రబ్ కాదంటే సున్నిపిండి లేదా బియ్యప్పిండితో శరీరమంతా మృదువుగా రుద్దేయండి. మృతకణాలుంటే తొలగి, మృదువైన చర్మం సొంతమవుతుంది. మందమైన చర్మముండే మోకాళ్లు, మోచేతులు, పాదాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి మరి. అవాంచిత రోమాలను తొలగించుకోవాల్సింది కూడా ఇప్పుడే.

ఇక కురులు.. ఎప్పటిలా ఆదరాబాదరాగా కాకుండా మృదువుగా మసాజ్ చేస్తూ షాంపూను పట్టించాలి. వలయాకారంలో తలంతా రుద్దడం అయ్యాక నీటితో కడిగేయాలి. ఎంత విశ్రాంతిగా అనిపిస్తుందో? అయితే కండిషనర్ పెట్టడం మాత్రం మర్చిపోవద్దు. చివర్లో ఓ మగ్గు చల్లటి నీళ్ల తలమీదుగా పోసుకోండి హాయితోపాటు కుదుళ్లకీ మేలు చేకూరుతుంది. ఇక చివరగా.. తడి లేకుండా తుడచి, మాయిశ్చరైజర్ లేదా బాడీ ఆయిల్ రాయాలి. తేమ అందడమే కాదు, మేనికి మెరుపూ వస్తుంది. ఈ మొత్తం ప్రక్రియకు మహా అయితే 20-30 నిమిషాలు పడుతుంది. కానీ.. శరీరమూ, మనసూ తేలికపడతాయి. అందుకే ఇది ట్రెండ్‌గా మారి యువతను ఆకర్షిస్తోంది మీరూ ప్రయత్నించి చూడండి మరి. ▫

తోతాపురి మామిడి పచ్చడి

కావాల్సి నవి : తోతాపురి పచ్చి మామిడికాయ- ఒకటి, అల్లం-చిన్నముక్క, పచ్చిమిర్చి-నాలుగు, నువ్వులు-రెండు టేబుల్‌స్పూన్లు, ఉప్పు-తగినంత, తాలింపు కోసం, జీలకర్ర, ఆవాలు-అర టీస్పూన్ చొప్పున, ఎండుమిర్చి- ఒకటి.

తయారీ : మామిడికాయ చెక్కు తీసి చిన్న ముక్కలుగా కోసుకుని పక్కన పెట్టుకోవాలి. అల్లం ముక్కను శుభ్రంగా కడిగి తురమాలి. కడాయిలో నూనె వేడిచేసి పచ్చిమిర్చి, అల్లం తురుము వేసి వేయించాలి. తర్వాత మామిడిముక్కలు, ఉప్పు వేసి మరికాసేపు వేయించాలి. మామిడి ముక్కలు మెత్తగా అయ్యేంత వరకు ఉడికించి చల్లార్చాలి. నువ్వులను నూనెలేకుండా వేయించి పక్కన పెట్టు కోవాలి. ఇప్పుడు ఉడికించిన మామిడిముక్కలు, అల్లం తురుములో నువ్వులు వేసి మిక్సీ జార్‌లో మెత్తగా పేస్టు చేయాలి. కడాయిలో నూనె వేడిచేసి ఆవాలు, జీలకర్ర ఎండుమిర్చి వేసి తాలింపు పెట్టాలి. ఇది అన్నంలోకే కాకుండా చపాతీల్లోకి బాగుంటుంది. ▫

దేవుడికి అంతా తెలుసు

పిల్లాడు ఒక పదునైన కత్తి చేతిలో పెట్టుకుని కనిపించాడు అది మెరుస్తోంది. అందుకే కావాలి. తండ్రి చూశాడు. ఇంకా ఏమైనా వుందా? నాక్‌గా ఆకత్తిని చిన్నోడి చేతి నుండి తీసేసుకున్నాడు. ఆ పిల్లడు ఏడుపు ప్రారంభించాడు. తన తండ్రి దుర్మార్గుడనీ తన ఆటను పాడుచేశాడనీ తిట్టుకుంటాడు. కానీ ఆ తండ్రికి తెల్సు, ఆకత్తినితన కొడుకుని గాయపరుస్తుందని . అలాగే దేవుడు కూడా అంతే మనకు మంచి వారుగా కనిపించే మనుషుల్లో విషం మారి మనస్సు ల్లో నిండి వుండ వచ్చును ఆ విషం మనకు తెలియకుండానే ఎంతో అపకారం చేస్తుందని ఆ దైవానికి మాత్రమే తెల్సు వారంటే మనకు ఎంతో ప్రాణం. ఇష్టం అయినా భగవాన్ మనకు దూరం చేస్తాడు. మనకు ఇష్టం లేకపోయినా దూరంగావిస్తాడు. నీ చేతిలో వున్న మట్టి పాత్రను దేవుడు నేలకేసి కొట్టాడనే అనుకోండి. అంటే నిన్ను ఏ పాత్రాలేకుండా ఉంచాలని ఆయన ఉద్దేశ్యం కాదు సుమా! నీకు ఒక బంగారు పాత్ర ఇవ్వబోతున్నాడన్నమాట.మనకు ఇష్టమైనవిపోగానే మనం ఏడుస్తాము కానీ మనకు అవసరమైనది మాత్రం కచ్చితంగా ఇస్తాడు. ఆయన చేతులు మన్నల్ని రక్షించేవి మాత్రంమే.

- డా॥ పులివర్తి కృష్ణమూర్తి

తెర

'పురుష' ఫ్యామిలీ చిత్రం: పవన్ కళ్యాణ్ బత్తుల

పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు^పురుష: సినిమాను నిర్మించారు. ఈ మూవీకి వీరు వులవల దర్శకత్వం వహించారు.

మీ నేపథ్యం చెప్పండి?..

మాది పల్నాడులోని మాచర్ల దగ్గర్లోని కారంపూడి. మాకు సినిమా ఇండస్ట్రీతో ఎలాంటి రిలేషన్ లేదు. మా నాన్న కన్‌స్ట్రక్షన్ ఫీల్డ్‌లో ఉన్నారు.

మీ పేరు వెనకాల ఉన్న స్టోరీ చెప్పండి? ఈ ఇండస్ట్రీలోకి రావాలన్నది ఎవరి ఆలోచన?..

మా నాన్న 'గోకులంలో సీత'సినిమా చూశారు. అప్పటికి నేను ఇంకా పుట్టలేదు. అయితే 'తమ్ముడు' టైంలో పుట్టాను. నాకు పవన్ కళ్యాణ్ అని పేరు పెట్టారు. నన్ను హీరో చేయాలన్నది మా నాన్న కల.

నటనలో శిక్షణ తీసుకున్నారా?..

వైజాగ్‌లో సత్యానంద్ వద్ద యాక్టింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. సర్ ఉండే కమ్యూనిటీలోనే నేను కూడా ఉన్నాను. నాలుగు నెలలు ఆయనతోనే కలిసి ఉన్నాను.

'పురుష'కథనే ఎందుకు ఎంచుకున్నారు?..

డీఓపీ సతీష్ వల్లే ఈ ప్రాజెక్ట్ మా దగ్గరకు వచ్చింది. సినిమాలతో ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందించాలని అనుకున్నాం.

సీనియర్ ఆర్టిస్టులతో కలిసి నటించడం ఎలా అనిపించింది?..

'పురుష'లో చాలా మంది సీనియర్ ఆర్టిస్టులున్నారు. అందరూ నాకు ఎంతో సహకరించారు. మరీ ముఖ్యంగా సప్త గిరి అన్నా, కసిరెడ్డి అన్నా ప్రతీ ఒక్క విషయంలో హెల్ప్ చేశారు.

'పురుష'లో మెయిన్ పాయింట్స్ ఏంటి?..

పురుష: చిత్రంలో అన్ని పాత్రలకు సమానమైన ప్రాధాన్యం ఉంటుంది. 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి' సినిమాని ఆడియెన్స్ ఎంతో ఎంజాయ్ చేశారు. మా సినిమా కూడా అన్ని వర్గాల ఆడియెన్స్‌ని ఆకట్టుకుంటుంది.

దర్శకుడితో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ చెప్పండి?..

వీరు అన్న నాకు ఎంతగానో సపోర్ట్ చేశారు. నేను చాలా ఇంట్రోవర్ట్‌గా ఉండేవాడ్ని. నన్ను నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు తీసుకు వచ్చారు.

మీకు ఎలాంటి జానర్స్ అంటే ఇష్టం?..

నా ఫ్రెండ్స్ ఎక్కువగా యాక్షన్ చిత్రాలు చేయమని సలహాలు ఇస్తుంటారు. కానీ ఏ జానర్‌లో సినిమా చేసినా కూడా ప్రేక్షకుల్ని ఎంటర్టైన్ చేయాలన్నదే లక్ష ్యం.

'పురుష' గురించి ఆడియెన్స్‌కి ఏం చెబుతారు? నెక్స్ ప్రాజెక్ట్ గురించి చెప్పండి?..

'పురుష' సినిమాని ఇప్పటి వరకు చూసిన వారంతా మెచ్చుకున్నారు. కచ్చితంగా విజయం సాధిస్తుందని అన్నారు.

Chiru158 21న ఘనంగా ప్రారంభం

జిమ్ సెషన్ వీడియోలో మెగాస్టార్ ఇంటెన్స్ ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రివీల్ మెగాస్టార్ చిరంజీవి మరోసారి సక్సెస్‌ఫుల్ దర్శకుడు బాబీ కొల్లితో చేతులు కలుపుతున్నారు. ప్రతిష్టాత్మక కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ కమర్షియల్ ఎంటర్ టైనర్ ఈ ప్రకటనను చిరంజీవి స్వయంగా ఒక పవర్‌ఫుల్ జిమ్ వీడియో ద్వారా రివిల్ చేశారు. ఆ వీడియోలో ఆయన చూపించిన డెడికేషన్, ఇంటెన్స్ వర్కౌట్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. కొత్త లుక్ కోసం ఆయన పడుతున్న కష్టం, ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం చేస్తున్న ట్రైనింగ్ ఈ సినిమాలో ఉండబోయే హై వోల్టేజ్ యాక్షన్‌కు హింట్ ఇస్తోంది. వీడియోలో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ... గెట్టింగ్ రెడీ ఫర్ 158.. బాబీ.. మే 21 ముహూర్తం.. కెవిఎన్ ప్రొడక్షన్స్ వారిది..అంటే ఇంకో నాలుగైదు రోజుల్లో కలుస్తున్నాం. గెట్ రెడీ .ఇప్పటికే మేకర్స్ విడుదల చేసిన కాన్సెప్ట్ పోస్టర్, లుక్ టెస్ట్ ఇమేజ్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవిబాబీ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో అభిమాను ల్లో ఆసక్తి మరింత పెరిగింది. మాస్ ఎలిమెంట్స్‌తో కథలను పవర్‌ఫుల్‌గా తెరకెక్కించడంలో పేరున్న బాబీ కొల్లి, ఈసారి చిరంజీవిని మరింత ఇంటెన్స్, పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో చూపించ బోతున్నారు. ఈ చిత్రం భారీ యాక్షన్ ఎపిసోడ్స్, ఎలక్ట్రిఫై చేసే ఎలివేషన్స్, అభిమానులను అలరించే మాస్ మూమెంట్స్‌తో ఉండబోతోంది.

29న శ్రద్ధాదాస్ 'త్రికాల' విడుదల

భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న రహస్యాలను ఆధారంగా చేసుకుని రూపొందిన మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్'త్రికాల' మే 29న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. హీరోయిన్ శ్రద్ధదాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో మాస్టర్ ఫేమ్ మహేంద్రన్, అజయ్, సీనియర్ నటి ఆమని కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి మణి తెల్లగూటి కథ, దర్శకత్వం వహించగా, రాధిక- శ్రీనివాస్ నిర్మించారు. ఈ సినిమా నచ్చడంతో చాగంటి ప్రొడక్షన్ ఎల్ఎల్‌పి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నది. ఇటీవలి కాలంలో మైథలాజికల్ టచ్‌తో వచ్చిన థ్రిల్లర్ చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో 'త్రికాల' పై కూడా ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ మొదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు మణి తెల్లగూటి మాట్లాడుతూ.. ప్రపంచంపై చీకటి కమ్ముకున్న సమయంలో వెలుగుగా అవతరించే శక్తి చుట్టూ 'త్రికాల' కథ తిరుగుతుంది. భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న కొన్ని ఆధ్యాత్మిక రహస్యాలను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి తెరకెక్కించాం. నిర్మాతలు మాట్లాడుతూ..సరికొత్త కాన్సెప్ట్‌తో, మైథలాజికల్ టచ్‌తో రూపొందిన 'త్రికాల' ప్రతి వర్గం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సంస్కృతి, ఆధ్యాత్మికత, ఆసక్తి.. వంటి అంశాలు కలిసిన ఈ కథ ప్రేక్షకులకు కొత్త ఫీలింగ్ ఇస్తుంది" అని పేర్కొన్నారు. ఈ సినిమాకు హర్షవర్ధన్ రమేశ్వర్ సంగీతం అందిస్తున్నారు. 'త్రికాల'కు కూడా మంచి మ్యూజిక్ అందించారు. టాలీవుడ్‌లో శ్రద్ధదాస్ సిద్ధు ఫ్రమ్ శ్రీకాకుళం సినిమాతో హీరోయిన్‌గా పరిచయమై, తరువాత ఆర్య 2 ద్వారా మంచి గుర్తింపు సంపాదించింది.

'ది రెడ్ బ్యాగ్' చిత్రంలో కీలక పాత్రలో రాశీ

మెమరీ మేకర్స్ బ్యానర్ మీద డిఫరెంట్ కాన్సెప్ట్, కంటెంట్‌తో కొత్త నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి 'ది రెడ్ బ్యాగ్' అనే సినిమాని నిర్మిస్తున్నారు. బ్యాగ్ చుట్టూ తిరిగే ఈ మూవీకి రవి కుమార్ సీరపు కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు.ఈ చిత్రంలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహారా, రాధ్య, మోనిక, స్నేహ సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. తాజాగా ఈ సినిమా నుంచి స్పెషల్ రోల్ పోషిస్తున్న రాశీ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు.సావిత్రి పాత్రలో రాశీ 'ది రెడ్ బ్యాగ్' సినిమాలో ఓ పవర్ ఫుల్ రోల్‌ను పోషించారు. ఇక ఈ పాత్రకు సంబంధించిన గెటప్, లుక్స్ ఎంత సింపుల్‌గా ఉన్నాయో.. ఆమె లుక్ అంత ఇంటెన్స్‌గా ఉంది. ఈ చిత్రాన్ని మలుపు తిప్పే ఓ కీలక పాత్రలో రాశీ నటించారు. ప్రస్తుతం ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే టీజర్‌ను రెడీ చేస్తున్నట్టుగా టీం తెలిపింది. ఇక టీజర్‌తో మూవీపై మరింత బజ్ క్రియేట్ కానుంది. తొలి సినిమానే అయినా, నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ బడ్జెట్‌తో చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీకి శేఖర్ మోపురి సంగీతమందించగా.. ప్రియేష్ గురుసామి కెమెరామెన్‌గా, శివ శర్వాని ఎడిటర్‌గా పని చేశారు.

' సెయాన్' షూటింగ్ నేడు ప్రారంభం

వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ నిర్మిస్తున్న 'సెయాన్' ప్రాజెక్ట్ కోసం దర్శకుడు శివకుమార్ మురుగేశన్‌తో చేతులు కలిపారు. బాక్సాఫీస్ వద్ద ఘన విజయం అందుకున్న ' అమరన్' తర్వాత రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌లో శివకార్తికేయన్ చేస్తున్న చిత్రమిది. శివకార్తికేయన్ పుట్టినరోజున విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది.ఈ రోజు నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ విషయాన్ని మేకర్స్ ఓ ఇంటెన్స్ పోస్టర్ ద్వారా అధికారికంగా ప్రకటించారు. పోస్టర్‌లో శివకార్తికేయన్ రా అండ్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లలో కనిపిస్తున్న ఆగ్రహం క్యారెక్టర్ పవర్‌ని చూపిస్తున్నాయి. ఈ పోస్టర్ సినిమా ఆధ్యాత్మికతతో పాటు మాస్ యాక్షన్ ఎలిమెంట్స్‌ను కూడా కలిగి ఉంటుందనే సంకేతాలు ఇస్తోంది.ఈ చిత్రాన్ని భారీ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఎమోషన్స్, మాస్ అప్పీల్, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే ఎంటర్టైనర్ గా సినిమా రూపొందనుంది.ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. వివేక్ విజయకుమార్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తుండగా, షాన్ లోకేష్ ఎడిటింగ్ చేస్తున్నారు. యాక్షన్ డైరెక్టర్‌గా సుప్రీమ్ సుందర్ పని చేస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్‌ను అరుణ్ వెంకటరామూడి రూపొందిస్తున్నారు.

సమ్మర్ బ్లాక్ బస్టర్ 'గోదారి గట్టుపైన'

'గోదారి గట్టుపైన' నాకు కొత్త ఆడియన్స్‌ను పరిచయం చేసింది. ఫ్యామిలీలతో థియేటర్లు కలకలలాడడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది: థాంక్ యూ మీట్‌లో హీరో సుమంత్ ప్రభాస్ యంగ్ హీరో సుమంత్ ప్రభాస్ సమ్మర్ బ్లాక్ బస్టర్ 'గోదారి గట్టుపైన' సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించారు. మే 8న వరల్డ్‌వైడ్ రిలీజ్ అయిన ఈ చిత్రం సమ్మర్ కూల్ ఎంటర్టైనర్ గా అలరించి థియేటర్స్ లో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది.. ఈ సందర్భంగా మేకర్స్ థాంక్స్ మీట్ నిర్వహించారు. థ్యాంక్స్ మీట్‌లో హీరో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ..✓అందరికీ నమస్కారం. మా కంటెంట్‌ను ఎంతో స్ట్రాంగ్‌గా సపోర్ట్ చేస్తున్న మీడియాకు థ్యాంక్స్. హీరోయిన్ నిధి ప్రదీప్ మాట్లాడుతూ.. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. మాయ క్యారెక్టర్‌కు వస్తున్న రెస్పాన్స్ ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. నిర్మాత అభినవ్ రావు మాట్లాడుతూ.. మౌత్ టాక్‌తోనే ఇలాంటి సినిమాలు నిలబడతాయి. ప్రేక్షకులు ఇచ్చిన రెస్పాన్స్‌తో మేము చాలా హ్యాపీగా ఉన్నాం. డైరెక్టర్ సుభాష్ చంద్ర మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సచిన్ టెండూల్కర్ ఒక మంచి మాట అన్నారు.. ✓ఎవరైనా రాళ్లు విసిరితే, ఆ రాళ్లతోనే మైయిలురాయి చేసుకోండి, అని.✓గోదారి గట్టుపైన్ల మాకు అలాంటి మైలు రాయి. దేవి ప్రసాద్ మాట్లాడుతూ.. నిర్మాతలు లాభాల దిశగా సాగుతుండటం చాలా ఆనందంగా ఉంది. రేణు మాట్లాడుతూ..మా సినిమాను ఆదరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

సమాజంపట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

రామభద్రపురం, మే 18 ప్రభాతవార్త

సమాజంపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ పి.కృష్ణకుమారి సూచించారు. మండల కేంద్రంలో శనివారం కిశోర వికాశం కార్యక్రమంలో భాగంగా పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు పిల్లలు తల్లిదండ్రులకుగానీ, స్నేహితులతోగాని తెలిపి ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లలు ఆటలనందు శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలి నిర్వహించారు.

నియోజకవర్గ స్థాయి కమిటీలు వివరాలు సేకరణ

బొబ్బిలి మే 18 ప్రభాతవార్త

రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు సేవ రక్షక దళ్. నిర్వాహక దళ్. పరిపాలకు దళ్‌లతో పార్టీని సమర్థవంతంగా నిర్వహించేందుకు వీరిని నియమిస్తామని బొబ్బిలి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ గిరడ అప్పలస్వామి వెల్లడించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో సమావేశం మాట్లాడుతూ కార్యకర్తలు నుంచి నాయకులు వరకు కొత్త క్యాడర్ ఇంటికి చేస్తామని అన్నారు. అన్ని విభాగాల క్యాడర్లను నియోజకవర్గానికి వేస్తామని వాటి ద్వారా సుపరిపాలన అందించడమే లక్ష్యంగా సంసిద్ధులు చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ బలమైన శక్తిగా మారుతుందని అన్నారు. ప్రధాని మోదీ చెప్పిన పొదుపును పాటిస్తామని అన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాల మీద ముందుకు కదిలే పార్టీని అన్నారు. డొక్కా సీతమ్మ సోమవారం అన్నదానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వీర మహిళలు. రేవల్ల కిరణ్ పాల్గొన్నారు.

పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని ధర్నా

బొబ్బిలి. మే 18 ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం పెట్రోలు డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని వైయస్సార్సీపి రాష్ట్ర నాయకత్వ ఇచ్చిన పిలుపుమేరకు బొబ్బిలి నియోజకవర్గం ఇన్చార్జ్ ఎస్ వెంకట చినప్పలనాయుడు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేసి తహసిల్దార్ కువినతి పత్రం అందజేశారు. సోమవారం పార్టీ కార్యాలయం నుండి బయలుదేరి నియోజకవర్గస్థాయి నాయకులు అంత ధర్నా చేస్తూ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేయడానికి వెళ్లారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకటే సామాన్యుడు సాధారణంగా బతికేందుకు కావలసిన వంటగ్యాసు పెట్రోలు డీజిల్ ధరలు పెంచినవి తగ్గించాలని తగ్గించకపోతే భారీ మూల్యం చెల్లించవలసి వస్తుందని హెచ్చరించారు. తాసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శిఎస్ వేణుగోపాల్ నాయుడు. మాజీ చైర్మన్ ఇంటి గోపాలరావు. వెంకట మురళీకృష్ణ. అన్నిరెడ్డి దామోదర్ రావు చోడిగంజి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

బంగారం చోరీకి యత్నం

మక్కువ మే 18 ప్రభాతవార్త

మండలంలోని దబ్బ గడ్డ గ్రామంలో సోమవారం ఉదయం బంగారం మెరుగు పెడతానంటూ ఇద్దరు యువకులు గ్రామంలో తిరిగారని మొదట వెండి పట్టీలు ఇవ్వగా మెరుగుపట్టారని, తరువాత బంగారం మెరుగుపట్ట డానికి ఇవ్వగా ద్రావకంలో ముంచగా బంగారం ముక్క ముక్కలు అవ్వడాన్ని గమనించిన స్థానికులు ఫోటో తీస్తానని అనగా ఆ ఇద్దరు పరారయ్యారు. ఆ ఇద్దరు వ్యక్తులు తమ బ్యాగులను అక్కడే వదిలి పరారయ్యారు ఆ బ్యాగులలో మత్తుమందు లు ఉన్నాయన్న అనుమానం గ్రామస్తులు వ్యక్తపరుస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు.

స్పెషల్ డ్రైవ్‌లో డ్రగ్ టెస్టింగ్ కిట్‌తో తనిఖీలు : టౌన్ సీఐ

సాలూరు మే18 ప్రభాతవార్త

పట్టణంలో గంజాయి నిర్మూలనలో టౌన్ పోలీస్ వారు స్పెషల్ డ్రైవ్ నిర్వ హించి డ్రగ్ టెస్టింగ్ కిట్లతో తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు సోమ వారం టౌన్ సీఐ అప్పల నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది గవర్న మెంట్ హాస్పిటల్ సమీపంలో ఉన్న నిర్జీవ ప్రదేశాలలో గంజాయి సేవించారేమో అని గుర్తించడానికి అనుమానస్పద వ్యక్తులను డ్రగ్ టెస్టింగ్ కిట్‌తో తనిఖీలు చేపట్టారు.దీని ముఖ్య ఉద్దేశం గంజాయి రహిత పట్టణాన్ని చేయడమని ఇంకా మాదక ద్రవ్యాల భారిన పడకుండా కాపాడడం సమాజాంలో శాంతి భద్రతలను పరిరక్షించడం అంతేకాకుండా గంజాయి రవాణా విక్రయాలు సేవించడం చట్టపరంగా నేరమని దీని సమాచారం ఎవరికైనా తెలిస్తే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు ఎస్.ఐ. అనిల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదరికంతో కుటుంబం పెద్ద కేన్సర్‌తో మరణం

స్పందించిన దాతలు 173 వేలు వితరణ

లక్కవరపు కోట, మే 18 ప్రభాతవార్త

మండలంలోని కిత్తన్న పేట పంచాయతీ శివారు రేవల్ల పాలెం గ్రామంకి చెందిన పోలవర శెట్టి నాయుడు నోటి కెన్సర్ సోకి చికిత్స చేసుకుని స్తోమత లేక చిన్న వయసులోనే మరణించడంతో చిన్న పిల్లలు ఆమె భార్య ఉండేది గుడిసె కూడా లేక పాడు బడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనంలో దిక్కు తోచని స్థితిలో వున్నారు అనే సమాచారంను గ్రామంకి చెందిన యువకుడు పోలమర శెట్టి వెంకటేశ్ వీడియో రూపంలో బయటకు తీసుకుని రాగా స్పందించిన పలు సేవా సంఘాలు పలువురు దాతలు తమకు తోచిన సహాయం చేయగా అది మొత్తం 173000 వరకు రావడం జరిగింది ఆ మొత్తంని మృతుడు పెద్ద ఖర్మ సోమవారం గ్రామంలో నిర్వహించిన సందర్భంగా జాకేరు ఆమె సర్పంచ్ బుద్ద అప్పారావు ఇతర దాతలు యువత ఆధ్వర్యంలో మృతుని భార్యకి అందజేశారు. ఈ విధంగా మానవత్వాన్ని చాటి ఆర్థిక సహాయం అందించిన ఒక కుటుం బంకి బ్రతకడానికి ఆసరాగా నిలిచిన ప్రతి ఒక్కరికి గ్రామస్తులు మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఉండేందుకు ఇల్లు లేక ఇబ్బంది పడుతున్న వీరికి ప్రభుత్వ సహాయం అందించాలని అని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే నాగ మాధవి చేతుల మీదుగా సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

నెల్లిమర్ల, మే 18, ప్రభాతవార్త

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. నెల్లిమర్లకు చెందిన సూరా బత్తుల చిట్టిబాబుకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.70 వేల రూపాయిల ఆర్థిక సహాయం చెక్కును ఎమ్మెల్యే నాగ మాధవి నెల్లిమర్ల పట్టణానికి చెందిన సదరు లబ్ధిదారుడు చిట్టిబాబుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని, అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సాయాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని, మెరుగైన ఆరోగ్యం పొందాలని ఆమె ఆకాంక్షించారు. నెల్లిమర్ల జనసేన నాయకుడు గంట సతీష్ పాల్గొన్నారు.

డీవీఎల్ స్కూల్ విద్యార్థుల అద్భుతమైన ప్రతిభ.. పది మంది నవోదయకు ఎంపిక..

శృంగవరపుకోట,మే17,ప్రభాతవార్త

మండలంలోని భవానీ నగర్ లోఉన్న డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్(డీవీఎల్)విద్యార్థులు అద్భుతమైన మంచి సత్తా చాటారు. 2026–27 విద్యా సంవత్సరానికి సంభందించి జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన 11వ తరగతి ప్రవేశ పరీక్షల్లో డీవీఎల్ స్కూల్ కు చెందిన పది మంది పదో తరగతి విద్యార్థులు ఎంపికయ్యారు. ఎస్.శ్రావణశరణ్య,డి.కోటి జోత్స్న, బి.వందన శ్రీలక్షయ, ఎం.సౌమ్యశ్రీ అక్షర భాను, ఎస్.మోహన్, ఎ.హర్షవర్ధన్, ఎం.గుణశేఖర్,ఎస్.ఏ.భార్గవ్ కౌశిక్,కె.సాయి సురేంద్ర వర్మ,పి.జశ్వంత్ ఎంపికయ్యారని స్కూల్ ప్రిన్సిపాల్ వై.జానకీ దేవి తెలిపారు.విద్యార్థులను స్కూల్ అధినేత డాక్టర్ పి.వరలక్ష్మి, డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి

నెల్లిమర్ల, మే 18, ప్రభాతవార్త

మండలంలోని గునిసి పంచాయతీ పరిధిలోని చనమల్లు పేట గ్రామ సమీపంలో ఈనెల 16వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్ నుంచి పడి తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చేరిన గునిసి గ్రామానికి చెందిన చందక తేజ నాయుడు (16) చికిత్స పొందుతూ శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రిలో సోమవారం మృతి చెందినట్లు ఎస్సై బి గణేష్ తెలిపారు. ఈనెల 16వ తేదీన గుణిసి గ్రామ సమీపంలో ఉద్యోగ రీత్యా ద్విచక్ర వాహనంపై తేజ నాయుడు వెనుక కూర్చొని ప్రయాణిస్తున్న సమయంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగినట్లు ఎస్సై తెలిపారు. తేజ నాయుడు తొలుత విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స జరిగిందని, అనంతరం మెరుగైన వైద్యం కోసం జమ్స్ ఆసుపత్రికి తరలించారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కడప జిల్లాలో జరజాపుపేట యువతి మృతి

నెల్లిమర్ల, మే 18, ప్రభాతవార్త

కడప జిల్లా చక్రాయిపేట మండలం కొండప్ప పల్లి సమీపంలో నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామానికి చెందిన కే. దీపిక అనే యువతి మరణించి ఉన్నట్లు అక్కడి పోలీసులు గుర్తించారు. వెంటనే ఒక్కడి సమాచారం అందడంతో కుటుంబీకులు బయలుదేరి వెళ్లారు. దీపిక విద్యాభ్యాసం కోసం గత కొంతకాలంగా కడప జిల్లాలో నివాసం ఉంటున్నట్లు తెలిసింది. దీపిక మరణానికి కారణాలు ఇంకా తెలియలేదు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జరజాపు పేటలో మృతురాలి కుటుంబీకుల్లో విషాదం నెలకొంది.

పెట్రో డిజల్ ధరలపై భగ్గుమన్న వైసీపీ ర్యాలీ నిరసన

ఆటోను తాడుతో లాగిన మాజీ డిసీఎం రాజన్నదొర

సాలూరు మే18 ప్రభాతవార్త

భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా పెట్రోల్ డీజిల్ ధరలే కాకుండా గ్యాస్, కరెంటు చార్జీలు పెంచడం సీఎం చంద్ర బాబు చేతకాని పాలనకు అద్దం పడుతుం దని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం రాజన్నదొర ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులతో బారీర్యాలీ నిర్వహించారు. అలాగే పార్టీ నాయకులు కార్యకర్తలు బాబుపాలనలో బాదుడే బాదుడు అంటూ నిరసన గళం విప్పి నినాదాలు చేసారు.అంతేకాకుండా ఆటోకు తాళ్లుకట్టి మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర భుజంతో లాగి పెట్రో డీజల్ ధరలు పెంచడం ప్రజలకు పెనుబారమని ఆవేదన వ్యక్తం చేసారు. తాహిసిల్దార్ కార్యలయనకి వెళ్లి ధరలు తగ్గించాలని ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతు దేశ రాజధానిలో పెట్రోల్ ధర 97 రూపాయలని కాని ఆంధ్రప్రదేశ్లో పెట్రోల్ ధర మాత్రం 113 రూ. 62 పైసలని ఇదెక్కడ అన్యాయ మని ప్రశ్నించారు. అలాగే ప్రభుత్వం భరించాల్సిన వ్యాట్ ను ప్రజలపై వేయడం దారుణమని కూటమి ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. టౌన్ ప్రెసిడెంట్ అప్పలనాయుడు, రంగునాయుడు,దండి శ్రీను,డోల బాబ్జి,కొల్లి. వెంకటరమణ,మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

డెంకాడ. మే18 ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన సురక్షితమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. పూసపాటిరేగ మండలంలోని చౌడువాడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు బావిని,వెల్దురు పంచాయతీ కాళ్లపరెడ్డి గ్రామంలో జలజీవన్ మిషన్ తాగునీటి పైపులైను, కోనాడ పంచాయతీ పరిధిలోని బిజె గ్రామంలో తాగునీటి ప్రాజెక్టును సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అద్భుతమైన దూర దృష్టి, పల్లెల పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమ, ప్రజల సమస్యలపై ఆయన చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ వల్లే నేడు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నెలిమర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ డి.పైడిరాజు, అప్పలసూరి, గుడివాడ జమ్మిరాజు, సత్యవతి, నాయన శ్రీను, వి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల లేక ఇబ్బంది పడుతున్న ఆర్టీసీ ప్రయాణికులు

బలిజిపేట, మే 18, ప్రభాతవార్త

మండల కేంద్రంలో గల ఆర్టీసీ బస్సు స్టాండ్ కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న వైనం బాధలు తప్ప లేదంటూ హామీలు అంటూ ముం దుకు వస్తారు తేరా గెలిచాక కనీసం పరిసరాలను పట్టించుకోలేని నాయకులు అధికారులు గత మెజిస్ట్రేట్ జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించినప్పటికీ ఇప్పటివరకు దీని మౌలిక సదు పాయాలు కరువయ్యావని స్థానిక ఆర్టీసీ ప్రయాణికులు తెలిపారు కాగా ఆర్టీసీలో ప్రతిరోజు వందల సంఖ్యలో ప్రయాణాలు జరుగుతున్న బస్టాండ్ ఆవరణములో బాత్రూములు, త్రాగునీటి సమస్య విద్యుత్తు కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాన్ని వాపోతున్నారు. పాలకుల మారారు. అయ్యా ఇకనైనా కలెక్టర్ వారు స్పందించి వెంటనే ఈ ఆర్టీసీ ఆవరణంలో ఉన్న మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రయాణికులు కోరుచున్నారు.

బాల్య వివాహాలకు స్వస్తి పలకండి..

పాచిపెంట మే 18 ప్రభాతవార్త

ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా బాల్యవివాహాల వలన అనర్ధాలను ప్రజలకు వివరించి, బాల్య వివాహాలకు దూరం గా ఉండే విధంగా అవగాహన కలిగించాలని పాచిపెంట పోలీస్ స్టేషన్ ఎస్సై, ఎల్.అర్జున్ హితవు పలికారు. అలాగే మండలంలో సోమవారం పి కొనవలస గ్రామంలో వాహనదారులకు, రోడ్డు ప్రమాదాలు మాధక ద్రవ్యాల వినియోగం కలిగే నష్టాలపై అవగాహన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వాహన దారులు ప్రతి ఒక్కరు రోడ్డు బాధ్యత నియమాలు పాటించే సురక్షితంగా గమ్యాన్ని చేరాలని సూచించారు.

పెట్రోలు డీజిల్ ధరలుతక్షణమే తగ్గించాలి: మాజీ డిప్యూటీ సీఎం పుష్ప శ్రీవాణి

కురుపాం మే18ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వము పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. సోమ వారం రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా కురుపాం నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఓటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కురుపాం మెయిన్ రోడ్డు నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు వినూత్న రీతిలో నాటు బండిపై కార్యకర్తలతో పుష్ప శ్రీవాణి వచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కు వినతి పత్రం అందించారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రజలను నిలువునా దోచుకుం టున్న కూటమి ప్రభుత్వం, ఇంధన ధరల పెంపుపై నిప్పులు చెలరేగారు. సంపద సృష్టిస్తామని చెప్పి, ప్రజల సంపదను దోచేస్తున్నారని ఆమె మండిపడ్డారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల వల్ల రైతులు, కూలీలు, మధ్యతరగతి కుటుంబాలు బతుకలేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు.మోసపూరిత హామీలు ఇచ్చిన లోకేష్ పెట్రోల్ బంక్ దగ్గరికి వెళ్లి సెల్ఫీలు తీసుకుంటూ పెట్రోల్ డీజిల్ ధరలు పెంచమని చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం చెప్తున్నవన్నీ అబద్ధాలేనని, ఇచ్చిన మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు ప్రజలను నట్టేట ముంచారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వానికి మానవత్వం లేదని దుయ్యబట్టారు. ప్రజలెవరూ అమాయకులు కాదని మోసపూరిత రాజకీయాలను, వైఫల్యాలను రాష్ట్ర ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని ఈ సందర్భంగా పుష్పశ్రీవాణి గుర్తు చేశారు.

ప్రజలకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై పాపారావు

పార్వతిపురం, మే17, ప్రభాతవార్త

ప్రజల భద్రత ప్రధాన కర్తవ్యంగా జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు భద్రత నియ మాలపై విస్తృతంగా అవగా హన కార్యక్రమాలు ట్రాఫిక్ ఎస్ఐ పాపా రావు నిర్వహించారు. పట్టణంలో విధులు నిర్వహిస్తున్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, మోటార్ వాహనాల చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్ లేకుండా లేదా మద్యం సేవించి వాహనాలు నడపడడం, అతివేగంగా ప్రయాణించడం, ఓవర్ లోడ్, మైనర్ డ్రైవింగ్, వంటి కారణాల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి అని అన్నారు. రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణిస్తే, ఆ కుటుంబానికి కలిగే నష్టం పూడ్చలేనిదని అన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి అని అన్నారు. నియమాలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూనే, ప్రజల్లో బాధ్యతాభావాన్ని పెంపొందించడమే తమ లక్ష్యం అని అన్నారు.

చాకివలసలో నూతనంగా నిర్మించిన తాగునీటి ప్రాజెక్టును ప్రారంభించిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి

భోగాపురం: మే 18,(ప్రభాతవార్త

భోగాపురం మండలంలోని చాకివలస గ్రామంలో డిఎంఎఫ్ నిధులతో నూతనంగా నిర్మించిన తాగునీటి సరఫరా ప్రాజెక్టును నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి సోమవారం రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.పైప్లైన్ ద్వారా ఇళ్లకు తాగనీరు సరఫరా అవుతుంది. తాగునీటి ఆమె స్వయంగా పరిశీలించి, గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే నాగమాధవి మాట్లాడుతూ, గతంలో చాకివలస గ్రామంలో ఎన్ని చేతి పంపు బోర్లు వేసినప్పటికీ వేసవికాలం వచ్చేసరికి ఎండిపోయేవని, సంవత్సరంలో ఆరు నెలలు మాత్రమే నీళు ఉండేవని, మిగిలిన ఆరు నెలల్లో గ్రామస్తులు తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారని అన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా దూరం చేయాలని దృఢ సంకల్పంతో, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ ద్వారా ప్రత్యేకంగా డీఎంఎఫ్ నిధులు మంజూరు చేయించి నూతన తాగునీరు ప్రాజెక్టును నిర్మించడం జరిగిందని ఎమ్మెల్యే నాగమాధవి తెలిపారు. కూటమి నాయకులు వందనాల రమణ, మట్ట అయ్యప్ప రామకృష్ణారెడ్డి, పల్లంట్ల జగదీష్, బాలయ్య రెడ్డి, సూర్యనారాయణ, జన సైనికులు మరియు గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఎగ్ కార్ట్స్ యూనిట్లు పంపిణీ : మంత్రి సంధ్యారాణి

సాలూరు మే18 ప్రభాతవార్త

సాలూరు పట్టణ మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు ఎగ్ కార్ట్స్ యూనిట్లు మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి చేతుల మీదుగా పంపిణీ చేశారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు ఆర్థికంగా ఎదగడానికి సహకారం అందించాలని 4 సంఘాలకు గాను 2 లక్షల విలువైన నాలుగు ఎగ్ కార్ట్స్ యూనిట్లు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఒక్కో యూనిట్‌కు రూ.50 వేల ఆర్థిక సహాయంతో బండ్లు అందజేయడం జరిగిందని,ప్రతి యూనిట్‌కు ఒక గ్యాస్ స్టవ్, ఒక గ్యాస్ సిలిండర్ ప్రభుత్వం అందజేసిందని తెలిపారు అలాగే సీఎం చంద్రబాబుకు మంత్రి సంధ్యారాణికి మహిళా సంఘ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. కమిషనర్ టిటి రత్నకుమార్, టౌన్ ప్రెసిడెంట్ చిట్టి,కొనిసి. వరలక్ష్మి,మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

రామభద్రపురం, మే 18 ప్రభాతవార్త

రామభద్రపురం మండలంలో బడి పిలుస్తోంది కార్యక్రమంలో 218 మంది చేరిక ప్రభుత్వ పాఠశాలలోని పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాశాఖాధికారి ఆమిటి తిరుమలప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని బూసాయ వలస గ్రామంలో డోర్టుడోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకే మంచి ర్యాంకులు వచ్చాయని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న వివిధ పథకాలను కూడా వివరించారు. ఎన్రోల్మెంట్ పెంచడానికి స్పెషల్ డ్రైవ్ కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 218 మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు సిద్ధం చేశామని, ప్రైవేటు పాఠశాలల నుంచి 15 మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ బడిపిలు స్తోంది కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు, అవగాహనా సదస్సులు నిర్వహించాలని ఆయన సూచిం చారు. బుసాయవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం చెల్లూరి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూర్జలో సువర్ణముఖి నదిపై వంతెనకు శంకుస్థాపన

పార్వతీపురం, మే17, ప్రభాతవార్త:

నియోజకవర్గం సీతానగరం మండలం బూర్జ గ్రామంలో సువర్ణముఖి నదిపై కొత్త వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ వంతెన కోసం గతంలో చాలా మంది రాజకీయ నాయకులు హామీ ఇచ్చి మర్చిపోయారని అన్నారు. తమ ప్రభుత్వం హయాం లో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడమే కాకుండా సకాలంలో వంతెన పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజల చిరకాల కలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. బూర్జ గ్రామంతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని, తాను వచ్చిన ప్రతిసారీ ఏదో ఒక అభివృద్ధి పనికి శ్రీకారం చుడతానని అన్నారు. గ్రామంలో అవసరమైన చోట సిసి రోడ్లు, పక్కా కాలువలు నిర్మిస్తామన్నారు. గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యను అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో పంచాయతీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన స్వచ్ఛరథాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చినఅంకలాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ డోకల నరహరితోపాటు 100 కుటుంబాలు వైసిపి పార్టీని వీడి తెలుగుదేశంలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్. కోటలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కోళ్ల

లక్క వరపు కోట మే 18 ప్రభాతవార్త

మండలంలోని ఏల్ కోట మేజర్ పంచాయతీలోని ఎస్సి కాలనీలో సోమవారం 30 లక్షల నిధులతో నిర్మించనిన్ను త్రాగునీటి సరఫరాకి ఉపయోగ పడే ఓవర్ హెడ్ ట్యాంక్ పనులకు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా పైలట్ ప్రాజెక్ట్ కింద నియోజకవర్గానికి రూ. 90 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రథమంగా రూ. 30 లక్షల అంచనా వ్యయంతో స్థానిక సంఘం వీధి దగ్గర ఉన్న ఎస్సీ కాలనీలో నూతన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం, అలాగే ప్రతి ఇంటికీ కొత్తగా కుళాయిల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి రాం ప్రసాద్ దంపతులకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరామ్ ప్రసాద్, ఏ ఎం సి చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కరెడ్ల ఈశ్వరరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల రామ కృష్ణ, ఏ ఎం సి డైరెక్టర్ పుట్టా శ్రీనివాసరావు, వేపాడ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, యూనిట్ ఇంచార్జీ సంఘం సతీష్ కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథ్ రాజేష్, మాజీ ఎంపీటీసీ పిన్నింటి రమేష్ నాయుడు, ఎంపీటీసీ రాయవరపు చంద్ర శేఖర్, ప్రాజెక్ట్స్ ఈ ఈ ఎడ్ల గోవిందరావు, డి ఈ ఈ పైడిరాజు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పట్టిపీడిస్తున్న సిబ్బంది కొరత

పట్టించుకోని జిల్లా అధికారులు

పాచిపెంట మే 18 ప్రభాతవార్త

మండల కేంద్రమైన పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రధానంగా సిబ్బంది కొరత పట్టి పీడించడంతో క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు లేకపోవడం వలన పర్యవేక్షణ అంతంత మాత్రం ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. వేరే జిల్లా నుండి పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకి పీ.హెచ్.న్.గా బదిలీపై వచ్చివిధులకు జాయిన్ అయ్యి, తదుపరి నుంచి ఆమె విధులకు రాకపోవడం, అలాగే ఇక్కడ పని చేసిన హెల్త్ విజిటర్ పద్మావతి డిప్యూటేషన్ పై మన్యం జిల్లా పార్వతీపురంకి ఉన్నత అధికారులు పంపించడం వలన వైద్య సేవలకు అంతరాయం కలుగుతుంది అన్న విమర్శ లు విరువగా వినిపిస్తున్నాయి. రెండు విషయాలును ప్రభాతవార్త సోమవారం శరవాణిలో పాచిపెంట పిహెచ్సి ఇన్చార్జి వైద్యాధికారి శివకుమార్ను వివరణ కోరగా, పి హెచ్ ఎన్ విధుల్లో జాయిన్ అయిన తర్వాత, తదుపరి నుండి పిహెచ్సికి పీ.హెచ్.ఎన్. విధులకు రావడంలేదని ఉన్నతాధికారులకు సమాచారమిచ్చినట్లు , అదేవిధంగా హెచ్ వి .పద్మావతి డిప్యూటేషన్ నేను ఇన్చార్జి వైద్యాధికారి గాఉన్న టైంలో ఆమె వెళ్లలేదని గతంలో వెళ్లారనీ, ఇన్చార్జి వైద్యాధికారి శివకుమార్ శరవాణిలో ప్రభాతవార్తకు తెలిపారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 9 సబ్ సెంటర్లు కలవు .1 పనస పెద్ది కోన వలస, 2 ,పనుకువలస 3 విశ్వనాథపురం, 4,కర్రివలస 5పద్మాపురం, 6 కోటికి పెంట7 కేసలి, 8 పాచిపెంట 1, 9,పాచిపెంట2 , పై సబ్ సెంటర్ పరిధిలో జనాభా 26, వేల177 జనాభా కలిగి ఉన్నారు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం రౌండ్ క్లాక్ ఆరోగ్య కేంద్రం అయినప్పటికీ ఒకే వైద్యాధికారి విధులు నిర్వహించడం అదేవిధంగా పర్యవేక్షించవలసిన అధికారులు ఒకరు డిప్యూటేషన్ పై ఒకరు, మరి ఒకరు సెలవు పై వెళ్లడం వలన ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య సేవలు అంతంత మాత్రమే ఉండడంవల్ల రోగులు ఇబ్బందులు గురవుతున్నారు. ఈ విషయమై ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే పూర్తి స్థాయిలో సిబ్బంది ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అలాగే ప్రజా ప్రతినిధులు కూడా కలుగజేసుకొని పాచి పెంట పిహెచ్సికి పూర్తిస్థాయిలో పర్మినెంట్ వైద్యాధికారిని సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం డాక్టర్ రిషి కుమార్



బలిజిపేట మే 18 ప్రభాతవార్త

బలిజిపేట మండలం గలవల్లి ప్రాథమిక ఆరోగ్య పరిధిలోగల బోధవ్యాధితో బాధపడుతున్న రోగులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గళావిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి. రిషి కుమార్ తెలియజేశారు. సోమవారం గంగాడ గ్రామంలో గళావిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు బి. రేవతి, జి. రిషి కుమార్ ఆధ్వర్యంలో గంగాడ గ్రామంలో బోధ వ్యాధిగ్రస్తుల వ్యక్తిగత పరిశుభ్రతకు అవసరమైన ట్రబ్ లు, తువ్వాలు, సబ్బులు, జగ్గులు, ఆయింట్మెంట్, మొదలగు సామాగ్రి అందజేశారు. చిలకలపల్లి స్కోప్ సభ్యులు శివరామకృష్ణ, మూర్తి బోధవ్యాధిగ్రస్తులు ఈ కిట్లను ఎలా ఉపయోగించుకోవాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.ఈవో నరసింహులు, హెచ్ ఎస్ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు శంకర్రావు, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు ప్రకటన పై వితంతువుల్లో చిగురిస్తున్న ఆశలు

గరివిడి మే,18 ప్రభాత వార్త

వితంతువులు కి కొత్త పింఛన్లు మంజూరుకి సంబంధించి ప్రభుత్వ ప్రకటన పై వితంతువుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత రెండేళ్లుగా వితంతువులు కి కొత్త పింఛన్లు మంజూరు కాలేదు. భర్తను కోల్పోయి సమాజంలో చిన్నచూపుకి గురై, చేతిలో చిల్లి గవ్వలేక పట్టెడు మెతుకులు కి నోచుకోని స్థితిలో ప్రభుత్వ పింఛను కోసం ఎదురు చూసే అభాగ్య వితంతువులు కి ప్రభుత్వ ప్రకటన వారిలో కోటి ఆశలు నింపింది. ప్రభుత్వ పింఛను తో జీవనాన్ని గడిపేందుకు నిరీక్షించే వారి బతుకుల్లో వెలుగు నింపేందుకు ప్రభుత్వ ప్రకటన తీపి కబురు నింపింది. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి అయిన నేపథ్యంలో జూన్ 12 నుండి వితంతువులు కి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం ఇటీవల వెల్లడించింది. అలాగే పింఛన్లు కి ధరఖాస్తులు చేసుకొనే అవకాశం కూడా కల్పించనుంది. రెండేళ్లుగా పింఛను కి నోచుకోని అభాగ్య విడో లు అందరూ ప్రభుత్వ మంజూరు పింఛన్లు పై వారిలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

ఆట

ఇషాన్‌దార్ : ప్లే ఆఫ్‌లో సన్‌రైజర్స్



చెన్నై: ఇషాన్ కిషన్(47 బంతుల్లో 70 రన్స్: 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఇన్నింగ్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్ బెర్త్ అందుకుంది. చెన్నై సూపర్ కింగ్స్‌ను దాని సొంతగడ్డపై 5 వికెట్ల తేడాతో ఓడించింది. 181 పరుగుల లక్ష్యాన్ని మరో ఓవర్ ఉండగానే అందుకుంది. ఈ విజయంతో ఆరెంజ్ టీమ్ 16 పాయింట్లకు చేరు కోవడంతో గుజరాత్‌తో పాటు సన్‌రైజర్స్ ప్లే ఆఫ్‌బెర్త్‌లు ఖరారయ్యాయి. చెన్నై సూపర్ కింగ్స్ 12 పాయింట్లకే పరిమితమై ప్లే ఆఫ్‌కు దూరమైంది.

181 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ కొనసాగించిన సన్‌రైజర్స్ ఆరంభంలోనే ట్రావిస్ హెడ్(6) వికెట్ కోల్పోయింది. అభిషేక్ శర్మ(26) పరవాలేదనిపించాడు. ఈ దశలో ఇషాన్ కిషన్, హెన్రీ క్లాసెన్(26 బంతుల్లో 47; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు).. మూడో వికెట్‌కు 75 పరుగులు జోడించి ఆదుకున్నారు. ఈ క్రమంలో క్లాసెన్ స్టంపవుటవగా, నితీష్(13) కూడా వెంటనే అవుటవడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. మరోవైపు నిలకడగా బ్యాటింగ్ చేసిన ఇషాన్ కిషన్ అర్ధ సెంచరీ చేయడంతో పాటు ముఖేష్ 18వ ఓవర్లో 4, 6సిక్స్‌తో గెలుపుకు చేరువచేశాడు. 19వ ఓవర్ తొలి బంతికి అరోరా సిక్స్ బాదాడు. మూడో బంతికి కిషన్ అవుటైనా, చివరి బంతికి రవీంద్రన్ బౌండరీతో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.

అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన సీఎస్‌కే 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగుల స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. నితీష్ వేసిన తొలి ఓవర్లో సంజూ(13 బంతుల్లో 27)ఎదురుదాడికి దిగాడు. తొలి బంతికే సిక్స్, ఆ తర్వాతి బంతికి బౌండరీ బాదిన సంజూ.. చివరి బంతికి మరో ఫోర్‌తో 17రన్స్ సాధించాడు. ఇక ప్రఫుల్ ఓవర్లో వరుసగా మూడు బౌండరీలతో చెలరేగాడు. ఈ దశలో బౌలింగ్‌కు వస్తూనే కమిన్స్.. డేంజరస్ సంజూను అవుట్ చేసి సన్‌రైజర్స్‌కు బ్రేక్ ఇచ్చాడు. ఉర్విల్(13) కూడా వస్తూనే బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లతో అలరించినా... అతని ఇన్నింగ్స్‌కు సాకిబ్ తెరదించాడు.

మిడిల్ ఆర్డర్ తడబాటు: వన్ డౌన్‌లో వచ్చిన కార్తీక్ శర్మ(32) అదిరిపోయే హిట్టింగ్‌తో 3 ఫోర్లు, 2 సిక్సర్లు బాది మంచి ఊపులో కనిపించాడు. ప్యాట్ కమిన్స్ రెండోసారి బౌలింగ్‌కు వచ్చి చెన్నైని దెబ్బకొట్టాడు. మొదట కార్తీక్‌ను, ఆ తర్వాతి ఓవర్లో రుతురాజ్ గైక్వాడ్ (15)ను అవుట్ చేశాడు.

బ్రెవిస్ షో.. చివర్లో దూబే మెరుపులు: వరుసగా వికెట్లు పడుతున్నా.. క్రీజ్‌లోకి వచ్చిన బ్రెవిస్(27 బంతుల్లో 44) సన్‌రైజర్స్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. గ్రౌండ్ నలుమూలలా షాట్లు ఆడుతూ స్కోర్‌ను పరిగెత్తించాడు. ఆ తర్వాత వచ్చిన శివమ్ దూబే(26) కూడా ఓ చేయి వేయడంతో చెన్నై 180 మార్క్‌ను అందుకుంది.సన్‌రైజర్స్ బౌలర్లలో కమిన్స్ 3 వికెట్లు, సాకిబ్ 2 వికెట్లు...ప్రఫుల్, మలింగ చెరో వికెట్ పడగొట్టి చెన్నైను కట్టడి చేశారు.

రికార్డుల వండర్

(వార్త క్రీడా విభాగం)

వైభవ్ సూర్యవంశీ.. ఈ 15 ఏళ్ల క్రికెట్ వండర్ ముందు రికార్డులు మోకరిల్లుతున్నాయి. తాజాగా ఐపీఎల్‌లో ఒకే సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత క్రికెటర్‌గా నిలిచాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో బాదిన మూడు సిక్స్‌లతో కలుపుకుని సిక్సర్ల సంఖ్య 44కు చేరింది. ఇప్పటివరకు ఈ రికార్డు అభిషేక్ శర్మ(2024, 42 సిక్స్‌లు) పేరిట ఉండేది. శ్రేయాస్ అయ్యర్(2025, 39 సిక్స్‌లు), విరాట్ కోహ్లీ(2024, 38 సిక్స్‌లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఐపీఎల్ ఒక సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు రికార్డు ఇప్పటికీ క్రిస్ గేల్(59) పేరిటే ఉంది. మరో రెండు మ్యాచ్‌లు ఆడాల్సిన వైభవ్.. ఈ ఫీట్‌ను అందుకున్నా ఆశ్చర్యం లేదు.

భారత యువ క్రికెట్‌లో ఇటీవలి కాలంలో ప్రత్యేకంగా నిలుస్తున్న పేరు వైభవ్ సూర్యవంశీ. చిన్న వయస్సులోనే అతడు చూపిస్తున్న స్థిరమైన బ్యాటింగ్ ప్రతిభ క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఒత్తిడిని తట్టుకుని ఇన్నింగ్స్‌ను నిర్మించగల సామర్థం అతనిని భవిష్యత్ స్టార్‌గా నిలబెడుతోంది.పవర్ హిట్టింగ్‌పై మాత్రమే ఆధారపడకుండా, బంతిని గమనించి సరైన షాట్లను ఆడటం అతని ప్రత్యేకత. యువ వయస్సులోనే ఒత్తిడి పరిస్థితుల్లో నిలబడటం వైభవ్ మానసిక దృఢత్వాన్ని తెలియజేస్తోంది.

గత ఏడాది ఐపీఎల్ ఆరంగేట్రంతోనే సంచలన తారగా ఆవిర్భవించిన వైభవ్.. ఏడు మ్యాచ్‌ల్లో 206 స్ట్రయిక్ రేట్‌తో 252 పరుగులు సాధించాడు. అందులో ఓ సెంచరీ, ఓ అర్ధసెంచరీ ఉన్నాయి. ఏడు మ్యాచ్‌ల్లో 24 సిక్స్‌లు బాదాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. గతంలో కంటే స్థిరంగా ఆడుతున్నాడు. 12 మ్యాచ్‌ల్లో సింగిల్ డిజిట్ స్కోర్లు కేవలం మూడు సార్లే. మొత్తంగా ఈ సీజన్‌లో 12మ్యాచ్‌లాడిన వైభవ్ 234.78 స్ట్రయిక్‌రేట్‌తో 486 రన్స్ సాధించాడు. అందులో ఓ సెంచరీ, మరో అర్ధసెంచరీ ఉన్నాయి. 43 ఫోర్లు, 44 సిక్స్‌లు బాదాడు. ఇండియన్స్‌పై 39 పరుగులతో ఈ సీజన్ స్టార్ట్ చేసిన వండర్ కిడ్... సన్‌రైజర్స్‌పై జైపూర్‌లో 35బంతుల్లోనే తుఫాన్ సెంచరీతో, ఆర్సీబీపై 78 రన్స్‌తో చెలరేగాడు. ఇక డీసీపై 46 రన్స్, గుజరాత్‌పై 36 రన్స్, పంజాబ్‌పై 43 రన్స్, కేకేఆర్‌పై 46 రన్స్ చేశాడు. వయసుకు మించి పెద్దఇన్నింగ్స్ ఆడుతున్న వైభవ్ నుంచి రాజస్థాన్ రాయల్స్, ఫ్యాన్స్ ఇంకా పెద్ద ఇన్నింగ్స్‌లో ఆశిస్తున్నారు. దీంతో అతనిపై మరింత ఒత్తిడి పెరుగుతోంది.

వైభవ్ గత ఐపీఎల్ కటే ఈ ఐపీఎల్‌కు మరింత పరిణతి సాధించాడు. మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా ఆటను మార్చుకునే నైపుణ్యం అతనిలో కనిపిస్తోంది. ప్రారంభంలో వేగాన్ని పెంచడం ద్వారా జట్టుకు అవసరమైన పరుగులను అందిస్తున్నాడు. అతని టెక్నిక్ కూడా అమోఘం. ఫాస్ట్ బౌలర్లను ధైర్యంగా ఎదుర్కొనడం,స్పిన్నర్లపై ఫుట్‌వర్క్‌తో ఆధిపత్యం చలాయిస్తున్నాడు. ఈఆటతీరే ఇతర యువ ఆటగాళ్లతో పోలిస్తే ప్రత్యేకంగా నిలబెడుతోంది.

వైభవ్ బ్యాటింగ్ మరింత స్థిరంగా మారాలంటే షాట్ల ఎంపికలో సయమనం పాటించాలని పలువురు మాజీలు సూచిస్తున్నారు.ఈ కొద్ది మార్పులు చేసుకుంటే 30, 40 పరుగులను బిగ్ స్కోర్లుగా మారతాయని పేర్కొంటున్నారు. మొదటి బంతికే సిక్స్ అని కాకుండా అభిషేక్ ఎలాగైతే మార్పుచేసుకున్నాడో వైభవ్ కూడా మారాల్సిందేనంటున్నారు. దూకుడే ప్రతిదానికి పరమమంత్ర కాదని సూచిస్తున్నారు.

గోల్డెన్ మాస్టర్స్ సాధించిన సినెర్

రోమ్: పురుషుల టెన్నిస్ ప్రపంచ నెంబర్ వన్ యానిక్ సినెర్ అరుదైన ఘనత అందుకున్నాడు. గోల్డెన్ మాస్టర్స్ ఘనత సాధించాడు. ఈ సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ సొంతగడ్డపై రోమ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టైటిల్ చేజిక్కించుకున్నాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో సినెర్ 6-4, 6-4తో వరుస సెట్లలో నార్వే ఆటగాడు కాస్పర్ రూడ్‌పై అలవోకగా గెలుపొందాడు. సినెర్ బలమైన సర్వీసులు, ప్లేసింగ్‌ల ముందు రూడ్ నిలవలేకపోయాడు.సినెర్‌కు 10,07,165యూరోల (రూ. 11 కోట్ల 23 లక్షలు) ప్రైజ్‌మనీతో పాటు 1000ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఈ టైటిల్‌తో యానిక్ సినెర్.. కెరీర్ గోల్డెన్ మాస్టర్స్ ఘనత పూర్తి చేశాడు. మాస్టర్స్ సిరీస్-1000లో భాగంగా జరిగే తొమ్మిది వేర్వేరు టోర్నీలన్నింటిలో విజేతగా నిలిచిన రెండో ప్లేయర్‌గా సినెర్ నిలిచాడు. మయామి, మాడ్రిడ్, మోంటె కార్లో, ఇండియన్ వెల్స్, రోమ్, పారిస్, షాంఘై, సిన్సినాటి, కెనడా ఓపెన్ టైటిల్స్ సాధించాడు. సినెర్ కెరీర్‌లో ఇది 10వ మాస్టర్స్ సిరీస్ టైటిల్. మయామి ఓపెన్‌ను రెండుసార్లు నెగ్గిన సినెర్.. మిగతా ఎనిమిదింటిని ఒక్కోసారి సాధించాడు. 1990లో మాస్టర్స్ సిరీస్ మొదలుకాగా... ఇప్పటివరకు నొవాక్ జొకోవిచ్ మాత్రమే రెండుసార్లు 2018లో, 2020లో కెరీర్ గోల్డెన్ మాస్టర్స్ ఘనత సాధించాడు.

ముష్ఫికర్ సూపర్ సెంచరీ, పాక్ ముందు భారీ లక్ష్యం

సైల్హెట్: పాకిస్థాన్‌తో జరుగుతున్న రెండు టెస్ట్‌లోనూ బంగ్లాదేశ్ పట్టు బిగించింది. ముష్ఫికర్ రహీమ్(233 బంతుల్లో 137; 12 ఫోర్లు) సూపర్ సెంచరీకి తోడు లిటన్ దాస్(92 బంతుల్లో 69) రాణించడంతో బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 390పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 46 పరుగులు కలుపుకుని 437 పరుగుల భారీ లక్ష్యాన్ని పాకిస్థాన్ ముందుంచింది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 278 పరుగులు చేయగా,పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 232 రన్స్‌కు ఆలౌటైంది. ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉంది.తొలి టెస్ట్‌లో ఘనవిజయం సాధించిన బంగ్లాదేశ్ ఈ టెస్ట్‌లోనూ నెగ్గి రెండు టెస్ట్‌ల సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడంపై దృష్టి పెట్టింది.

మూడో రోజు ఆటలో ముష్ఫికర్, లిటన్‌దాస్ పాక్ బౌలర్లను ధీలుగా ఎదుర్కొన్నారు. అయిదో వికెట్‌కు శతక భాగస్వామ్యాన్ని అందించారు. ఆ తర్వాత కూడా ముష్ఫికర్ జోరు చూపి సెంచరీ పూర్తి చేశాడు. ఇది టెస్ట్‌ల్లో ముష్ఫికర్‌కు 14వ శతకం. బంగ్లా తరఫున టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా ముష్ఫికర్ నిలిచాడు.

ఆల్‌టైమ్ కనిష్టానికి డాలర్ వర్సెస్ రూపాయి

ముంబయి,మే18:భారతకరెన్సీ రూపాయి విలువ సోమవారం చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.2 శాతం క్షీణించి 96.20వద్ద ఆల్ టైమ్ కనిష్టానికి చేరింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో భారీ పతనం నమోదైంది. గత శుక్రవారం తొలిసారిగా 96 మార్కును దాటిన రూపాయి, ఈ సోమవారం మరింత బలహీనపడింది. ముఖ్యంగా ముడి చమురు ధరలు పెరగడం రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. యూఏఈలోని ఓ అణు విద్యుత్ కేంద్రంపై దాడి జరిగిందన్న వార్తల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 111 డాలర్లకు పెరిగింది. దీనికి తోడు ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యలకు దిగవచ్చన్న సంకేతాలు కూడా ఆందోళనలను పెంచుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో డాలర్‌కు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. రూపాయి రికార్డు స్థాయి పతనం దేశ స్థూల ఆర్థిక దృక్పథంపై ఆందోళనలను తీవ్రతరం చేస్తోంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితి, ఇంధన ధరల ఒత్తిడి కారణంగా డాలర్‌కు డిమాండ్ పెరిగి రూపాయి 96 స్థాయిని దాటింది. దీనివల్ల దిగుమతుల బిల్లు, ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థిక వృద్ధి మందగించే ప్రమాదం ఉందని ఎన్రిచ్ మనీ సీఈవో పొన్ముడి ఆర్ తెలిపారు. ఈ బలహీన సెంటిమెంట్ స్టాక్ మార్కెట్లపైనా ప్రభావం చూపింది. సెన్సెక్స్ 808 పాయింట్లు, నిఫ్టీ 247పాయింట్ల నష్టంతో ప్రారంభమయ్యాయి.మరోవైపు, రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం, ఆర్బీఐ చర్యలు చేపట్టాయి.వెండిదిగుమతులపై ఆంక్షలు విధించడంతో పాటు,కరెన్సీ మార్కెట్లలో ఆర్బీఐ జోక్యం చేసుకుంటోంది.ప్రత్యేక డాలర్ విక్రయాల కౌంటర్లు ప్రారంభించింది. ఈ వారమంతా రూపాయిపై ఒత్తిడి కొనసాగవచ్చని ట్రేడర్లు అంచనా వేస్తున్నారు.

జిడిపిలో 2.3 శాతంగా కరెంట్ ఖాతా లోటు



న్యూఢిల్లీ,మే 18:భారత్ కరెంటుఖాతాలోను ఈ ఆర్థిక సంవత్సరంలో జిడిపిలో 2.3శాతంగా ఉంటుందని విదేశీ బ్రోకరేజి సంస్థ సోమవారం ప్రకటించింది. చెల్లింపుల్లో సమతుల్యత లోటు కూడా 65బిలియన్ డాలర్లుగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉంటుందని, అదే గత ఏడాది 35 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు హెచ్ఎస్‌బిసి సంస్థ వెల్లడించింది. ముడిచమురుధరలు సగటున బ్యారెల్‌కు 95 డాలర్లుగా ఉంటాయని, చమురు, బంగారం, కీలక ఉత్పత్తులు, సేవలరంగ వాణిజ్యం, విదేశీ జమలు కూడా కరెంటు ఖాతాలోటును జిడిపిలో 2.3 శాతానికి చేరుస్తాయని, అదే గత ఏడాది 0.9శాతంగా ఉందని సంస్థ ప్రకటించింది బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ అంచనాలు కూడా ఎఫ్‌పిఐ నిధుల రాక, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విదేశీ వాణిజ్య రుణాల ధోరణుల ఆధారంగా ఉంటాయని ప్రకటించింది. విదేశీ రిజర్వులు 700 బిలియన్ డాలర్ల వరకూ ఉంటాయని, అందువల్లనే ఖజానా పరిపుష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పెట్రోలుధరల పెంపు కారణంగా అదనంగా 2/3వంతు నిధులు అవసరం అవుతున్నాయని అంచనావేసింది. ఇటీవలే సంతకాలుచేసిన వాణిజ్య డీల్స్‌తో భారత్ వృద్ధి అవకాశాలు మరింతపెరుగుతాయని, ఎఫ్‌డిఐల రాక మరింత పెరగవచ్చని అంచనావేసింది. విదేశీ పెట్టుబడులపై భారత పన్నుల వ్యవస్థ తీరుతెన్నులు కూడా జిడిపిపై ప్రభావంచూపిస్తాయని అంచనావేసింది.

నాలుగు కేటగిరీలుగా టిసిఎస్ ఇంక్రిమెంట్లు

ముంబయి, మే 18: ఐటిసేవలరంగ దిగ్గజం టిసిఎస్ ఉద్యోగులకు 6 నుంచి 8శాతం వేతనాలనుపెంచుతున్నట్లుప్రకటించింది. అత్యధిక పని తీరు చూపించిన ఉద్యోగులను టాప్‌రేటింగ్‌గ్రేడ్ అంటే ఏప్లస్ కేటగిరిలో చేర్చింది. వీరికి 10శాతం జీతాల పెంపునుప్రకటించింది. గత ఏడాదినుంచి ఎదుర్కొంటున్న గ్లోబల్ అనిశ్చితులనుంచి రికవరీ అవుతున్న కంపెనీ సహజంగా ఇచ్చే వేతన పెంపునే ప్రకటించింది. దీనితోజీతాల పెంపు కూడా కొంత జాప్యం జరిగింది. స్థూల ఆర్థికవ్యవస్థలో ఉన్న అనిశ్చితులకారణంగానే వేతన పెంపును సెప్టెంబరుకు వాయిదాడేసింది. అయితే ఏప్రిల్‌లో మాత్రం కంపెనీ తమ ఉద్యోగులకు ఏప్రిల్‌నుంచే వేతన పెంపు వర్తిస్తుందని ప్రకటించింది. ఉద్యోగులను కంపెనీ ఏప్లస్,ఏ, బి, సి కేటగిరీలుగా వర్గీకరించింది. కంపెనీ నాలుగోత్రైమాసికంలోప్రకటించిన ఫలితాలకు అనుగుణంగా ఈ వేతన పెంపు ఉంది. అర్హత కలిగిన ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లు కూడా ఇచ్చామని, అదనంగా భారత్‌లోని అందరు ఉద్యోగులకు కొత్త లేబర్ కోడ్‌లను పరిగణనలోనికి తీసుకుని అదనపు ప్యాకేజిలు కూడా వర్తింపచేసినట్లు వెల్లడించింది. వరించిన వేతన ప్యాకేజిలతో ఉద్యోగులకు మరింత ప్రయోజనం ఉంటుందని వెల్లడించింది. కంపెనీలో తక్కువ కేడర్ ఉద్యోగులకు 2-3 శాతం వేతన పెంపు ఉంటే విదేశీ ఉద్యోగులకు 2-4 శాతంమాత్రమేప్రకటించింది.

చివరి నిమిషం ఐటి ర్యాలీతో..
స్వల్పలాభాల్లో స్టాక్ మార్కెట్లు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప లాభాలతో ఫ్లాట్‌గా ముగిశాయి. రోజులో చాలా వరకు నష్టాల్లో ట్రేడ్ అయిన సూచీలు, చివరి గంటలో ఐటీ షేర్లలో వచ్చిన బలమైన కొనుగోళ్ల మద్దతుతో కోలుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 77.05 పాయింట్ల లాభంతో 75,315.04 వద్ద, నిఫ్టీ 6.45 పాయింట్ల లాభంతో 23,649.95 వద్ద స్థిరపడ్డాయి. వారం ప్రారంభ రోజున ట్రేడింగ్‌లో ఐటీ రంగం గరిష్టంగా ప్రకాశించింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2 శాతానికి పైగా పెరిగింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో ఇన్వెస్టర్లు రక్షణాత్మక రంగాలైన ఫార్మా, హెల్త్‌కేర్ వైపు మొగ్గు చూపారు. దీంతో ఆ రంగాల షేర్లలో కూడా కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. బ్రాడర్ మార్కెట్‌లో మాత్రం అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.15 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.26 శాతం మేర నష్టపోయాయి.

నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరలపై వాటి ప్రభావం వంటి అంశాలపై ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఇన్ఫోసిస్ 2.15శాతం, భారతి ఎయిర్‌టెల్ 1.76శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 0.50శాతం సూచీలకు మద్దతుగా నిలిచాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.43శాతం, స్మాల్ క్యాప్ సూచీ 1.71శాతం చొప్పున క్షీణించాయి. మార్కెట్లలో బిఎస్ఇ పరంగా 1264 కంపెనీల షేర్లుపెరిగితే 3034 షేర్లు పతనం చెందాయి. 205 షేర్లు స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువ 96.33గా నిలిచాయి. ముందురోజు 95.81 కంటే గణనీయంగా క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ ధరలు రూ.1,58,666కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు బ్యారెల్ ఒక్కొంటికి 110.29 డాలర్లుగా కొనసాగింది.

ఇక కంపెనీలపరంగా గ్లాండ్ ఫార్మా 15.64 శాతం ఎరిగింది. బిఎస్ఇ షేర్లు కూడా 2.96శాతం పెరిగితే ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ బీమా 3.89శాతం క్షీణించింది. విఐపి ఇండస్ట్రీస్ 3.96శాతం,భారత్ వైర్‌రోప్స్ 4.07శాతం క్షీణించాయి. నియోజెన్ కెమికల్స్ 0.94 శాతం పెరిగింది. వొడాఫోన్ ఐడియా 0.46 శాతం కెఐసి ఇంటర్నేషనల్ 11.14 శాతం చొప్పున క్షీణించాయి. అలాగే కొచ్చిన్ షిప్‌యార్డ్ 5.11 శాతం, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా 1.17 శాతం, హెచ్‌డిఎఫ్‌సి అసెట్ మేనేజ్‌మెంట్‌కంపెనీ 3.24శాతం క్షీణించాయి.

ఖర్చులు తగ్గించుకోండి.. వర్చువల్ సమీక్షలే చేయండి!
బ్యాంకులు, బీమా సంస్థలకు కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ, మే 18: ఖర్చులను భారీగా తగ్గించుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ బీమా సంస్థలు, ఆర్థిక సంస్థలకు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు చర్యల్లో భాగంగా ప్రయాణాలపై తీవ్ర ఆంక్షలు విధించడంతో పాటు దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధనలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) వంటి దిగ్గజ సంస్థలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులకు వర్తించనున్నాయి. ఆర్థిక సేవల విభాగం ఉత్తర్వుల ప్రకారం అత్యవసరమైతే తప్ప అన్ని రకాల సమావేశాలు, సమీక్షలు, సంప్రదింపులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే నిర్వహించాలి. సంస్థల చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల (సీఈఓ) విదేశీ ప్రయాణాల్లో పరిమితులుపాటించాలని తెలిపింది. సాధ్యమైనంత వరకు విదేశీ సమావేశాలకు వర్చువల్‌గానే హాజరుకావాలని పేర్కొంది.ప్రధాన కార్యాలయాలు, బ్రాంచ్ ఆఫీసుల్లో ప్రస్తుతం అద్దెకు వాడుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో వీలైనంత వరకు ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టాలని ఆదేశించింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతల వల్ల ఏర్పడే ఆర్థిక ప్రభావాలను తట్టుకునేందుకు ఖర్చులను తగ్గించుకోవాలని, పొదుపు పాటించాలని ప్రధానమంత్రి గతవారం పిలుపునిచ్చారు.పశ్చిమాసియాలో సుదీర్ఘకాలంగా సాగుతున్న ఉద్రిక్తతల వల్ల దేశ ఆర్థిక వృద్ధి మందగించడం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది.ఇప్పటికే భారత కరెన్సీ రికా ర్డు స్థాయి కనిష్ఠానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ఇప్పటికే పలు రాష్ట్రాలు తమ ఉద్యోగులకు వారానికి 2 రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్‌సౌకర్యాన్ని కూడా కల్పించాయి.

హెచ్‌డిఎఫ్‌సిని వెనక్కి నెట్టిన
ఎయిర్‌టెల్

ముంబయి, మే18: టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ సరికొత్త రికార్డు సృష్టించింది. దేశీయ స్టాక్ మార్కెట్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను వెనక్కి నెట్టింది.దేశంలో రెండో అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. సోమవారం నాటి ట్రేడింగ్‌లో ఎయిర్‌టెల్ షేర్లు రెండు శాతానికి పైగా లాభపడటంతో ఈ రికార్డు సాధ్యమైంది. ఒక దశలో ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ ఏకంగా రూ.11.90 లక్షల కోట్లకు చేరింది.అదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.11.86 లక్షల కోట్లుగా నమోదైంది. దీంతో ఎయిర్‌టెల్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. ప్రస్తుతం దేశంలో రూ.18.09 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో రిలయన్స్ ఇండస్ట్రీస్ మొదటి స్థానంలో కొనసాగుతోంది.

గత వారం రోజుల్లో ఎయిర్‌టెల్ షేర్లు 10 శాతం మేర లాభపడ్డాయి. కానీ ఇదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కేవలం 1 శాతం మాత్రమే పెరిగాయి. గత ఆరు నెలల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 22 శాతం మేర పతనమవడం గమనార్హం. బ్యాంక్ పార్ట్ టైమ్ ఛైర్మన్ అతనుచక్రవర్తి రాజీనామా చేయడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఆర్థిక ఫలితాల విషయానికి వస్తే మార్చి31తో ముగిసిన త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్థిరమైన ప్రదర్శన కనబర్చింది. ఈ బ్యాంక్ నికర లాభం 10.9 శాతం పెరిగి రూ.1,912కోట్లకు చేరింది. బ్యాంక్ నికర ఆదాయం కూడా 3.2 శాతం వృద్ధితో రూ.3,380 కోట్లుగా నమోదైంది. నిరర్థక ఆస్తులు 1.15 శాతంతో స్థిరంగా ఉన్నాయి.

మరోవైపు టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ నికర లాభం ఈ త్రైమాసికంలో 34 శాతం తగ్గింది. ఈ క్వార్టర్‌లో ఎయిర్‌టెల్ రూ.7,325 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే క్వార్టర్‌లో కంపెనీకి రూ.11,021 కోట్ల లాభం వచ్చింది. గత ఏడాది లాభాల్లో రూ.2,892 కోట్ల పన్ను మినహాయింపు కలిసి రావడమే ఈ వ్యత్యాసానికి కారణమని ఎయిర్‌టెల్ పేర్కొంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.